www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 13-4-2025 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 14 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం; తిథి: పాడ్యమి పూర్తి, నక్షత్రం: చిత్త రా.9.11 తదుపరి స్వాతి; వర్జ్యం: తె.3.29-5.17; దుర్ముహూర్తం: సా.4.48-5.37; అమృతఘడియలు: మ.1.58-3.46; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.27 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాష్ట్రపతికీ గడువు

గవర్నర్ పంపే బిల్లులపై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలి: సుప్రీం కోర్టు

దేశచరిత్రలో తొలిసారి రాష్ట్రపతికి గడువు నిర్దేశించిన సర్వోన్నత న్యాయస్థానం



జస్టిస్ జేబీ పార్దీవాలా



జస్టిస్ మహదేవన్

- జాప్యమైతే కారణాలు రాష్ట్ర ప్రభుత్వాలకు తెలపాలి
- గవర్నర్లకే కాదు రాష్ట్రపతికి కూడా సంపూర్ణ వీటో అధికారం ఎంతమాత్రం లేదు
- బిల్లులో రాజ్యాంగ విరుద్ధ అంశాలున్నట్టు భావిస్తే 'సుప్రీం'కు పంపి సలహా తీసుకోవాలి
- శ్రీలంకలో ఇదే విధానం అమలులో ఉంది
- గడువులోగా రాష్ట్రపతి నిర్ణయం తీసుకోకపోతే.. రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టుల్ని ఆశ్రయించవచ్చు
- రాజ్యాంగపరమైన అంశాలు ఇమిడి ఉన్న బిల్లులపై ముందే కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలి
- కేంద్రం అడిగే ప్రశ్నలకు వేగంగా సమాధానాలిచ్చి, సూచనల్ని పరిగణనలోకి తీసుకోవాలి
- తమిళనాడు x గవర్నర్ కేసులో సుప్రీం పూర్తి తీర్పు





న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: గవర్నర్లు పంపే బిల్లులపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ సాక్షాత్తూ రాష్ట్రపతికి గడువు నిర్దేశిస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. అంతకుమించి ఆలస్యమైతే.. జాప్యానికి సహేతుక కారణాలను సైతం నమోదు చేసి, సంబంధిత రాష్ట్రాలకు ఆ విషయాన్ని తెలపాలని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. ఒకవేళ.. ఏదైనా బిల్లు రాజ్యాంగవిరుద్ధంగా ఉందని రాష్ట్రపతి భావిస్తే, ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా దానిపై సుప్రీంకోర్టు సలహా తీసుకోవచ్చని సూచించింది. అలాగే.. గవర్నర్లు పంపే బిల్లులపై నిర్దేశిత గడువులోగా ప్రెసిడెంట్ ఏ చర్యా తీసుకోకపోతే, రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టులను ఆశ్రయించి, రాష్ట్రపతికి వ్యతిరేకంగా రిట్ ఆఫ్ మాండమస్ జారీ చేయాల్సిందిగా కోరుతూ రిట్‌పిటిషన్లు దాఖలు చేయొచ్చని పేర్కొంది. అదే సమయంలో.. గవర్నర్లు పంపే బిల్లులపై రాజ్యాంగంలోని 201వ అధికరణ ప్రకారం రాష్ట్రపతి వ్యవహరించాలని.. రాష్ట్రాలు సైతం కేంద్రం అడిగే ప్రశ్నలకు వేగంగా సమాధానాలు ఇచ్చి సహకరించాలని, కేంద్ర ప్రభుత్వం చేసే సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇలా రాష్ట్రపతికి ఒక అంశంలో నిర్ణయం తీసుకోవడానికి గడువును నిర్దేశిస్తూ తీర్పునివ్వడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి. శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులపై గవర్నర్ రవి ఏ నిర్ణయమూ తీసుకోకుండా తొక్కిపెడుతున్నారంటూ తమిళనాడు సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం తనకున్న విశేషాధికారాలను ఉపయోగించి ఆ బిల్లులు ఆమోదం పొందినట్టుగా ఏప్రిల్ 8న తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఎన్నికైన ప్రజాప్రభుత్వాలు పంపే బిల్లుల విషయంలో నిర్ణయానికి సంబంధించి.. నాడు గవర్నర్లకు గడువు

మిగతా 6వ పేజీలో...


బీసీ బిల్లులపై 3 నెలల్లో నిర్ణయం!

- గవర్నర్ పంపిన రెండు బిల్లుల మీద రాష్ట్రపతి నిర్ణయం తీసుకునే అవకాశం 14
- బిల్లులపై సుప్రీంకోర్టు తాజా తీర్పు ప్రభావం
- ఆమోదించకపోతే కారణాలు చెప్పాలి
- రాష్ట్రపతి న్యాయ సలహా కోరే చాన్స్
- సుప్రీం తీర్పుతో బీసీలకు మేలు: పొన్నం

గవర్నర్ ఆమోదం లేకుండానే.. 6

చట్టాలైన 10 బిల్లులు

గెజిట్ ప్రకటించిన తమిళనాడు ప్రభుత్వం



కొమ్మా రెమ్మా కన్నీరు

- గుండెపోటుతో వనజీవి రామయ్య కన్నుమూత
- కోటికిపైగా మొక్కలు నాటి దేశ విదేశాల్లో ఖ్యాతి 16

బెంగాల్‌లో భారీగా హింస

- వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు హింసాత్మకం
- ముగ్గురి మృతి
- రాష్ట్రంలో వక్ఫ్ చట్టాన్ని అమలు చేయం: మమత 6

ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లకు సుంకాల మినహాయింపు

- సెమీకండక్టర్లు, చిప్‌లు తదితర ఉత్పత్తులకు కూడా..
- చైనాకూ వర్తింపు: అమెరికా



భూ భారతిపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష. చిత్రంలో మంత్రి పొంగులేటి

రేపటి నుంచి భూ భారతి

- మూడు మండలాల్లో ప్రయోగాత్మకంగా..
- ప్రజల నుంచి విజ్ఞప్తుల స్వీకరణ, పరిశీలన
- ఆరు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా అమలు
- తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా లోగో
- ఆరు నెలలపాటు ప్రతి రోజూ సమీక్ష
- ప్రతి మండలంలో సదస్సులు నిర్వహించాలి
- భూ భారతిపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- రేపు శిల్పకళా వేదికలో పోర్టల్ ప్రారంభం
- అత్యంత పేదలు.. అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు
- కమిటీల అనుమతితోనే లబ్ధిదారుల ఎంపిక
- అనర్హులు దక్కించుకుంటే రద్దు చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల సమీక్షలో ముఖ్యమంత్రి

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భూభారతి లోగో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంత గొప్ప టెక్నాలజీ అయినా ప్రజలకు కనిపించదని, ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా లోగోను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భూపరిపాలనలో భాగంగా ఈ నెల 14న 'భూభారతి చట్టం-2025'తో పాటు అమలు మార్గదర్శకాలను ప్రభుత్వం అమల్లోకి తేనుంది. ప్రజల నుంచి విజ్ఞప్తుల స్వీకరణ, పరిష్కార ప్రక్రియను మూడు

మిగతా 15వ పేజీలో...

అభివృద్ధిపై బీఆర్ఎస్ విషం

- కాళేశ్వరం కోసం 8 వేల ఎకరాల అడవిని తొలగించారు 15
- నాడు పర్యావరణం గుర్తు రాలేదా?: దుద్దిళ్ల

తిరోగమనంలో రాహుల్ గాంధీ?



కొత్త పలుకు

కాంగ్రెస్ పార్టీకి ఏమైంది? వరుస ఓటములతో పార్టీ భవిష్యత్తు మసకబారిన సమయంలో పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసేందుకు గుజరాత్‌లో ఇటీవల నిర్వహించిన సదస్సులో కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన ప్రసంగం విన్న వారికి ఆ పార్టీకి భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకం కలగడం లేదు.

ప్రజల ఆలోచనల్లో వస్తున్న మార్పును గుర్తించడానికి నిరాకరిస్తూ తుప్పు పట్టిన భావజాలాన్నే కొనసాగించడం వల్లనే కమ్యూనిస్టు పార్టీలు దెబ్బతింటున్నాయన్న విషయం కమ్యూనిస్టులకు తప్ప అందరికీ అర్థమవుతోంది.

విచిత్రంగా ఇప్పుడు కాంగ్రెస్ కూడా కమ్యూనిస్టులు వాడిన పడికట్టు పదాలనే వాడుతోంది. ప్రజలకు దూరమైన కమ్యూనిస్టులను అనుకరించాలని అనుకోవడమే ఆ పార్టీ భావ దారిద్ర్యంగా కనిపిస్తోంది.

రాహుల్ గుజరాత్‌లో మాట్లాడుతూ... సమాజంలో బడుగు బలహీనవర్గాలను కలుపుకొంటే దళిత, మైనారిటీల జనాభా 90% ఉండగా, దేశ సంపదలో 90% మాత్రం పది శాతం ఉన్న కార్పొరేట్ శక్తుల చేతిలో ఉందని విమర్శించారు.

సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను, పోకడలను ఆకళింపు చేసుకొని అందుకు అనుగుణంగా పార్టీకి దిశానిర్దేశం చేయాల్సిన రాహుల్ ఇప్పుడు తిరోగమనంలో పయనిస్తున్నారు. మరోవైపు మోదీ ప్రజల మనోభావాలకనుగుణంగా వ్యూహ రచన చేస్తూ బీజేపీని విజయ పథంలో నిలబెడుతున్నారు.

దేశంలో కార్పొరేట్ రంగం అభివృద్ధి చెంది, పన్నుల రూపంలో ప్రభుత్వాలకు ఆదాయం సమకూరినప్పుడే సంక్షేమ పథకాలను అమలు చేయగలమన్న ప్రాథమిక సూత్రాన్ని రాహుల్ విస్మరిస్తే ఎలా?

ఒక సమర్థుడికి, ఒక మంచి వాడికి మధ్య పోటీ పెడితే ప్రజలు సమర్థుడినే ఆదరిస్తారు. రాహుల్ గాంధీని ప్రజలు మంచివాడుగానే గుర్తిస్తున్నారు గానీ సమర్థుడిగా అంగీకరించడం లేదు. ఈ ఇరువురిలో ప్రధాని మోదీనే సమర్థుడిగా గుర్తించి ఆదరిస్తున్నారు. అందరి పార్టీగా ఉండాల్సిన పార్టీని కొందరి పార్టీగా రాహుల్ మార్చుతున్నారన్న అభిప్రాయం కూడా ఉంది. మోదీ ఇందుకు పూర్తి భిన్నమైన మార్గాన్ని అనుసరిస్తున్నారు. ముస్లిం మైనారిటీల పట్ల బీజేపీ వివక్ష చూపుతున్నదన్న అభిప్రాయం ఉన్నప్పటికీ మెజారిటీ ప్రజలకు చేరువవడంలో ఆ పార్టీ సక్సెస్ అయింది.

4

ఇక కేసీఆర్ అండ్ కో మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ రగిలించే ప్రయత్నం చేస్తున్నారు. కంచ గచ్చిబౌలి వివాదమైనా, మరొకటైనా చంద్రబాబును బూచిగా చూపించే ప్రయత్నం మొదలెట్టారు. ఆ భూములు హెచ్‌సీయూకి దక్కినా, ప్రభుత్వానికి దక్కినా చంద్రబాబుకు గానీ, మరొకరికిగానీ ఒరిగేదేమీ లేదు. 'ఆంధ్రా' పత్రికలు అంటూ మీడియాకు ప్రాంతీయ తత్వాన్ని అంటగట్టే ప్రయత్నం మొదలెట్టారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన మీడియానే అప్పుడూ ఉంది - ఇప్పుడూ ఉంది.

పరువు ఆత్మహత్య!

- కుమార్తె కులాంతర ప్రేమ వివాహం.. మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య
- నల్లగొండ జిల్లా చిట్యాలలో ఘటన
- తండ్రిని కడసారి చూసేందుకూ రానన్న కుమార్తె



రెముడాల గట్టయ్య (ఫైల్)

చిట్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కుమార్తె కులాంతర ప్రేమ వివాహం చేసుకుందన్న మనస్తాపంతో ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన నల్లగొండ జిల్లా చిట్యాలలో జరిగింది. డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న చిట్యాల వాసి రెముడాల గట్టయ్య (48) కుమార్తె.. అదే పట్టణవాసి ఓ దళిత యువకుడిని ప్రేమించి కుటుంబసభ్యులకు తెలియకుండా గతనెల 8న పెళ్లి చేసుకుంది. దీనిపై గట్టయ్య తన కుమార్తె అదృశ్యమైందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి కుమార్తె ప్రేమవివాహం చేసుకుని జిల్లా ఎస్పీ దగ్గర సరెండర్ అయిందని, తల్లిదండ్రులను కలవనని చెప్పిందని స్థానిక ఎస్‌ఐ అతడికి చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన గట్టయ్య ఈ నెల 10న ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో ఆయన్న కుటుంబసభ్యులు చికిత్స కోసం నార్కట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి.. తర్వాత పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొం దుతూ శనివారం గట్టయ్య మృతి చెందాడు. గట్టయ్య మృతికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ అతడి బంధువులు చిట్యాల పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. అయితే, గట్టయ్య ఫిర్యాదు ఇచ్చిన వెంటనే విచారణ చేపట్టేలోపే.. అతని కుమార్తె తన తల్లిదండ్రులు, బంధువులతో ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరడంతోపాటు తల్లిదండ్రులను కలవనని స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు చిట్యాల ఎస్‌ఐ తెలిపారు. కాగా, గట్టయ్య ఆత్మహత్య వార్తను అతడి కుమార్తెకు ఫోన్‌లో చెప్పి చివరిచూపు కోసం రావాలని బంధువులు కోరుతున్నారన్నా రానని తెగేసి చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకెళ్లి.. విగత జీవులయ్యారు

- నిజామాబాద్ జిల్లా సిద్దాపూర్‌లో బావాబామ్మర్దుల మృతి

నందిపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సరదా కోసం చేపల వేటకెళ్లిన బావాబామ్మర్దులు ప్రమాదవశాత్తు కుంటలో మునిగి మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా నందిపేట మండలంలోని సిద్దాపూర్ గ్రామ శివారులో జరిగింది. నిర్మల్ జిల్లావాసి షేక్ షాదుల్లా (46) కొన్నేళ్ల క్రితం నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి వలస వచ్చి మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా ప్రొద్దుటూరు వాసి, షేక్ పసుపాల మహ్మద్ రఫీక్ (47).. మహ్మద్ రఫిక్ రంజాన్ పండుగకు బావ షేక్ షాదుల్లా ఇంటికి వచ్చాడు. శుక్రవారం వీరిద్దరూ సిద్దాపూర్‌లోని ముని కుంటకు చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పడుతూ రఫీక్ కాలు జారి కుంటలో పడిపోగా, అతడి కోసం షాదుల్లా కూడా దిగాడు. లోతుఉండడం, నీళ్లు పూర్తి స్థాయిలో ఉండడం, పైగా ఈత రాక ఇద్దరూ నీట మునిగి మృతి చెందారు. స్థానికులు శనివారం పోలీసులకు ఈ సంగతి చెప్పారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు విషయాన్ని మృతుల కుటుంబసభ్యులకు తెలియజేసి.. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రచారకర్తగా గుకేష్



హైదరాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): భారత చెస్ గ్రాండ్ మాస్టర్, ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజును తమ విద్యాసంస్థల ప్రచారకర్త(బ్రాండ్ అంబాసిడర్)గా నియమించామని శ్రీచైతన్య విద్యాసంస్థ తెలిపింది. చిన్న వయస్సులోనే గుకేష్ సాధించిన అసాధారణ విజయాలు విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని శ్రీచైతన్య విద్యాసంస్థల సీఈవో సుష్మ బొప్పన ఒక ప్రకటనలో తెలిపారు. గుకేష్ ప్రేరణతో తమ విద్యార్థులు మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తారన్న విశ్వాసం ఉందని పేర్కొన్నారు. బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక కావడంపై గుకేష్ దొమ్మరాజు సంతోషం వ్యక్తం చేశారు. చదరంగంలో విజయానికి ముందస్తు ప్రణాళిక, వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ ఎంతో కీలకమని, పోటీ పరీక్షలకూ ఇదే విధానం అవసరమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఆంధ్రజ్యోతి మెగా డ్రాలో..

ఖమ్మం వాసికి మారుతి స్విఫ్ట్ కారు

డ్రా తీసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. 'ఆంధ్రజ్యోతి' విధానాలు ఆదర్శమని ప్రశంస



ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణతో మంత్రి పొంగులేటి కరచాలనం; మెగా లక్కీ డ్రా తీస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ ఇన్‌చార్జ్ కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో ఇన్‌చార్జ్ మురళీకృష్ణ, అడ్వర్టైజ్‌మెంట్ జీఎంలు శ్రీనివాస్, శివప్రసాద్, సర్క్యులేషన్ ఏజీఎంలు మూర్తి, ప్రసాద్, హెచ్‌ఆర్ అడ్వైజర్ మురళీకుమార్ తదితరులు

హైదరాబాద్ సిటీ/బోనకల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' కార్ అండ్ బైక్ రేస్ మెగా డ్రాలో ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రామాపురం గ్రామానికి చెందిన గుడిపూడి శ్రీనివాసరావు మారుతి స్విఫ్ట్ కారును సొంతం చేసుకున్నారు. ఆంధ్రజ్యోతి 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని 'ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంలో జరిగిన 'ఆంధ్రజ్యోతి' కార్ అండ్ బైక్ రేస్ మెగా డ్రా కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన లక్షకుపైగా కూపన్ల నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి డ్రా తీశారు. అనంతరం విజేతకు ఫోన్ చేశారు. పుట్టిడు వడ్ల లాగా కుప్పపోసిన లక్షల కూపన్లలో మీరు విజేతగా నిలవడం అదృష్టమంటూ గుడిపూడి శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లోని పాఠకులకు ఏటా లక్కీ డ్రా నిర్వహిస్తూ బహుమతులు అందజేస్తూ ఏబీఎన్-ఆంధ్రజ్యోతి అందరికీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ తరహా బహుమతులు అందజేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతికి, సంస్థ ఎండీ రాధాకృష్ణకు మనస్ఫూర్తిగా అభినందలు తెలిపారు. అద్భుతమైన విధానాలతో ఇదే తరహాలో భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని పొంగులేటి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్ వర్క్ ఇన్‌చార్జ్ కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో ఇన్‌చార్జ్ మురళీకృష్ణ, సర్క్యులేషన్ డీజీఎంలు మూర్తి, ప్రసాద్.. అడ్వర్టైజ్‌మెంట్ జీఎంలు శివప్రసాద్, శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.



మెగా లక్కీ డ్రా విజేత శ్రీనివాసరావు దంపతులు

కారు లేని లోటును 'ఆంధ్రజ్యోతి' తీర్చింది

మాకు కారు లేని లోటును 'ఆంధ్రజ్యోతి' తీర్చింది. నాకున్న పదెకరాల భూమితో పాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాను. మూడేళ్లుగా 'ఆంధ్రజ్యోతి' పత్రికను చదువుతున్నాను. లక్కీ డ్రాలో విజేతగా నిలవడం గొప్ప అనుభూతినిచ్చింది. మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉంది. మాకు ఇది నిజమైన పండుగ రోజు. 'ఆంధ్రజ్యోతి' పత్రిక చదవడంతోనే ఇంత గుర్తింపు

కొత్త డీజీపీ ఎంపికపై కసరత్తు

సుప్రీం మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ .. యూపీఎస్సీకి అధికార్ల పేర్ల జాబితాను పంపించనున్న ప్రభుత్వం

- రేసులో రవిగుప్తా, సీవీ ఆనంద్, శివధర్‌రెడ్డి, సౌమ్యామిశ్రా, శిఖాగోయల్
- ముగ్గురిని ఎంపిక చేయనున్న యూపీఎస్సీ
- వారిలోంచి ఒకరు డీజీపీగా ఎంపిక



రవిగుప్తా | సీవీ ఆనంద్ | శివధర్‌రెడ్డి | సౌమ్యామిశ్రా | శిఖాగోయల్

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కొత్త డీజీపీ ఎంపిక కసరత్తును రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. అర్హులైన ఐపీఎస్ అధికారులను గుర్తించి వారి పేర్లను యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ)కి పంపనుంది. ప్రస్తుత డీజీపీ జితేందర్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో పదవీ విరమణ చేస్తారు. దానికి మూడు నెలల ముందు కొత్త డీజీపీ అర్హుల జాబితాను యూపీఎస్సీకి ప్రభుత్వం పంపాల్సి ఉంది. పూర్తిస్థాయి డీజీపీ ఎంపిక కోసం సుప్రీంకోర్టు 2009లో ఇచ్చిన ఆదేశాలను పాటించని రాష్ట్రాలపై కోర్టు ధిక్కారచర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలియచేయాలని గత జనవరిలో సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఆయా రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. వీటిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, బిహార్, ఒడిశా, కేరళ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ఉన్నాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు కొత్త డీజీపీ ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. సదరు మార్గదర్శకాల ప్రకారం.. పూర్తిస్థాయి డీజీపీ పదవికి కనీసం 30 ఏళ్ల సర్వీసు, డీజీపీ హోదాలో పనిచేసిన అనుభవం వంటి అర్హత లుండాలి. రాష్ట్రంలో ప్రస్తుతం డీజీపీ హోదాలో దాదాపు ఏడుగురు అధికారులున్నారు. పదవీ విరమణకు 6 నెలల సర్వీసు ఉన్న అధికారుల పేర్లు కూడా పంపొచ్చు. డీజీపీగా నియమితులైతే రెండేళ్ల ఆ పదవిలో ఉంటారు. రెండేళ్లకన్నా తక్కువ పదవీ కాలం ఉంటే వారికి ఆ మేరకు ఎక్స్‌టెన్షన్ ఇస్తారు.

సీనియర్ అధికారుల పేర్ల పరిశీలన

కొత్త డీజీపీ నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం పలువురు సీనియర్ అధికారుల పేర్లు పరిశీలిస్తోంది. వీరిలో ప్రస్తుత హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా 1990 బ్యాచ్ అధికారి. ఆయన వచ్చే డిసెంబర్‌లో రిటైరవుతారు. ఆ తర్వాత 1991 బ్యాచ్ అధికారి, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌కు 2028 జూన్ వరకు సర్వీసు ఉంది. తర్వాత స్థానంలో 1994 బ్యాచ్ అధికారి, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డికి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు సర్వీసు ఉంది. ఆ తర్వాత స్థానంలో 1994 బ్యాచ్ అధికారి, జైళ్ల శాఖ డీజీ సౌమ్యామిశ్రాకు 2027 డిసెంబర్ వరకు, 1994 బ్యాచ్ అధికారి, సీఐడీ డీజీ శిఖా గోయల్‌కు 2029 మార్చి వరకు సర్వీసు ఉంది. వీరి పేర్లను, సర్వీసు రికార్డును యూపీఎస్సీకి ప్రభుత్వం పంపుతుంది. వారిలోంచి ముగ్గుర్ని యూపీఎస్సీ ఎంపానల్ కమిటీ ఎంపిక చేసి.. ఆ లిస్టును తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతుంది. ఆ ముగ్గురిలో ఒకరిని ప్రభుత్వం డీజీపీగా నియమించాల్సి ఉంటుంది.

పదేళ్లుగా ప్రభుత్వ సన్నిహితులకే పదవి

దాదాపు పదేళ్లుగా నిర్దేశిత విధానాన్ని తెలంగాణలో పాటించకపోవడంతో.. ప్రభుత్వ అధినేతలకు ఇష్టమైన వారే డీజీపీగా ఏళ్ల తరబడి కొనసాగారు. ప్రస్తుత డీజీపీ జితేందర్‌ను కూడా యూపీఎస్సీ మార్గదర్శకాల ప్రకారం ఎంపిక చేయలేదు. సీనియారిటీ ప్రకారం రవిగుప్తా, ఆనంద్, శివధర్‌రెడ్డిల పేర్లతో యూపీఎస్సీ నుంచి ఫైనల్ లిస్టు వెనక్కి రావచ్చని పోలీసుశాఖలో ఊహాగానాలు సాగుతున్నాయి. అయితే, పోలీసుశాఖలో ఉత్తరాది లాబీ బలంగా ఉన్నందున, ఊహించని విధంగా ఉత్తరాదికి చెందిన వారి పేర్లతో జాబితానే వచ్చినా ఆశ్చర్యం లేదని మాజీ పోలీసు ఉన్నతాధికారులు కొందరు పేర్కొంటున్నారు.



ఫ్లాట్ బుక్ చేసుకుంటున్న వినియోగదారులు

కొంపల్లిలో కాస్ గ్రాండ్ ఇవాన్ వెంచర్ ప్రారంభం

- 6.8 ఎకరాల్లో 11 అంతస్తుల్లో 579 ఫ్లాట్ల నిర్మాణం

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి సినీ ప్లానెట్ సమీపంలో కాస్ గ్రాండ్ ఇవాన్ హైదరాబాద్ నార్త్‌లో మూడో వెంచర్ శనివారం ఘనంగా ప్రారంభించింది. 2.7 లక్షల చదరపు అడుగుల రెసిడెంట్స్‌లో వెంచర్ లగ్జరీ కమ్యూనిటీని ప్రపంచ స్థాయి సకల సౌకర్యాలతో నిర్మిస్తుంది. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ వెంచర్‌లో సింగపూర్, జపాన్‌కు చెందిన టెక్నాలజీతో 6.8 ఎకరాలలో 11 అంతస్తుల్లో 579 ఫ్లాట్లను నిర్మిస్తామని కాస్ గ్రాండ్ మార్కెటింగ్ మేనేజర్ ఆదిత్య తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో నిర్మించనున్న ఈ ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారికి 2027లో అందజేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో మొదటి ప్రాజెక్టు శంషాబాద్‌లో, రెండోది తుక్కుగూడలో చేపట్టామని, కొంపల్లిది మూడవ ప్రాజెక్టు అని తెలిపారు. ఇందులో క్లబ్ హౌజ్, జపాన్ తరహాలో గార్డెనింగ్, ఇతర వసతులు కల్పిస్తున్నామన్నారు. మూడు బెడ్‌రూంలు, నాలుగు బెడ్‌రూంల ఫ్లాట్లను నిర్మిస్తామని చెప్పారు. ఒక్కో ఫ్లాట్‌ను 1.6 కోట్లకు విక్రయిస్తున్నామని, లాంచింగ్ రోజు రూ.1.5 కోట్లకు విక్రయించినట్లు తెలిపారు. టోకెన్ అమౌంట్‌గా రూ.2 లక్షలు చెల్లించి ఫ్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకు 80 ఫ్లాట్లను వినియోగదారులు బుక్ చేసుకున్నట్లు సంస్థ సేల్స్ ఎగ్జిక్యూటివ్ తెలిపారు.



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ఆచార్య పి.నాగభూషణ్

వీశాట్ 1 ఫలితాలు విడుదల

- ఈ నెల 16 నుంచి 20 వరకు కౌన్సెలింగ్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్స్ యూనివర్సిటీకి సంబంధించి బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చరల్, ఫార్మా డీ ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన వీశాట్1 (విజ్ఞాన్ స్కొలాస్టిక్ యాప్టిట్యూడ్ టెస్ట్) ఫలితాలను శనివారం వైస్ చాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ విడుదల చేశారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ, హైదరాబాద్ దేశ్‌ముఖి సమీపంలోని విజ్ఞాన్ యూనివర్సిటీ ఆఫ్ క్యాంపస్‌లో ప్రవేశాల కోసం ఈ ఏడాది నిర్వహించిన వీశాట్ 1కి అనూహ్య స్పందన లభించిందన్నారు. ఏపీ, తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి విద్యార్థులు వీశాట్‌కు హాజరైనట్టు చెప్పారు. 85 శాతానికిపైగా విద్యార్థులకు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించడం, పరిశోధనల్లో సత్తా చాటుతుండటంలాంటి అరుదైన విజయాంశాల వల్లనే విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి తమ యూనివర్సిటీకి ఆదరణ లభిస్తోందన్నారు. వీశాట్ 2025 ర్యాంకులతో పాటు జేఈఈ మెయిన్స్ ఫలితాలు, ఎంసెట్ ర్యాంకులు, ఇంటర్మీడియట్ మార్కులను కూడా పరిగణనలోనికి తీసుకుని స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. ఈ నెల 16 నుంచి 20 వరకు మొదటి విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. కాగా.. వీశాట్‌లో తొలి పది ర్యాంకులు కే.రవితేజ (అనంతపురం), నాగెండ్ల నస్వత్ ప్రణయ్(నరసరావుపేట), ఆర్.సాయి తేజ(వరంగల్), కె.మహేష్(విశాఖపట్నం), కె.ప్రియతం కార్తీక్(విజయవాడ), ఎ.సాయిసంతోష్‌రామ్(ఏలూరు), కొప్పుల హర్షిల్(కృష్ణా జిల్లా), ఎ.దేవి శ్రీ చరిత్(మార్చూరు), షేక్ సమీర్ బాబు(గుంటూరు), యు.డోలామణి సత్యనాగశంకర్(రాజోలు, కోనసీమ జిల్లా) సాధించారని డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ క్రిష్ణకిశోర్ తెలిపారు. వీశాట్ 2025 ప్రవేశ పరీక్ష ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉన్నాయని, విద్యార్థుల సెల్‌ఫోన్లకూ ర్యాంకుల వివరాలను పంపిస్తామన్నారు.

బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టుల మృతి

చర్ల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ ప్రాంతంలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఇంద్రావతి నేషనల్ పార్క్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారమందడంతో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారని బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. మృతుల్లో ఇంద్రావతి ఏరియా కమిటీ మెంబర్ అనిల్‌పై రూ.5లక్షల రివార్డు ఉందని, మరో ఇద్దరిని గుర్తించాల్సి ఉందన్నారు. మరోవైపు దంతెవాడ జిల్లాలో శనివారం 8 మంది మావోయిస్టులు లొంగిపోయారు.



Kia Syros

Evolved by the future

At Kia, safety isn't just a feature, it's our promise. The new Syros raises the bar with a bold design, cutting-edge technology, first-of-its-kind features and advanced safety. And now with a 5-star BNCAP rating, it goes on to prove that the new Syros is not just built to impress, but is a complete package.

Enhanced Protection Safety, reimagined

ADAS~ Level 2.0	6 Airbags Standard	Robust 20 Standard Safety Features	Smart Dashcam with Dual Camera	360 Degree Camera with Blind View Monitor

Innovative Technology Future, reimagined


Dual Pane Panoramic Sunroof



2nd Row Seat Reclining & Sliding with Seat Ventilation (Seats Only)



76.20 cm (30") Trinity Panoramic Display Panel



Kia Connect 2.0** with Over-the-Air (OTA) Software Updates and Other 80+ Connected Car Features


Harman Kardon Premium 8 Speakers Sound System


Electric Parking Brake with Auto Hold

Book now | Call 1800 108 5000 | 093195 91407 | Visit www.kia.com | Kia Syros

Terms & Conditions Apply. *Ex-showroom price all India. Segment is defined as vehicle with length between 3 990 mm – 3 999 mm and height - 1 680 mm. **Kia Connect 2.0 comes with 3 years free subscription. Kia Connect 2.0 features may vary depending on the variant, device compatibility, software and network availability in the vehicle. ~Advanced Driver Assistance System (ADAS) is not a substitute for human eye and driver vigilance. It is an assistance feature that enhances driving experience and safety. Effectiveness of ADAS may vary based on actual situation and all objects around vehicle may not be detected. The driver shall remain responsible for safe, vigilant, and attentive driving. The product & feature images shown in this advertisement are for representation purposes only. Color, features and specifications as shown may not be part of standard fitment and may vary or differ slightly depending on models/variants from the one shown in this advertisement. Model shown is subject to availability and may not be available across all variants. Kia India Pvt. Ltd. (Formerly known as Kia Motors India Private Limited) reserves the right to make any changes with respect to the trims, colors, specifications, other details of any model as mentioned or to discontinue any model without prior notice. For more details visit your local Kia dealership. Kia India Pvt. Ltd. urges you to follow traffic rules. these are meant to keep you safe on roads. We do not endorse vandalism or illegal activities related to road safety. Safety is a top priority, and we urge responsible behavior regarding traffic regulations and road safety.

FOR INFORMATION CONTACT: TELANGANA: WARANGAL: MALIK KIA, PH: 9703433333, **HYDERABAD: LANDMARK KIA**, MEDIPALLY, PH: 9281428303, BOWENPALLY, PH: 9347997583, **AUTOMOTIVE KIA**, KONDAPUR, PH: 7995699908, NAGOLE, PH: 7995999404, RC PURAM, PH: PH: 6309908117, AS RAO NAGAR, PH: 6309908118, **CAR KIA**, FINANCIAL DISTRICT, PH: 7330888041, JUBILEE HILLS, PH: 7997858880, GACHIBOWLI: PH: 7799906846, **MALIK KIA**, KUKATPALLY, PH: 7399346666, HIMAYATHNAGAR, PH: 7995999340, 7399386666, **PROSPERA KIA**, MALAKPET, PH: 08047361555, **KARIMNAGAR: MALIK KIA**, PH: 7730911111, **KHAMMAM: AUTOMOTIVE KIA**, PH: 6309908189, **MAHBUBNAGAR: AUTOMOTIVE KIA**, PH: 6309908110, **NALGONDA: AUTOMOTIVE KIA**, PH: 6309908183, **NIZAMABAD: SUNRISE KIA**, PH: 7995939995, **SECUNDERABAD: AUTOMOTIVE KIA**, PH: 7995999146, **MANCHERIAL: SUNRISE KIA**, PH: 7416662030, **ANDHRA PRADESH: ANANTAPUR: MGB KIA**, PH: 8333929195, **BHIMAVARAM: SIMHA KIA**, PH: 8688836542, **CUDDAPPAHA: HOSHI KIA**, PH: 9100773485, **GUNTUR: SIMHA KIA**, PH: 8688836566, **KAKINADA: KANTIPUDI KIA**, PH: 7799740208, **KURNOOL: MGB KIA**, PH: 8500963906, **NELLORE: HOSHI KIA**, PH: 8688829718, **RAJAHMUNDRY: KANTIPUDI KIA**, PH: 7799740208, **TIRUPATI: HOSHI KIA**, PH: 8688829739, **VIJAYAWADA: SIMHA KIA**, PH: 86888365O1, **CASA KIA**, PH: 8345959595, **VISHAKHAPATNAM: LAKSHMI KIA**, PH: 7997815777, **ONGOLE: SANKAR KIA**, PH: 8886624966, **SIMHA KIA**: KUNCHANAPALLI, PH: 7799981582

INNOCEAN-018/25

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ప్రతిరోజూ మూడు నాలుగు గంటలపాటు సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు, వ్యాఖ్యలను చూస్తున్నారు. యూట్యూబ్‌లో మనం ఎటువంటి వీడియోలు చూస్తే అటువంటివే మనకు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా తమకు అనుకూలంగా ఉండే పోస్టులను చూసుకుంటూ వారు మురిసిపోతున్నారు. సోషల్ మీడియాలో ప్రచారం పొందినంత మాత్రాన ఒరిగేది ఏమీ ఉండదు అనడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. హైదరాబాద్‌లో చిన్న హోటల్ నడుపుకొన్న కుమారి ఆంటీకి సోషల్ మీడియాలో విశేష ప్రచారం లభించింది. తర్వాత ఆమె పరిస్థితి ఏమిటి? ఈ కోవలోనే బర్రెలక్క, జ్యోతిష్యుడు వేణుస్వామి, పూసలమ్మే మోనాలిసా, అలేఖ్య పచ్చళ్లు... ఇలా చెప్పుకొంటూ పోతే ఎంతో మందికి సోషల్ మీడియాలో విశేష ప్రచారం కల్పించారు. ఇప్పుడు వారి అడ్రస్ వెదుక్కోవాల్సిన పరిస్థితి. సోషల్ మీడియాతో అట్లుంటది అని కేసీఆర్, కేటీఆర్ తెలుసుకుంటే వారికే మంచిది.

తిరోగమనంలో రాహుల్‌గాంధీ?

అఖిల భారత కాంగ్రెస్ పార్టీకి ఏమైంది? జన్యుపరమైన లోపాలేవో ఆ పార్టీని పట్టిపీడిస్తున్నాయి. స్వాతంత్ర్య సముపార్జనలో అగ్ర భాగాన ఉండి, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగిన ఆ పార్టీ నాయకత్వం ఇప్పుడు వెలవెలబోవడానికి కారణమేమిటి? కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కాంగ్రెస్ పార్టీ జవసత్వాలు కోల్పోవడానికి ఆ పార్టీ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమా? ఈ తరం ఆశిస్తున్నది ఏమిటో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీని తీర్చిదిద్దడంలో, విధానాల రూపకల్పనలో కాంగ్రెస్ నాయకత్వం విఫలమవుతోందా? ప్రపంచీకరణ వైపు ప్రజలు చూస్తున్న ఈ రోజుల్లో కమ్యూనిస్టుల భావజాలాన్ని అందిపుచ్చుకోవడమే ఆ పార్టీకి శాపంగా మారిందా? వరుస ఓటములతో పార్టీ భవిష్యత్తు మసకబారిన సమయంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు గుజరాత్‌లో ఇటీవల నిర్వహించిన సదస్సులో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ చేసిన ప్రసంగం విన్నవారికి ఆ పార్టీకి భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకం కలగడం లేదు. 75 ఏళ్లకు చేరువలో ఉన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పోటీపడటంలో 50 ఏళ్లు పైబడిన రాహుల్‌గాంధీ ఎందుకు వెనుకబడుతున్నారు? అని ప్రశ్నించుకుంటే, ప్రజలు ఏమి కోరుకుంటున్నారు? వారి ఆలోచనలలో వచ్చిన మార్పు ఏమిటి అన్నది పసిగట్టకపోవడమే కారణంగా కనిపిస్తోంది.

కమ్యూనిస్టులు అలా... కాంగ్రెస్ ఇలా...

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో బలంగా ఉండిన కమ్యూనిస్టు పార్టీలు క్రమంగా బలహీనపడిపోవడానికి కారణమేమిటి? ప్రజల ఆలోచనల్లో వస్తున్న మార్పును గుర్తించడానికి నిరాకరిస్తూ తుప్పు పట్టిన భావజాలాన్నే కొనసాగించడం వల్లనే కమ్యూనిస్టు పార్టీలు దెబ్బతింటున్నాయన్న విషయం కమ్యూనిస్టులకు తప్ప అందరికీ అర్థమవుతోంది. సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన మావోయిస్టులనే తీసుకుందాం! ఒకప్పుడు దోపిడీకి గురైన ప్రజలు మావోయిస్టులను ఆశ్రయించి, ఆదరించేవారు. ఇప్పుడు సమాజంలో శ్రమ దోపిడీ అనే మాట పెద్దగా వినపడటం లేదు. ఫలితంగా మావోయిస్టుల అవసరం జనానికి లేకుండా పోయింది. ప్రపంచీకరణ కారణంగా కష్టపడే వారికి ఉపాధి అవకాశాలకు కొదవ ఉండటం లేదు. జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడ్డాయి. ఫలితంగా మావోయిస్టులు బలహీనపడుతున్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యుద్ధంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ శాంతి చర్చల మంత్రం జపిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మావోయిస్టులు చరిత్ర పుటలకే పరిమితం అవుతారు. కమ్యూనిస్టుల పరిస్థితి కూడా ఇంచుమించుగా ఇలాగే ఉంది. దళిత, మైనారిటీ సంక్షేమం కోసం పోరాడటమే తమ లక్ష్యంగా భావించిన కమ్యూనిస్టులు కాలక్రమంలో మెజారిటీ ప్రజలకు దూరమయ్యారు. యువ తరానికి పూర్తిగా దూరమయ్యారు. సమస్యలు ఎదురైనప్పుడు కమ్యూనిస్టులను ఆశ్రయించిన దళిత, మైనారిటీలు ఎన్నికల సమయంలో మాత్రం వారికి ముఖం చాటేసేవారు. 'బూర్జువా' పార్టీలకే ఓటు వేసేవారు. ఈ పరిణామాన్ని గుర్తించి, తమ విధానాలను సంస్కరించుకోవడానికి నిరాకరించిన కమ్యూనిస్టులు ఇప్పుడు ఇలా మిగిలారు. విచిత్రంగా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా కమ్యూనిస్టులు వాడిన పడికట్టు పదాలనే వాడుతోంది. ప్రజలకు దూరమైన కమ్యూనిస్టులను అనుకరించాలని అనుకోవడమే ఆ పార్టీ భావదారిద్ర్యంగా కనిపిస్తోంది.

కాంగ్రెస్... నాడు, నేడు

దేశానికి స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తర్వాత కాంగ్రెస్ నాయకత్వం అనుసరించిన విధానాలు ఏమిటి? ఇప్పుడు ఆ పార్టీ యువ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? అని ప్రశ్నించుకుంటే పొంతనే ఉండటం లేదు. తొలి తరం కాంగ్రెస్ నాయకత్వం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించింది. ఆ తర్వాత దశలో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రైవేటీకరణను ప్రోత్సహించారు. ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే పేదల సంక్షేమం చేపట్టవచ్చని నమ్మారు. అయితే, కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ ముస్లిం మైనారిటీలను సంతృప్తిపరచడానికే ప్రాధాన్యం ఇచ్చేదన్న అభిప్రాయం ఉండేది. ఈ కారణంగా మెజారిటీ ప్రజలు క్రమంగా ఆ పార్టీకి దూరమవుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గుజరాత్ సదస్సులో మాట్లాడుతూ... సమాజంలో బడుగు బలహీనవర్గాలను కలుపుకొంటే దళిత, మైనారిటీల జనాభా 90 శాతం ఉండగా, దేశ సంపదలో 90 శాతం మాత్రం పది శాతం ఉన్న కార్పొరేట్ శక్తుల చేతిలో ఉందని విమర్శించారు. సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగి, మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్న పార్టీ నాయకుడి నోట ఇటువంటి మాటలు రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఒకప్పుడు కమ్యూనిస్టులు ఇటువంటి వ్యాఖ్యలు చేసేవారు. ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ, నాయనమ్మ ఇందిరా గాంధీ అనుసరించిన విధానాలను కూడా రాహుల్‌గాంధీ అధ్యయనం చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది. దళిత, మైనారిటీలతో పాటు బడుగు, బలహీనవర్గాల వారి అభ్యున్నతిని కాంక్షించని వారు ఉండరు. అలాగే ఆ వర్గాలవారు రాజకీయంగానూ ఎదగాలని ఏ పార్టీ అయినా కోరుకుంటుంది. ప్రధానమంత్రి మోదీ స్వయంగా తాను బీసీని అని చెప్పుకోవడం దేనికి సంకేతం? కాంగ్రెస్‌లో ఒకప్పుడు బ్రాహ్మణులు అధికంగా కనిపించేవారు. ఉత్తరాది రాష్ట్రాలలో బ్రాహ్మణ నాయకత్వమే ఉండేది. కాలక్రమంలో బ్రాహ్మణులు కనుమరుగై ఇతర అగ్ర వర్ణాలవారు నాయకత్వం వహించే స్థితికి ఎదిగారు. ఇప్పుడు క్రమంగా బడుగు బలహీనవర్గాలవారు నాయకత్వ స్థానాలను అందుకుంటున్నారు. ఇదొక సహజ ప్రక్రియ. బ్రాహ్మణ ఆధిపత్యం పోవడానికి ఎవరూ కారణం కాదు. అలాగే బడుగు బలహీనవర్గాల వారు నాయకత్వ స్థానాల్లోకి రావడానికి కూడా ప్రత్యేకంగా ఎవరూ కారణం కాదు. సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పులే ఇందుకు కారణం. గ్రామాలలో భూమి ఎవరి ఆధీనంలో ఉంటే వారికే రాజకీయ అధికారం లభించడం సహజమని అంటారు. ఒకప్పుడు భూమి బ్రాహ్మణుల వద్ద ఉండేది. వారు పట్టణాలకు వలస వెళ్లిన తర్వాత ఇతర అగ్ర వర్ణాల చేతుల్లోకి భూమి వెళ్లింది. దీంతో రాజ్యాధికారం వారికి దక్కింది. ఇప్పుడు క్రమంగా భూమి బలహీనవర్గాలు, దళితుల చేతుల్లోకి వెళుతోంది. ఈ క్రమంలో అతి త్వరలోనే రాజ్యాధికారం బలహీనవర్గాలు, దళితులకు అందబోతోందని అనుకోవాలి. ఈ పరిణామం పరిపక్వం చెందక ముందే సామాజిక న్యాయం పేరిట కొన్ని పార్టీలు రాజకీయ విన్యాసాలు చేసి విఫలమయ్యాయి. తెలుగు రాష్ట్రాలలో ఇది చూశాం. సామాజిక న్యాయం పేరిట బీసీలకు, దళితులకు ఎన్నికల్లో టికెట్లు ఇచ్చినంత మాత్రాన విజయం వరించదు. 2014 ఎన్నికల్లో తెలంగాణలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్న తెలుగుదేశం పార్టీ బీసీ నినాదాన్ని అందిపుచ్చుకుంది. బీసీ సంఘాల నాయకుడు ఆర్.కృష్ణయ్యను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. అయినా అగ్రవర్ణానికి చెందిన కేసీఆరే అధికారంలోకి వచ్చారు. ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికల్లో కూడా ముఖ్యమంత్రి పదవి కోసం కేసీఆర్–రేవంత్‌రెడ్డి మధ్యనే పోటీ జరిగింది. ఎన్నికల్లో నిజానికి ఫలానా ఫార్ములానే పని చేస్తుందని చెప్పలేం. ఎన్నికల సమయానికి ఉన్న పరిస్థితులను బట్టి ప్రజలు ఓటేస్తారు. ఉత్తరాదిలో ఉన్నంతగా దక్షిణాదిలో కులాల ప్రాబల్యం కనిపించదు. సామాజిక న్యాయంతో పాటు పేదలు–పెత్తందారుల మధ్య యుద్ధం అని ప్రకటించిన జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో ఘోరంగా ఓడిపోయారు కదా? ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ఒకప్పుడు బ్రాహ్మణుల ఆధిపత్యం ఉన్నప్పుడు వారు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండేవారు. కాల క్రమంలో ఆ వర్గంవారు భారతీయ జనతా పార్టీ వైపు జరిగారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను, పోకడలను ఆకళింపు చేసుకొని అందుకు అనుగుణంగా పార్టీకి దిశానిర్దేశం చేయవలసిన రాహుల్‌గాంధీ ఇప్పుడు తిరోగమనంలో పయనిస్తున్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మనోభావాలకు అనుగుణంగా వ్యూహరచన చేస్తూ భారతీయ జనతా పార్టీని విజయపథంలో నిలబెడుతున్నారు. '75 ఏళ్ల వయసులో కూడా ప్రధాని మోదీ యువతను ఆకర్షించడానికి కారణం ఏమిటి? 50లలో నేను యువతను ఎందుకు ఆకర్షించలేకపోతున్నాను?' అని రాహుల్ గాంధీ ఆత్మపరిశీలన చేసుకోవాలి కదా! ఒక సమర్థుడికి, ఒక మంచివాడికి మధ్య పోటీ పెడితే ప్రజలు సమర్థుడినే ఆదరిస్తారు. రాహుల్‌గాంధీని ప్రజలు మంచివాడుగానే గుర్తిస్తున్నారు గానీ సమర్థుడిగా అంగీకరించడం లేదు. ఈ ఇరువురిలో ప్రధాని మోదీనే సమర్థుడిగా గుర్తించి ఆదరిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ మెజారిటీ ప్రజలకు చేరువ అవుతుండగా, కాంగ్రెస్ పార్టీ దూరమవుతోంది. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా, యువతరం మనోభావాలతో పొంతన లేకుండా రాహుల్‌గాంధీ ఆలోచనలు ఉండటం కాంగ్రెస్ పార్టీకి శాపంగా పరిణమిస్తోంది.

కాలానుగుణంగా మారాలి...

ప్రపంచీకరణ వల్ల ప్రజల ఆలోచనలు మారిపోయాయి. ప్రపంచ మానవాళి మెరుగైన జీవితాలను కోరుకుంటోంది. కార్పొరేట్ శక్తులకు ఈ పరిణామం సహజంగానే ఉపకరిస్తోంది. వ్యవసాయాన్ని నమ్ముకున్నవారు కూడా తమ పిల్లలు వ్యవసాయం చేయాలని కోరుకోవడం లేదు. చిన్నదో పెద్దదో పట్టణాలు, నగరాల్లో ఉద్యోగాలు చేయాలని కోరుకుంటున్నారు. గ్రామాల్లో నివసించడానికి కూడా ఇష్టపడటం లేదు. ఈ క్రమంలో కార్పొరేట్ రంగానికి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ మాట్లాడటం వలన ప్రయోజనం ఏమిటో తెలియదు. బడుగు బలహీనవర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందించాలన్నా ఆర్థికాభివృద్ధి సాధించాలి కదా? దేశంలో కార్పొరేట్ రంగం అభివృద్ధి చెంది, పన్నుల రూపంలో ప్రభుత్వాలకు ఆదాయం సమకూరినప్పుడే సంక్షేమ పథకాలను అమలు చేయగలమన్న ప్రాథమిక సూత్రాన్ని రాహుల్‌గాంధీ విస్మరిస్తే ఎలా? దేశంలో కమ్యూనిస్టు పార్టీల పరిస్థితి కళ్లెదుటే కనిపిస్తున్నప్పటికీ... ఆయన అవే విధానాలను అందిపుచ్చుకోవడం కాంగ్రెస్ పార్టీకి మేలు చేయదు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? ఎన్నికల్లో ఆయన విజయాలు అందుకోవడానికి కారణం ఏమిటి? అని అధ్యయనం చేయకుండా కాలం చెల్లిన పాత చింతకాయ పచ్చడి వంటి నినాదాలను అందిపుచ్చుకోవడం అవివేకం అవుతుంది. ఈ వర్గం, ఆ వర్గం అన్న తేడా లేకుండా కాంగ్రెస్ పార్టీకి యువ నాయకత్వం ఉండి కూడా యువతరం ఎందుకు తమకు దూరమవుతోందో గుర్తించే ప్రయత్నం చేయాలి కదా? గుజరాత్ ప్లీనరీలో ఈ దిశగా చర్చలు జరపకుండా ప్రధాని మోదీని తిట్టిపోయడం వల్ల ప్రయోజనం ఏమిటి? కాంగ్రెస్ పార్టీ చరిత్ర ఏమిటి? స్వాతంత్ర్య పోరాటంలో ఆ పార్టీ పాత్ర గురించి నేటి తరంలో ఎంత మందికి తెలుసు? ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల బలిదానాల గురించి కూడా తెలియదే! పార్టీకి దూరమైన మెజారిటీ ప్రజలతో కనెక్టయ్యే ప్రయత్నం చేయకుండా, కాంగ్రెస్ పార్టీ అందరిదీ అన్న భావనకు దూరంగా జరిగిపోవడమే ఆ పార్టీకి శాపమైంది. అందరి పార్టీగా ఉండాల్సిన పార్టీని కొందరి పార్టీగా రాహుల్ గాంధీ మార్చుతున్నారన్న అభిప్రాయం కూడా ఉంది. ప్రధాని మోదీ ఇందుకు పూర్తి భిన్నమైన మార్గాన్ని అనుసరిస్తున్నారు. ముస్లిం మైనారిటీల పట్ల భారతీయ జనతా పార్టీ వివక్ష చూపుతున్నదన్న అభిప్రాయం ఉన్నప్పటికీ మెజారిటీ ప్రజలకు చేరువవడంలో ఆ పార్టీ సక్సెస్ అయింది. ఇటీవల నిర్వహించిన కుంభమేళానే ఇందుకు నిదర్శనం. ఈ రాష్ట్రం, ఆ రాష్ట్రం అన్న తేడా లేకుండా, మైనారిటీలను మినహాయిస్తే అన్ని వర్గాల ప్రజలు కుంభమేళాలో పాల్గొన్నారు. ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంలో ప్రధాని మోదీ సక్సెస్ అయ్యారు. ఈ కారణంగానే భారతీయ జనతా పార్టీ మతతత్వ విధానాలను అనుసరిస్తుందన్న విమర్శ ఉన్నప్పటికీ మెజారిటీ ప్రజలు ఆ పార్టీ వైపే చూస్తున్నారు. మెజారిటీ ప్రజలు అంటే అందులో బడుగు బలహీనవర్గాలవారు కూడా ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు, రాజకీయ నాయకుల ఆలోచనా ధోరణులు మారుతున్నాయి. 'అమెరికా ఫస్ట్' అన్న నినాదంతో ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మెజారిటీ అమెరికన్లను ఆకర్షించగలిగారు. వివిధ దేశాల్లో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు, ప్రజల ఆలోచనల్లో వస్తున్న మార్పును గుర్తించి రాహుల్‌గాంధీ తనను తాను సంస్కరించుకోని పక్షంలో ఆ పార్టీ సమీప భవిష్యత్‌లో అధికారంలోకి రాలేదు. ప్రపంచ దేశాల అనుభవాలను అటుంచితే మన దేశంలో వచ్చిన, వస్తున్న మార్పులనైనా అధ్యయనం చేసే ప్రయత్నం ఆయన వెంటనే చేయాలి. దళిత, మైనారిటీలకు అండగా నిలబడటం వేరు, ఆ వర్గాలకు మాత్రమే పరిమితమైన పార్టీగా కుదించుకుపోవడం వేరు. ఈ తేడాను రాహుల్‌గాంధీ గుర్తించాలి. ప్రజల ఆలోచనలకు దూరంగా వెళ్లిపోవడం వల్ల కమ్యూనిస్టుల వలె కాంగ్రెస్ కూడా బలహీనపడిపోయే ప్రమాదం ఉంది.

> **దళిత, మైనారిటీలకు అండగా నిలబడటం వేరు, ఆ వర్గాలకు మాత్రమే పరిమితమైన పార్టీగా కుదించుకుపోవడం వేరు. ఈ తేడాను రాహుల్‌గాంధీ గుర్తించాలి. ప్రజల ఆలోచనలకు దూరంగా వెళ్లిపోవడం వల్ల కమ్యూనిస్టుల వలె కాంగ్రెస్ కూడా బలహీనపడిపోయే ప్రమాదం ఉంది.**



> **కార్పొరేట్ రంగానికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ మాట్లాడటం వలన ప్రయోజనం ఏమిటో తెలియదు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? ఎన్నికల్లో ఆయన విజయాలు అందుకోవడానికి కారణం ఏమిటి? అని అధ్యయనం చేయకుండా కాలం చెల్లిన పాత చింతకాయ పచ్చడి వంటి నినాదాలను అందిపుచ్చుకోవడం అవివేకం అవుతుంది. ఈ వర్గం, ఆ వర్గం అన్న తేడా లేకుండా కాంగ్రెస్ పార్టీకి యువ నాయకత్వం ఉండి కూడా యువతరం ఎందుకు తమకు దూరమవుతోందో గుర్తించే ప్రయత్నం చేయాలి కదా? గుజరాత్ ప్లీనరీలో ఈ దిశగా చర్చలు జరపకుండా ప్రధాని మోదీని తిట్టిపోయడం వల్ల ప్రయోజనం ఏమిటి? కాంగ్రెస్ పార్టీ చరిత్ర ఏమిటి? స్వాతంత్ర్య పోరాటంలో ఆ పార్టీ పాత్ర గురించి నేటి తరంలో ఎంత మందికి తెలుసు? ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల బలిదానాల గురించి కూడా తెలియదే! పార్టీకి దూరమైన మెజారిటీ ప్రజలతో కనెక్టయ్యే ప్రయత్నం చేయకుండా, కాంగ్రెస్ పార్టీ అందరిదీ అన్న భావనకు దూరంగా జరిగిపోవడమే ఆ పార్టీకి శాపమైంది.**

సెంటిమెంటు అస్త్రం

కాంగ్రెస్ పార్టీ విషయం అలా ఉంచి, తెలుగునాట చోటుచేసుకుంటున్న పరిణామాల విషయానికి వద్దాం! ఆంధ్రప్రదేశ్‌లో జగన్ అండ్ కో, తెలంగాణలో కేసీఆర్ అండ్ కో తమ పాత కుయుక్తులతో అటు కూటమి ప్రభుత్వాన్ని, ఇటు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణలో కేసీఆర్ అండ్ కో మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ రగిలించే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును వాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, చంద్రబాబుకు మధ్య ఉన్న అనుబంధాన్ని తెలంగాణ సెంటిమెంటును రగిలించేందుకు వాడుకోవాలని చూస్తున్నారు. కంచ గచ్చిబౌలి వివాదమైనా, మరొకటైనా చంద్రబాబును బూచిగా చూపించే ప్రయత్నం మొదలెట్టారు. ఆ భూములు సెంట్రల్ యూనివర్సిటీకి దక్కినా, ప్రభుత్వానికి దక్కినా చంద్రబాబుకు గానీ, మరొకరికిగానీ ఒరిగేదేమీ ఉండదు. అయినా తెలంగాణకు నష్టం జరగబోతోందంటూ పిచ్చి ప్రచారం మొదలుపెట్టారు. ఈ క్రమంలో 'ఆంధ్రా' పత్రికలు అంటూ మీడియాకు ప్రాంతీయ తత్వాన్ని అంటగట్టే ప్రయత్నం మొదలెట్టారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన మీడియానే అప్పుడూ ఉంది – ఇప్పుడూ ఉంది. ఇంతకాలంగా తెలంగాణ సెంటిమెంట్ ద్వారా ఆర్థికంగా, రాజకీయంగా లాభపడిన కేసీఆర్ కుటుంబం ఇప్పుడు మళ్లీ అదే పాత అస్త్రాన్ని బయటకు తీస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు తమ దురహంకార పోకడలను తెలంగాణ సమాజం తిరస్కరించి ఇంట్లో కూర్చోబెట్టిన వాస్తవాన్ని గుర్తించకుండా మళ్లీ సెంటిమెంట్‌పై ఆధారపడాలనుకోవడం ఆశ్చర్యంగా ఉంది. భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ప్రతిరోజూ మూడు నాలుగు గంటలపాటు సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు, వ్యాఖ్యలను చూస్తున్నారు. యూట్యూబ్‌లో మనం ఎటువంటి వీడియోలు చూస్తే అటువంటివే మనకు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా తమకు అనుకూలంగా ఉండే పోస్టులను చూసుకుంటూ వారు మురిసిపోతున్నారు. సోషల్ మీడియాలో ప్రచారం పొందినంత మాత్రాన ఒరిగేది ఏమీ ఉండదు అనడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. హైదరాబాద్‌లో చిన్న హోటల్ నడుపుకొన్న కుమారి ఆంటీకి సోషల్ మీడియాలో విశేష ప్రచారం లభించింది. తర్వాత ఆమె పరిస్థితి ఏమిటి? ఈ కోవలోనే బర్రెలక్క, జ్యోతిష్యుడు వేణుస్వామి, పూసలమ్మే మోనాలిసా, అలేఖ్య పచ్చళ్లు... ఇలా చెప్పుకొంటూ పోతే ఎంతో మందికి సోషల్ మీడియాలో విశేష ప్రచారం కల్పించారు. ఇప్పుడు వారి అడ్రస్ వెదుక్కోవాల్సిన పరిస్థితి. సోషల్ మీడియాతో అట్లుంటది అని కేసీఆర్, కేటీఆర్ తెలుసుకుంటే వారికే మంచిది. రాష్ట్రం విడిపోయి పదేళ్లు దాటింది. ఇప్పుడు మళ్లీ తెలంగాణ సెంటిమెంటును రాజేయాలని అనుకోవడం కూడా విఫలయత్నమే అవుతుంది. తనను నెత్తిన పెట్టుకున్న తెలంగాణ సమాజమే గత ఎన్నికల్లో తనను కిందకు విసిరేయడానికి కారణం ఏమిటో గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకోకుండా సెంటిమెంటును తిరిగి రగిలించాలనుకుంటే అది వారి ఇష్టం. కేసీఆర్ కుటుంబంపై తెలంగాణ ప్రజలు ఇంకా ఆగ్రహంగానే ఉన్నారన్నది వాస్తవం. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా నేల విడిచి సాము చేస్తే ఆయాసమే మిగులుతుంది.

మళ్లీ అవే కుట్రలు...

ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే... మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గతంలో తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమలు చేసిన కపట నాటకాలకు, కుట్ర సిద్ధాంతాలకు మళ్లీ తెరతీశారు. తన స్వభావానికి ఏ మాత్రం సరిపడవని తెలిసి కూడా ఆయన నోటివెంట ఇటీవలి కాలంలో విలువలు, విశ్వసనీయత, పత్రికా స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులు వంటి పదాలు వినిపిస్తున్నాయి.

బాబాయ్ హత్య, కోడికత్తి, గులకరాయి వంటి కుట్ర సిద్ధాంతాలను తెరమీదకు తెచ్చి గతంలో లాభపడ్డారు. ఇప్పుడు మళ్లీ అదే చేస్తున్నారు. సత్యసాయి జిల్లా పర్యటన సందర్భంగా పార్టీ కార్యకర్తలను తాను ప్రయాణించిన హెలికాప్టర్‌పైకి ఉద్దేశపూర్వకంగా ఉసిగొల్పి విండ్ షీల్డ్‌కు నష్టం చేయించారు. కూటమి ప్రభుత్వం జగన్‌కు హాని తలపెట్టిందని ఆ వెంటనే ప్రచారం మొదలెట్టారు. అధికారంలోకి రాక ముందు, వచ్చిన తర్వాత జరిగిన పరిణామాలను, కుట్ర సిద్ధాంతాలను పరిశీలిస్తే జగన్‌రెడ్డి వల్ల ఎవరికైనా హాని ఉంటుందేమోగానీ... ఇతరుల వల్ల ఆయనకు ఎటువంటి హానీ ఉండదని చెప్పవచ్చు. గొడ్డలి వేటు వల్ల ఒళ్లంతా గాయాలై రక్తం మడుగులో వివేకానంద రెడ్డి శవంగా పడివున్నప్పటికీ గుండెపోటు అని నమ్మించే ప్రయత్నం చేసినవారు ముందు ముందు ఇంకెన్ని నాటకాలకు తెరలేపుతారో వేచి చూడాలి. సత్యసాయి జిల్లా పర్యటన సందర్భంగా పోలీసులను బట్టలూడదీసి నిలబెట్టి, ఉద్యోగాలు లేకుండా చేస్తానని జగన్‌రెడ్డి బెదిరించడం కూడా వివాదాస్పదం అయింది. రాజకీయ నాయకులు అధికారంలో లేనప్పుడు... అధికారులను, పోలీసులను 'మేం అధికారంలోకి వస్తే' అని బెదిరించడం పరిపాటే. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇలా బెదిరించినప్పుడు ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. అందుకు ఆయన ట్రాక్ రికార్డ్ కారణం. అదే జగన్‌రెడ్డి విషయంలో తేలికగా తీసుకోలేని పరిస్థితి. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఎదురైన అనుభవాలు ఇందుకు కారణం. ఈ కారణంగానే జగన్‌రెడ్డి 2.0 పాలన వస్తుందంటే భయపడే వారి సంఖ్య అధికంగా ఉంటోంది. జగన్‌రెడ్డి పాలనను ప్రజలు మరచిపోలేరు కనుకే ఆయన మళ్లీ అధికారంలోకి వస్తారన్న భావన వస్తేనే ఉలిక్కిపడుతున్నారు. కూటమి శ్రేణులు కూడా ఈ కారణంగానే సొంత ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అరాచకంగా ప్రవర్తించిన వారిపై ఇంకెప్పుడు చర్యలు తీసుకుంటారు? అని నిలదీస్తున్నారు. కూటమి శ్రేణులు, తెలుగు తమ్ముళ్ల ఆవేదనలో అర్థం లేకపోలేదు. పోలీసుల అదుపులో ఉన్న తెలుగుదేశం కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ దాడికి ప్రయత్నించడం, శుక్రవారం నాడు సీఐడీ విచారణకు హాజరైన మాజీ మంత్రి జోగి రమేశ్ మాట్లాడిన విధానం గమనిస్తే తెలుగు తమ్ముళ్ల ఆక్రోశంలో అర్థం ఉందని అంగీకరించక తప్పదు. నాడు చంద్రబాబు కుటుంబాన్ని, పవన్ కల్యాణ్ కుటుంబాన్ని, మరెందరో మహిళలను అవమానించిన వారిని ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి సత్కరించగా, ఇప్పుడు జగన్ భార్య భారతి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్ అనే సొంత పార్టీ కార్యకర్తను ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు చేయించారు. ఇద్దరి మధ్య ఉన్న ఈ తేడాను ప్రజలు అర్థం చేసుకోలేరా? కిరణ్ ముఖానికి పోలీసులు ముసుగు ఎందుకు వేశారో తెలియదు. కొన్ని కేసులలో విచారణ ప్రక్రియలో భాగంగా జరిగే 'ఐడెంటిఫికేషన్ పరేడ్'లో నిందితులను సాక్షులు గుర్తించాల్సి ఉంటుంది. అందుకే... అంతకుముందు వారిని ముసుగు వేసి తెస్తారు. ఇక్కడ కిరణ్ తాను తప్పు చేశానని స్వయంగా అంగీకరించినందున ముసుగు అవసరం లేదు. పోలీసుల ఓవరాక్షన్ ఇది. గోరంట్ల మాధవ్‌తో పాటు అరెస్టు చేసిన వారికి కూడా అనవసరంగా ముసుగులు వేశారు. ఇలా చేయడం గుంటూరు పోలీసుల తప్పిదమే. చేబ్రోలు కిరణ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని ఆక్షేపించని తెలుగు తమ్ముళ్లు... పోలీసులు ఆయన ముఖానికి ముసుగు వేసి అవమానించడాన్ని మాత్రం జీర్ణించుకోలేకపోయారు. దీంతో పార్టీ నాయకత్వంపై తిరగబడినంత పని చేశారు. దీన్ని బట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియాను వేదికగా చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్ల నుంచి ఎంత ఒత్తిడి ఎదుర్కొంటున్నారో అర్థం చేసుకోవచ్చు. జగన్ పాలనలో చోటుచేసుకున్న దుశ్చర్యలే ప్రస్తుత వైషమ్యాలకు కారణం!


దార్శనిక ఆర్థికవేత్త అంబేడ్కర్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదు, దార్శనిక ఆర్థికవేత్త కూడా. మన కేంద్ర బ్యాంకు అంటే ఆర్బీఐ (భారత రిజర్వ్ బ్యాంక్) వ్యవస్థాపనకు ఆయన అర్థశాస్త్ర విద్వత్తు విశేషంగా దోహదం చేసింది. భారతదేశానికి ఒక కేంద్ర బ్యాంక్ (ఇదే తదనంతర కాలంలో ఆర్బీఐగా మారింది) నేర్పాటు చేయాలని 1926లో బ్రిటిష్ వైస్రాయి లార్డ్ రీడింగ్‌కు సిఫారసు చేసిన రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్ (హిల్టన్ యంగ్ కమిషన్‌గా సుప్రసిద్ధమైనది) మన దేశంలో పర్యటించినప్పుడు ఆ కమిషన్ సభ్యులు ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ పరిశోధనా గ్రంథం 'ది ప్రాబ్లెమ్ ఆఫ్ రూపీ'ని ప్రమాణంగా తీసుకోవడం గమనార్హం. భారతదేశానికి ఒక కేంద్ర బ్యాంకు ఏర్పాటు ఆవశ్యకతను వారు ఆ పుస్తకం ఆధారంగా నొక్కి చెప్పారు.

అంబేడ్కర్ మేధో కృషిలో అంతర్భాగంగా ఉన్న సుస్థిరాభివృద్ధి సూత్రాలు ఆయన ఆర్థిక దార్శనికతకు మరొక విశిష్ట తార్కాణం. ఆయన రచనలు, ఉపన్యాసాలు, ఉద్యమాలకు సైతం ఆ దార్శనికత ఒక స్ఫూర్తిగా ఉన్నది. ప్రత్యేకించి ఆయన అర్థశాస్త్ర పరిశోధనలను వర్తమాన భారతదేశం అధ్యయనం చేయవలసిన అవసరమున్నది. నేటి వికసిత్ భారత్ లక్ష్యాలకు ఆయన ఆలోచనలు సమతూకంగా ఉన్నాయి. ప్రతి ఒక్కరూ విద్యతో చైతన్యాన్ని, సాధికారతను సాధిస్తారని ఆయన నినదించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికై సామాజిక న్యాయం, ఆర్థిక అభివృద్ధిపై దృష్టి సారించి ఆయన పరిశోధనలు చేశారు. వెనుకబడిన వర్గాల వారి హక్కుల పరిరక్షణకు ప్రపంచ వేదికల మీద ఉపన్యసించారు. ఎదురైన ప్రతి ప్రశ్నకు దీటుగా సమాధానం చెప్పారు. వీటిని గ్రంథస్థం చేశారు. అలా వెలుగు చూసిన గ్రంథమే 'అన్నిలేషన్ ఆఫ్ క్యాస్ట్' (కుల నిర్మూలన). కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి కామర్స్, పొలిటికల్ ఎకానమీలలో ఆయన డాక్టరేట్ డిగ్రీలు పొందారు. దక్షిణాసియా నుంచి ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ డిగ్రీ పొందిన మొదటి వ్యక్తి కూడా ఆయనే. అంతేకాదు ఆయన బహుభాషా కోవిదుడు. ఇంగ్లీషు, పాళీ, సంస్కృతం, హిందీ, మరాఠీ, బెంగాలీ, కొంకిణి భాషల మీద సాధికారత ఉన్న విద్వజ్జుడు. భారతీయ ప్రాచీన సాహిత్యాన్ని ప్రగాఢంగా అధ్యయనం చేశారు. కనుకనే బ్రిటిష్ పాలకుల ముందు భారతీయ సమాజాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించగలిగారు.

రిజర్వ్ బ్యాంక్ వ్యవస్థాపనకు స్ఫూర్తినిచ్చిన తన పరిశోధనా గ్రంథాలు 'ది ప్రోబ్లమ్ ఆఫ్ రూపీ', 'నేషనల్ డివిడెండ్ ఆఫ్ ఇండియా'లో భూ సంస్కరణలు, బంగారం విలువను నిర్ధారించే ప్రమాణాలు, ద్రవ్య విధానాలు మొదలైన అంశాలను అంబేడ్కర్ విపులంగా చర్చించారు.

> **భారతదేశానికి ఒక కేంద్ర బ్యాంక్ (ఇదే తదనంతర కాలంలో ఆర్బీఐగా మారింది) ఏర్పాటు చేయాలని 1926లో బ్రిటిష్ వైస్రాయి లార్డ్ రీడింగ్‌కు రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్ సిఫారసు చేసింది. డాక్టర్ అంబేడ్కర్ పరిశోధనా గ్రంథం 'ది ప్రాబ్లెమ్ ఆఫ్ రూపీ' ఆధారంగానే కమిషన్ ఆ నిర్ణయానికి వచ్చింది.**



పౌరుల ప్రాథమిక హక్కుల రక్షణ విషయమై రాజ్యాంగపరిషత్తు సమావేశాల్లో ఆయన సమగ్రంగా చర్చించారు. ముసాయిదా కమిటీ అధ్యక్షునిగా బ్రిటీష్ పాలకులను, నాటి జాతీయ కాంగ్రెస్, ఇతర సభ్యులను ఒప్పించి ప్రాథమిక హక్కులకు హామీపడుతున్న అధికరణలు, నిబంధనలను పొందుపరచగలిగారు. అసమానతలను రూపుమాపడానికి ఉపాధి, విద్యా రంగాల్లో, ఎస్సీ, ఎస్టీ కులాలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన పట్టుబట్టి సాధించారు. ఈ స్ఫూర్తితోనే బీసీలకు, మహిళలకు, మైనారిటీలకు, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. రాజ్యాంగంలో 15 అధికరణ మతం, జాతి, కులం, లింగం, జన్మస్థలం ఆధారంగా వివక్షను నిషేధిస్తుంది. 1951 తొలి రాజ్యాంగ సవరణ చట్టం తీసుకొచ్చి మహిళలు, వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాల, తెగల అభివృద్ధి కోసం ప్రత్యేక నిబంధనలు తీసుకురావడానికి రాష్ట్రానికి అధికారం ఇచ్చారు. ఇవన్నీ చూస్తుంటే అంబేడ్కర్ ఈ దేశ ప్రజలకు మంచి భవిష్యత్తును నిర్మించేందుకు ఎంత దూరదృష్టితో ఆలోచించారో స్పష్టమవుతుంది. డాక్టర్ అంబేడ్కర్ భారతీయ ఆర్థికశాస్త్రాన్ని కొత్త సామాజిక, రాజకీయ దృక్పథంతో సమున్నతం చేశారు. సమ్మిళిత ఆర్థికాభివృద్ధి సాధనలో రాజ్యం పాత్రను, రాజ్యాంగ పద్ధతుల ప్రాధాన్యాన్ని సమగ్రంగా వివరించారు. నియంతృత్వ పాలనను, హింసాత్మక పద్ధతులను గట్టిగా వ్యతిరేకించారు.

ప్రత్యేకించి నిమ్నకులాలవారు ప్రజాస్వామ్య పంథా అనుసరించాలని అంబేడ్కర్ నొక్కి చెప్పారు. మహారాష్ట్రలో వామపక్ష తీవ్రవాద భావజాలంతో 1972లో వచ్చిన దళిత్ పాంథర్స్ ఉద్యమం నిలబడలేదు. మానవతావాదం, వ్యక్తి స్వేచ్ఛలకు ఎక్కడా భంగం వాటిల్లకూడదని ఆయన హెచ్చరించారు. 1947లో 'స్టేట్స్ అండ్ మైనారిటీస్' పేరు మీదుగా బ్రిటిష్ ప్రభుత్వానికి సమర్పించిన మెమోరాండంలో భారతదేశ ఆర్థిక అభివృద్ధికి ప్రయోజనాత్మక వ్యూహ రచన చేశారు. ప్రైవేట్ సంస్థలకు మార్గాలను మూసివేయకూడదని గట్టిగా చెప్పారు. దీనికి తగిన విధంగా ప్రజల ఆర్థిక జీవితాన్ని అలవర్చుకోవాలన్నారు. సంపద సమాన పంపిణీ బాధ్యతను రాజ్యం చేపట్టాలన్నారు. వర్గరహిత సమాజాన్ని ఆశించారు. రాజ్యరహిత సమాజాన్ని నిరసించారు. ఈ విషయంలో ఆయన ప్రపంచ మేధావుల మెప్పుపొందారు. వ్యవసాయరంగ సమస్యల పరిష్కారానికి శాస్త్రీయమైన సూచనలు చేశారు. రైతు సహకార సంఘాలను ఏర్పాటు చేసి భూ కమతాలను ఏకీకృతం చేయాలన్నారు. దీంతో వ్యయాన్ని తగ్గించి, ఉత్పత్తి పెంచవచ్చని అన్నారు. వ్యవసాయ రంగంలోని మిగులు శ్రామికులను పారిశ్రామిక రంగంలో ఉపయోగించుకోవాలని ఆయన పదేపదే చెప్పారు. పారిశ్రామికీకరణ పురోగతి వ్యవసాయ రంగంపై భారాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు. ఈ రెండు రంగాల వృద్ధి ఆధారంగా మూడో రంగం అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు అంబేడ్కర్ నిర్దేశించిన దారిలోనే పయనిస్తున్నాయి.

▪ **డాక్టర్ జీకేడీ ప్రసాదరావు**
ఫ్యాకల్టీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం

(రేపు అంబేడ్కర్ జయంతి)



గ్యాలరీలో ప్రదర్శనకు ఉంచిన పెయింటింగ్స్

కాన్వాసుపై కాకతీయ కళా వైభవం

» టార్చ్ ఆధ్వర్యాన శిలా నిశ్శబ్దం చిత్ర ప్రదర్శన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచిన రామప్ప దేవాలయం, వేయి స్తంభాల గుడి, కాకతీయుల శిల్ప కళా వైభవానికి ప్రతీకలైన గణపురం కోటగుళ్లు, చంద్రవెల్లి దేవాలయాలను 60 మంది చిత్రకారులు కాన్వాసుపై అద్భుతంగా చిత్రించారు. వీరిలో తెలంగాణ, ఏపీలకు చెందిన 56 మందితోపాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన నలుగురు చిత్రకారులున్నారు. టార్చ్ స్వచ్ఛంద సంస్థ, కళాయజ్ఞం సంస్థలు సంయుక్తంగా మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 'శిలా నిశ్శబ్దం' పేరుతో నిర్వహిస్తున్న ప్రదర్శనను తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నిజాం వారసుడు రౌనఖ్ యార్‌ఖాన్ ప్రారంభించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన సీనియర్ చిత్రకారుడు శేష బ్రహ్మం, టార్చ్ వ్యవస్థాపకుడు అరవింద్ ఆర్యపై వక్తలు ప్రశంసలు కురిపించారు. ఈ నెల 14 వరకు ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. చివరిరోజు సోమవారం కాకతీయుల నాణేలు, ఆనాటి వస్తువులను ప్రదర్శనతో పాటు ప్రత్యేక సదస్సులు జరుగుతాయన్నారు. కాగా, టార్చ్ ఫౌండేషన్, కళా యజ్ఞ సంస్థలు సామాజిక మాధ్యమాల వేదికగా 60 మంది చిత్రకారులను జనవరిలో కాకతీయ కట్టడాల సందర్శనతో పాటు స్కెచ్ టూర్ నిర్వహించారు. కాకతీయు ల చరిత్ర, సంస్కృతి, నిర్మాణ విశిష్టత మీద నిపుణులతో ప్రత్యేక అవగాహనా తరగతులు నిర్వహించారు. అలా చిత్రకారులు గీసిన పెయింటింగ్స్ ప్రదర్శనకు ఉంచారు.

జడ్జీలు వ్యక్తులు కాదు.. వ్యవస్థ

» ఉమ్మడి భాగస్వామ్యంతో న్యాయవ్యవస్థ బలోపేతం

» న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలి

» సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ హితవు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న సుప్రీం జడ్జి జస్టిస్ శ్రీనరసింహ

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒకసారి న్యాయాధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జడ్జీలు వ్యక్తిగా మాయమై.. వ్యవస్థగా ప్రత్యక్షమవ్వాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ హితవు పలికారు. జడ్జీగా విధులు నిర్వర్తించే సమయంలో వ్యక్తిగత అంశాలు ఏవీ ఉండవని తెలిపారు. సికింద్రాబాద్‌లోని జ్యుడీషియల్ అకాడమీలో శనివారం జరిగిన తెలంగాణ న్యాయమూర్తుల సంఘం ద్వైవార్షిక సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ "న్యాయవాదిగా ఉన్నంత వరకే వ్యక్తిగత విజయాలు, నైపుణ్యం, అత్యుత్తమంగా కేసును వాదించడం వంటి అంశాలు ఉంటాయి. ఒక్కసారి జడ్జిగా ఎంపికై విధుల్లో చేరితే వ్యవస్థలో భాగస్వామిగా మారిపోవాలి. జడ్జి వ్యక్తిగా మయమై.. వ్యవస్థగా ప్రత్యక్షమవాలి. జడ్జిగా వ్యవస్థలో భాగమైనప్పుడే అది మనల్ని కాపాడుతుంది. శాస్త్రీయ ఆలోచన, కష్టపడేతత్వం, అధ్యయనం, నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడం జడ్జీలు తమ విధినిర్వహణలో అంతర్భాగంగా చేసుకోవాలి. న్యాయవ్యవస్థను బలోపేతం చేసి, సత్వరంగా కేసుల పరిష్కారానికి కృషి చేయాలి. ఈ వ్యవస్థలో న్యాయవాదులను భాగస్వాములుగా చేసుకోవాలి. అందరికీ అందుబాటులోఉండేలా.. వీలైనంత వేగంగా న్యాయం అందించేలా వ్యవస్థను తీర్చిదిద్దాలి. కేసుల పరిష్కారం కేవలం జడ్జీలపై ఉన్న బాధ్యత మాత్రమే కాదు. అది అందరి భాగస్వామ్యంతో ముందుకు సాగే ప్రక్రియ. జ్యుడీషియల్ అకాడమీ, హైకోర్టు, జిల్లా న్యాయవ్యవస్థ ఉమ్మడి భాగస్వామ్యంతోనే వేగవంతమైన, సమ్మిళిత పరిష్కార విధానాలు ఆవిష్కృతం అవుతాయి" అని పేర్కొన్నారు.

లోపాలను సమీక్షించుకోవాలి: జస్టిస్ సుజోయ్‌పాల్

మరో ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ లోపాలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలని సూచించారు. "ఒక క్రికెటర్ తాను శతకాలు చేసిన, ఘన విజయాలు సాధించిన మ్యాచ్‌ల కంటే వేగంగా అవుట్ అయిన మ్యాచ్‌లను ఎక్కువగా గుర్తుపెట్టుకుంటాడు. ఆ వీడియోలను ఒకటి పదిసార్లు చూసి విశ్లేషించుకుంటాడు. అదేతరహాలో మన లోపాలపై నిత్యం సాధన చేసి మరింత మెరుగ్గా రాణించాలి. క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలి" అని అన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ మాట్లాడుతూ జడ్జీలపై పనిఒత్తిడి ఉంటుందని, విరామం తీసుకోవడం కూడా నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పని ఒత్తిడి గురించి జస్టిస్ నరసింహ, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ మధ్య సరదా సంభాషణ చోటుచేసుకుంది. తనకు నిద్రలో కూడా వాదనలు వింటున్నట్లే కలలు వస్తున్నాయని జస్టిస్ శ్రవణ్‌కుమార్ పేర్కొనగా.. తన కు ఇప్పటికీ న్యాయవాదిగా వాదనలు వినిపిస్తున్నట్లే కలలు వస్తున్నాయని జస్టిస్ నరసింహ అన్నారు. జిల్లా న్యాయవ్యవస్థలో పనిచేసే దాదాపు 450 మంది జడ్జీలు పాల్గొన్న ఈ సదస్సుకు జస్టిస్ పీఎస్ నరసింహ అచ్చమైన తెలుగుదనం ఉట్టిపడేలా పంచెకట్టులో వచ్చి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడు అజయ్ నతానీ, తెలంగాణ న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడు కే ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి కే మురళీమోహన్, జడ్జీల హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బీ పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. చేతులు లేని ఓ దివ్యాంగురాలైన యువతి తన చిత్రపటాన్ని గీయడంపై జస్టిస్ నరసింహ హర్షం వ్యక్తంచేశారు. ఆమెను జ్ఞాపికతో సన్మానించారు.



15,16, 17 తేదీల్లో కృష్ణా ట్రైబ్యునల్ విచారణ

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల కేటాయింపులపై ఈ నెల 15, 16, 17వ తేదీల్లో జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ (కృష్ణా ట్రైబ్యునల్-2) విచారణ చేపట్టనుంది. ఈ సందర్భంగా నీటి కేటాయింపులపై ట్రైబ్యునల్ ముందు తెలంగాణ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించనున్నారు. ప్రస్తుతం ట్రైబ్యునల్‌లో నీటి కేటాయింపులపై విచారణ జరుగుతున్న విషయం విదితమే. ఇప్పటికే రెండు దఫాల పాటు తెలంగాణ వాదనలు వినిపించగా.. మరో రెండు లేదా మూడు దఫాల పాట వాదనలు వినిపించనుంది. ఆ తర్వాతే ఏపీ న్యాయవాదులు వాదనలు వినిపిస్తారు. అయితే ట్రైబ్యునల్ విచారణ కీలకం కావడంతో విచారణ ప్రక్రియ కోసం స్వయంగా హాజరు అవుతానని ఇప్పటికే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కూడా ప్రకటించారు. విచారణ సందర్భంగా వాదనలు ఏ విధంగా వినిపించాలనే దానిపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, తెలంగాణ తరఫు ట్రైబ్యునల్ న్యాయవాది సీఆర్ వైద్యనాథన్‌తో పాటు కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) మాజీ ఛైర్మన్ కుశ్వీందర్ వోహ్రాలతో మంత్రి సమావేశమయ్యారు.

అణు చర్చలపై ఇరాన్-అమెరికా ముందడుగు

మస్కట్, ఏప్రిల్ 12: అణు ఒప్పందానికి సంబంధించిన చర్చలపై ఎట్టకేలకు ఇరాన్-అమెరికా ముందడుగు వేశాయి. ఒమన్ వేదికగా పరోక్ష చర్చలు జరిపాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి, అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ మస్కట్‌లో ఒమన్ విదేశాంగ మంత్రి బదర్ అల్ బుసైదితో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఏప్రిల్ 19న మళ్లీ చర్చలు జరపాలని నిర్ణయించుకున్నారు.

కియ పరిశ్రమలో ఇంటి దొంగలు?

» ఐదేళ్లుగా మాయమవుతున్న ఇంజన్లు

» ఓ ఉద్యోగి కదలికలపై అనుమానాలు

» మాయమైన ఇంజన్ల విలువ 23.50 కోట్లు

» ముమ్మరంగా సాగుతున్న సిట్ దర్యాప్తు

హిందూపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కియ పరిశ్రమలో కారు ఇంజన్ల మాయం ఇంటి దొంగల పనేనని ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. ఈ కేసులో సంస్థ ఉద్యోగి పఠాన్ సలీంను ఏ-1గా చేర్చిన పోలీసులు, దర్యాప్తును వేగవంతం చేశారు. గతేడాది డిసెంబరు 12న పటాన్ సలీం తను విధులు నిర్వహించే చోట కాకుండా, మరోచోట సంచరించినట్లు కియ అధికారులు గుర్తించారు. ఇంజన్ షాప్ మొబిస్ గేట్ వద్ద అనధికారిక వాహనాలు సంచరించే సమయంలో అతను వెళ్లిరావడం సీసీ కెమెరాల్లో రికార్డయింది. దీంతో అధికారులు అంతర్గత పరిశీలన జరిపారు. హుండాయ్ మోటార్ ఇండియా(హెచ్‌ఎంఐ) ఇంజన్లను తీసుకెళ్లే దృశ్యాలు, వాటి రికార్డుల్లో తేడాలను గుర్తించారు. ఈ ఏడాది జనవరిలో చేపట్టిన వార్షిక లెక్కల పరిశీలనలో 940 ఇంజన్లు తక్కువ రావడంతో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. అక్రమాలను నిగ్గు తేల్చాలని కోరుతూ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ విభాగం అధిపతి సాయి నందన్ గతనెల 19న కియ ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు చేసింది. పఠాన్ సలీంను అదుపులోకి తీసుకున్న పోలీసులు, మొత్తం కుట్రను ఛేదించే పనిలో నిమగ్నమయ్యారు. సీసీ ఫుటేజీతో పాటు కియ రికార్డులను పరిశీలించి, అక్రమార్కులను గుర్తించే దిశగా సిట్ అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు. కియలో ఇంజన్ల మాయం వ్యవహారం ఐదేళ్ల క్రితమే మొదలైందని అనుమానిస్తున్నారు. ఇక్కడ పనిచేసి ఉద్యోగం మానేసిన కొందరితో కలిసి సలీం, మరికొందరు ఇంజన్లను మాయం చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ ఇంజన్లు ఏమయ్యాయి?

మాయమైన ఒక్కో ఇంజిన్ విలువ రూ.2.50 లక్షలు అని సమాచారం. ఈ లెక్కన కియకు రూ.23.50 కోట్లు నష్టం జరిగింది. సాధ్యమైనంత త్వరగా బాధ్యులను పట్టుకోవాలని పరిశ్రమ నిర్వాహకులు.. పోలీసులను కోరడంతో డీజీపీ కార్యాలయమే దగ్గరుండి ఈ కేసును పర్యవేక్షిస్తోంది. సిట్ అధికారులు తమిళనాడు సహా వేర్వేరు రాష్ట్రాలకు వెళ్లి అనుమానితులను పట్టుకుంటున్నారు.

ప్రవీణ్ మృతికి రోడ్డు ప్రమాదమే కారణం

ఏపీ పోలీసుల స్పష్టీకరణ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతికి రోడ్డు ప్రమాదమే కారణమని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రమాద సమయంలో ఆయన వెళ్తున్న బుల్లెట్ హెడ్‌లైట్ పనిచేయలేదని, గంటకు 70 కిలోమీటర్ల వేగంతో పోతున్నారని అంచనా వేశామని తెలిపారు. రాజమహేంద్రవరం సమీపంలో హైవే పక్కన కంకరపైకి బండి వేగంగా వెళ్లడంతో స్కిడ్ అయి అర్ధ చంద్రాకారంలో రోడ్డు కిందకు జారి వర్షపు నీటి డ్రెయిన్‌లో పడిపోయారని ఫోరెన్సిక్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారని వెల్లడించారు. అక్కడున్న రాయి పాస్టర్ ప్రవీణ్ ముఖానికి బలంగా తగలడంతో గాయమైందని, కిందకు పడిపోయిన క్రమంలో ఆయనపై బుల్లెట్ పడిందని నివేదిక ఇచ్చారని తెలిపారు. ఏ వాహనం కూడా ఢీకొనలేదని వివరించారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నరసింహ కిషోర్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో దర్యాప్తు వివరాలను వెల్లడించారు. గత నెల 24న ప్రవీణ్ హైదరాబాద్‌లో బయల్దేరినప్పటి నుంచి రాజమహేంద్రవరం సమీపంలో మృతి చెందిన ఘటన వరకు ముఖ్యమైన సీసీ ఫుటేజీలను ప్రదర్శించి వివరించారు.

సిఫారసు లేఖలపై తిరుమలలో గదుల కేటాయింపు సులభతరం

వీఐపీ బ్రేక్ ఎన్‌రోల్‌మెంట్ రసీదుపైనే వివరాలు

తిరుమల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వీఐపీ బ్రేక్ ఎన్‌రోల్‌మెంట్ రసీదుపైనే గదులు కేటాయించే విధానాన్ని టీటీడీ ప్రవేశపెట్టింది. గతంలో వీఐపీ బ్రేక్ దర్శనాల కోసం సిఫారసు లేఖలు తీసుకువచ్చే వారు ఒరిజినల్ లేఖను అదనపు ఈవో కార్యాలయంలో ఇచ్చి నమోదు చేసుకునేవారు. వారికి ఎన్‌రోల్‌మెంట్ రసీదు ఇచ్చేవారు. గదుల కోసం ఆ సిఫారసు లేఖ జిరాక్స్ ఇస్తే గదులు కేటాయించే కేంద్రాల స్టాంప్ వేసి పంపేవారు. దీనికి తిరిగి ఆధార్ కార్డు జెరాక్స్ జత చేసి ఆయా కౌంటర్లలో గదులు పొందాల్సి ఉండేది. అయితే టీటీడీ ప్రవేశపెట్టిన నూతన విధానంలో సిఫారసు లేఖ జెరాక్స్‌తో అవసరం లేకుండా ఎన్‌రోల్‌మెంట్ రసీదులో గదుల కేటాయింపు కేంద్రాల వివరాలు ప్రింట్ చేసి ఇస్తున్నారు. దీంతో భక్తులు ఆ రసీదు తీసుకుని నేరుగా కేటాయింపు కేంద్రాలకు వెళ్లి గదులు పొందుతున్నారు.

తిరుమలలో అపచారం!

» పాదరక్షలతోనే మహాద్వారం వరకు

మహారాష్ట్రకు చెందిన భక్తులు పాదరక్షలతో శ్రీవారి దర్శనం కోసం మహాద్వారం వరకూ రావడం శనివారం తిరుమలలో వివాదాస్పదమైంది. ఇద్దరు భక్తులు వీఐపీ బ్రేక్ సమయంలో డిస్పోజబుల్ చెప్పులతో ఆలయంలోకి వెళ్లబోతుండగా మీడియా సిబ్బంది గుర్తించి కెమెరాల్లో చిత్రీకరించారు. వెంటనే విజిలెన్స్ సిబ్బంది అప్రమత్తమై భక్తులను అడ్డుకున్నారు. దీంతో వారు చెప్పులను మహాద్వారం గేటువద్ద విడిచి దర్శనానికి వెళ్లారు. కాగా.. ఉత్సవమూర్తులు ఊరేగే శ్రీవారి ఆలయం, మాడవీధులు, వైకుంఠం కంపార్టుమెంట్లు, క్యూలైన్లలో పాదరక్షలు ధరించడం నిషేధం. అయితే ఈ భక్తులు ఏకంగా మహాద్వారం వరకు పాదరక్షలు ధరించి వచ్చినా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని సిబ్బంది గుర్తించి అడ్డుకోకపోవడంపై విమర్శలు వచ్చాయి. మీడియా గుర్తించకపోయుంటే భక్తులు ఆలయంలోకి వెళ్లిపోయి ఉండేవారు. సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించిన టీటీడీ ఉన్నతాధికారులు.. అధికారులు, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణంలోకి రేపు ప్రజలకు అనుమతి

» విగ్రహ పీఠంలోని మ్యూజియం, లైబ్రరీ సందర్శనకు కూడా

» అంబేడ్కర్ జయంతి నేపథ్యంలో హెచ్‌ఎండీఏ ఏర్పాట్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం హెచ్‌ఎండీఏ ఏర్పాట్లు చేస్తోంది. హుస్సేన్‌సాగర్ తీరంలో 125 అడుగుల ఎత్తుతో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహం వద్ద వీవీఐపీల నుంచి సాధారణ ప్రజల వరకు అందరూ నివాళులర్పించేలా చర్యలు చేపట్టింది. అంబేడ్కర్ విగ్రహం పాదాల దాకా వెళ్లేందుకు ఇప్పటివరకు అవకాశం లేదు. అయితే, సోమవారం వీవీఐపీలను, వీఐపీలను ఇందుకు అనుమతించనున్నారు. అంబేడ్కర్ విగ్రహ పీఠం(పాత పార్లమెంటు భవనం ఆకారంలో నిర్మించారు)లో ఏర్పాటు చేసిన లైబ్రరీ, మ్యూజియం సందర్శనకు కూడా ప్రజలను అనుమతించనున్నారు. అయితే, అవి ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఈ నేపథ్యంలో.. అంబేడ్కర్ జీవితం నుంచి ప్రేరణ పొందే ఘట్టాలను చిత్రిస్తూ రూపొందించిన కళాఖండాలను సేకరించడానికి హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో విద్యార్థులు, కళాకారులకు పోటీలు నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా అంబేడ్కర్ విగ్రహం వద్ద జరుగుతున్న ఈ పోటీల్లో 20బృందాల దాకా పాల్గొంటున్నాయి. పెయింటింగ్, ఇతరత్రా ఆర్ట్ సామగ్రి కోసం హెచ్‌ఎండీఏ ఒక్కో బృందానికి రూ.10వేల చొప్పున అందజేసింది. ఈ బృందాలు రూపొందించిన కళాఖండాలను అంబేడ్కర్ జయంతి రోజున మ్యూజియంలో ప్రదర్శించనున్నారు. ఇందులో ఉత్తమమైన మూడింటిని ఎంపిక చేసి వారికి నగదు బహుమతులు అందిస్తారు. ఆ కళాఖండాలను అంబేడ్కర్ మ్యూజియంలో శాశ్వతంగా ఏర్పాటు చేయనున్నారు.

నేమ్‌బోర్డులు తమిళంలో లేకుంటే 2వేలు ఫైన్

చెన్నై, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తమిళంలో నేమ్‌బోర్డులు ఏర్పాటుచేయని సంస్థలకు రూ.2వేల జరిమానా విధిస్తామని, మే నెల నుంచి ఈ నిబంధన అమల్లోకి రానుందని రాష్ట్ర తమిళ అభివృద్ధి శాఖ మంత్రి స్వామినాథన్ హెచ్చరించారు. ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, వాణిజ్య సంస్థలు, హోటళ్లు, దుకాణాలు ఏర్పాటుచేసే నేమ్‌బోర్డుల్లో తమిళం పెద్దదిగా, ఇంగ్లీష్ చిన్నదిగా, తర్వాత వారు కోరుకున్న భాషలో పేర్లు ఉండాలని ఇటీవల ప్రభుత్వం సూచించిన విషయం తెలిసిందే. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నేమ్ బోర్డులు తమిళంలో ఉండేలా కలెక్టర్లు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం తిరుప్పూర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి స్వామినాథన్ మాట్లాడుతూ.. తమిళంలో నేమ్ బోర్డులు ఏర్పాటుచేయని యజమానులకు మే నుంచి జరిమానా విధిస్తామన్నారు.

ప్రముఖ కథక్ కళాకారిణి కుముదిని కన్నుమూత



అహ్మదాబాద్, ఏప్రిల్ 12: ప్రముఖ కథక్ నృత్య కళాకారిణి కుముదిని లాఖియా శనివారం అస్తమించారు. ఆమె వయసు 95 ఏళ్లు. వృద్ధాప్య సమస్యల కారణంగా అహ్మదాబాద్‌లోని తన స్వగృహంలో కన్నుమూశారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవంలో ఆమె పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. ఆమె సినిమాలకు కొరియోగ్రాఫర్‌గా కూడా పనిచేశారు. 1981లో విడుదలైన హిందీ చిత్రం ఉమ్రావ్‌జాన్‌కు నృత్యదర్శకత్వం వహించారు. 1930 మే 17న అహ్మదాబాద్‌లో జన్మించిన ఆమె భారతీయ కళా కేంద్రలో శంభు మహరాజ్ వద్ద శిక్షణ పొందారు. 1964లో ఇక్కడ కదంబ్ సెంటర్ ఫర్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ ఏర్పాటు చేశారు. కథక్ నృత్య రీతుల్లో వినూత్న ప్రక్రియలను ఆవిష్కరించారు. పద్మశ్రీ, పద్మభూషణ్, సంగీత నాటక అకాడమీ సహా ఎన్నో అవార్డులను అందుకున్నారు. ఆమె మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం తెలిపారు.

అరెస్టుకు కారణం చెప్పకుంటే బెయిల్ ఇవ్వొచ్చు

ప్రయాగ్‌రాజ్, ఏప్రిల్ 12: అరెస్టుకు పోలీసులు కారణాలు చెప్పకుంటే నిందితుడికి బెయిల్ మంజూరు చేయవచ్చని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. నిందితుడికి కారణాలు చెప్పలేదన్న విషయాన్ని ప్రాతిపదికగా చూపించి బెయిల్ ఇవ్వవచ్చని తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1) ప్రకారం అరెస్టు చేసే ముందు నిందితుడికి కారణాలు చెప్పడం తప్పనిసరి అని పేర్కొంది. మంజీత్ సింగ్ అనే నిందితుడిని రిమాండుకు పంపిస్తూ రాంపూర్ మేజిస్ట్రేటు కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. మోసం తదితర ఆరోపణలతో మంజీత్‌సింగ్‌పై గత ఏడాది ఫిబ్రవరి 15న కేసు నమోదయింది. పోలీసులు అతడిని డిసెంబరు 25న అరెస్టు చేసి మరుసటి రోజున కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేటు రిమాండుకు పంపారు. దీనిపై అతడు హైకోర్టులో అప్పీలు చేశాడు. అరెస్టు సందర్భంగా తనకు ఎలాంటి కారణాలు చెప్పలేదని పేర్కొన్నాడు. దీంతో, మంజీత్‌సింగ్ అరెస్టును రద్దు చేస్తూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది.

డిజిటల్ చెల్లింపులకు మళ్లీ తీవ్ర అంతరాయం

- 2గంటలు స్తంభించిన యూపీఐ..15 రోజుల్లో మూడోసారి

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ చెల్లింపుల సేవలకు శనివారం మరోసారి తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాంకేతిక లోపం కారణంగా యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) స్తంభించిపోవడమే ఇందుకు కారణం. దాంతో వినియోగదారులు శనివారం మధ్యాహ్నం దాదాపు 2గంటల పాటు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా యూపీఐ చెల్లింపులు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యూపీఐ సేవలు స్తంభించిపోవడం గత 15 రోజుల్లో ఇది మూడోసారి. గత నెల 26న, ఈ నెల 2న కూడా యూపీఐ సేవలకు అంతరాయం ఏర్పడింది. వినియోగదారులకు కలిగిన అంతరాయానికి ఎన్‌పీసీఐ క్షమాపణలు చెప్పింది.

గుజరాత్ నుంచి కాంగ్రెస్ ప్రక్షాళన!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వరుస పరాజయాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న కాంగ్రెస్.. గత వైభవాన్ని సాధించేందుకు పార్టీ సంస్థాగత ప్రక్షాళనకు నడుం బిగించింది. గుజరాత్ నుంచి పార్టీని ప్రక్షాళన చేసి గాడిన పెట్టేందుకు నిర్ణయించింది. ఆ రాష్ట్రంలోని 41 జిల్లాల డీసీసీ అధ్యక్షులను ఎంపిక చేసేందుకు 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమం కింద ఏఐసీసీ, పీసీసీ పరిశీలకులను నియమించింది. మొత్తం 43 మంది ఏఐసీసీ పరిశీలకులు, ఏడుగురు సహాయ పరిశీలకులు, 183 మంది పీసీసీ పరిశీలకులు ఈ జాబితాలో ఉన్నారు. ఏఐసీసీ పరిశీలకులుగా తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఏపీ ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్‌తో పాటు తెలంగాణ నుంచి ఎంపీ బలరాం నాయక్, వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్.. ఏపీ నుంచి పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సిరివెళ్ల ప్రసాద్ నియమితులయ్యారు.

ప్రసూతి మరణాల్లో రెండో స్థానంలో భారత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న ప్రసూతి మరణాలపై దేశాలన్నీ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. 2000 నుంచి 2023 వరకు ఉన్న ప్రసూతి మరణాల సరళిపై ఓ నివేదిక విడుదల చేసింది. నివారించదగ్గ పరిస్థితుల్లో కూడా 2023లో ప్రపంచ వ్యాప్తంగా రోజుకు సగటున 700 ప్రసూతి మరణాలు సంభవించాయని అందులో వెల్లడించింది. ఆ ఏడాది నైజీరియాలో 75 వేల మాతృమరణాలు నమోదవ్వగా.. ప్రపంచ వ్యాప్తంగా ఆ దేశం ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక 19 వేల మరణాలతో భారత్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో రెండో స్థానంలో ఉన్నాయి. పాకిస్థాన్‌లో 11 వేల మరణాలు సంభవించాయని నివేదిక పేర్కొంది. ఈ నాలుగు దేశాల్లోని మరణాలే ప్రపంచవ్యాప్త మరణాల్లో సుమారు సగం ఉన్నాయని తెలిపింది.

భారత్‌లో పెరుగుతున్న ఆమ్ల వర్షాలు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: వర్షపు నీటిలో ఆమ్లత్వం పెరుగుతున్న ధోరణి భారత్‌లో ఆందోళన రేపుతోందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఐఎండీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెట్రాలజీ (ఐఐటీఎం) 34 ఏళ్లపాటు దేశవ్యాప్తంగా నిర్వహించిన సుదీర్ఘ అధ్యయనంలో భారత్‌లోని అనేక ప్రాంతాల్లో వర్షపు నీరు మరింత ఆమ్లంగా మారుతోందని గుర్తించారు. విశాఖపట్నం, ప్రయాగ్‌రాజ్, మోహన్‌బరిలో ఈ ఆమ్ల వర్షాలు అధికంగా నమోదవుతున్నాయని, పుణెలో కూడా పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని కనుగొన్నారు. నీటిలో పీహెచ్ స్థాయిలు తగ్గి, ఆమ్లత్వం పెరగడానికి పరిశ్రమలు, వాహనాలు, వ్యవసాయ కాలుష్యం కారణమని నిపుణులు చెబుతున్నారు. ఈ ఆమ్ల వర్షాలతో తక్షణమే ముంచుకొచ్చే ముప్పేమీ లేకపోయినప్పటికీ.. భవిష్యత్తులో అనేక సమస్యలకు కారణమవుతుందని హెచ్చరిస్తున్నారు.

రాష్ట్రపతికీ గడువు



(మొదటి పేజీ తరువాయి)

విధించిన సుప్రీంకోర్టు రాష్ట్రపతికి సైతం గడువును నిర్దేశించడం విశేషం. ఈమేరకు 415 పేజీల తీర్పు కాపీని సుప్రీంకోర్టు శుక్రవారం రాత్రి 10.54 గంటలకు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది.


మినహాయింపు లేదు..

గవర్నర్‌కుగానీ, రాష్ట్రపతికిగానీ సంపూర్ణ వీటో అధికారాలు లేవని సుప్రీం తన తీర్పులో తేల్చిచెప్పింది. "ఏ బిల్లు విషయంలోనూ గవర్నర్‌కు సంపూర్ణ వీటో అధికారాలు ఉండవని మేం (తీర్పులోని ముందరి పేరాల్లో) పేర్కొన్నాం. అదే ప్రమాణాన్ని.. రాష్ట్రపతికి వర్తింపజేయకుండా ఉండడానికి మాకు ఏ కారణమూ కనపడట్లేదు. రాజ్యాంగం అంతటా కనిపించే ఈ ప్రామాణిక సూత్రానికి రాష్ట్రపతి ఏమీ మినహాయింపు కాదు. అటువంటి అదుపులేని (హద్దుల్లేని) అధికారాలు ఈ రెండు రాజ్యాంగ పదవుల్లో ఏ ఒక్కదానికీ ఉండరాదు" అని తీర్పులో స్పష్టం చేసింది. ఏదైనా ఒక బిల్లు రాష్ట్ర జాబితాలోనిదై ఉండి.. ఆ బిల్లును రాష్ట్ర మంత్రివర్గ సలహాకు విరుద్ధంగా గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపినప్పుడు, ఆ బిల్లును ఎక్కువకాలం పెండింగ్‌లో పెడితే.. న్యాయ సమీక్షలో భాగంగా కోర్టులు ఆ బిల్లు నిలుపుదలకు గల కారణాలను పరిశీలించవచ్చని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ఒకవేళ తగిన కారణాలు చెప్పకుండా పెండింగ్‌లో పెడితే.. రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం నిజాయతీతో వ్యవహరించకపోయి ఉండొచ్చని భావించడానికి తాము సంకోచించబోమని స్పష్టం చేసింది. రాజ్యాంగపరమైన అంశాలు ఇమిడి ఉన్న బిల్లులు, రాష్ట్రపతి ఆమోదం అవసరమయ్యే బిల్లుల విషయంలో.. వాటిని శాసనసభలో ప్రవేశపెట్టడానికి ముందే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించాలని రాష్ట్రప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. అలా రాష్ట్రప్రభుత్వాల నుంచి వచ్చే శాసనపరమైన ప్రతిపాదనలను వీలైనంత వేగంగా పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. తద్వారా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాల్లో ఘర్షణ వాతావరణం తగ్గుతుందని.. భవిష్యత్తులో వచ్చే అవకాశం ఉన్న అడ్డంకులను ముందే నిరోధించవచ్చని పేర్కొంది.

సమయం, వనరుల ఆదా..

"కార్యనిర్వాహక, శాసనవ్యవస్థల చర్యల రాజ్యాంగబద్ధత, చట్టబద్ధతకు సంబంధించిన ప్రశ్నలు తలెత్తినప్పుడు న్యాయనిర్ణయం చేసే బాధ్యత రాజ్యాంగ కోర్టులకు ఉంది. కాబట్టి.. ఏదైనా బిల్లు స్పష్టంగా రాజ్యాంగవిరుద్ధంగా ఉందని భావించి, గవర్నర్ దానికి రాష్ట్రపతి పరిశీలనకు పంపితే.. రాష్ట్రపతి ఆ బిల్లును 143వ అధికరణ కింద (తప్పనిసరి కాకపోయినప్పటికీ), దూరదృష్టితో ముందుజాగ్రత్తచర్యగా సుప్రీంకోర్టుకు పంపాలి" అని ధర్మాసనం తన తీర్పులో వివరించింది. సలహాలు, అభిప్రాయాల నిమిత్తం బిల్లులను రాజ్యాంగ కోర్టులకు సిఫారసు చేసే ఏర్పాటు ఏదీ రాష్ట్రాల స్థాయిలో గవర్నర్లకు లేనందున.. ఆ బాధ్యత రాష్ట్రపతిపైనే ఉందని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ జేబీ పార్దీవాలా.. మన పొరుగు ఉన్న ద్వీపదేశమైన శ్రీలంకలో ఉన్న సంప్రదాయం గురించి వివరించారు. "(శ్రీలంకలో) ప్రాంతీయ మండళ్లు చేసే చట్టాలు రాజ్యాంగవిరుద్ధంగా ఉన్నాయని అక్కడి గవర్నర్ భావిస్తే వారు ఆ బిల్లును ప్రెసిడెంట్‌కు సిఫారసు చేస్తారు. ప్రెసిడెంట్ ఆ బిల్లు రాజ్యాంగబద్ధతను పరిశీలించడానికి శ్రీలంక సుప్రీంకోర్టుకు పంపుతారు. సుప్రీంకోర్టు ఆ బిల్లు రాజ్యాంగబద్ధమేనని ప్రకటిస్తే.. గవర్నర్ దానికి బద్ధుడై ఆమోదం తెలపాల్సి ఉంటుంది" అని వివరించారు. లోపాలతో కూడిన బిల్లులు చట్టాలుగా మారితే కోర్టుల్లో వ్యాజ్యాలు దాఖలవుతాయని.. అవి అమల్లోకి రావడం ఆలస్యమవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అలా కాకుండా.. బిల్లుల రాజ్యాంగబద్ధతకు సంబంధించి రాజ్యాంగ కోర్టుల సలహాలు, అభిప్రాయాలు ముందే తీసుకోవడం వల్ల సమయం, ప్రభుత్వ వనరులు.. రెండూ ఆదా అవుతాయని వివరించింది. దానికితోడు శాసనవ్యవస్థకు తమ బిల్లులను పరిశీలించుకుని, తగిన దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి మరో అవకాశం దొరుకుతుందని పేర్కొంది. ఏది ఏమైనా.. బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపడం అనే ప్రక్రియ రాష్ట్రాలకున్న శాసనాధికారాలకు విఘాతం కలిగించేదిగా ఉండకూడదని తేల్చిచెప్పింది.


లోకం తీరు



గవర్నర్ ఆమోదం లేకుండానే.. 10 బిల్లులు చట్టాలయ్యాయి!

గెజిట్ ప్రకటించిన తమిళనాడు సర్కారు

- సుప్రీం సంచలన తీర్పుతో నోటిఫికేషన్
- దేశ చరిత్రలోనే తొలిసారిగా నిర్ణయం



గవర్నర్ ఆర్‌ఎన్ రవి

చెన్నై, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గవర్నర్, రాష్ట్రపతి సంతకం లేకుండా దేశంలోనే తొలిసారిగా తమిళనాట పది బిల్లులు చట్టరూపం దాల్చాయి. ఈ మేరకు స్టాలిన్ ప్రభుత్వం శనివారం గెజిట్ వెలువరించింది. తమిళనాడు ప్రభుత్వంతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి.. సుదీర్ఘకాలంగా పది బిల్లులు పెండింగ్‌లో పెట్టడంపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అంతేగాక 2023 నవంబరు 18నే ఆ బిల్లుల్ని గవర్నర్ ఆమోదించినట్లు పరిగణించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పు కాపీని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే తమిళనాడు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ 10 బిల్లులూ చట్టరూపం దాల్చినట్లు అందులో ప్రకటించింది. దీంతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలన్నింటికీ ఇకపై ముఖ్యమంత్రే చాన్సలర్‌గా వ్యవహరిస్తారు.

ఇదీ నేపథ్యం...

తమిళనాడు గవర్నర్‌గా 2021లో బాధ్యతలు స్వీకరించిన ఆర్‌ఎన్ రవికి స్టాలిన్ నేతృత్వంలోని రాష్ట్ర సర్కారుకు మధ్య బిల్లుల విషయంలో మొదటినుంచీ ఘర్షణ కొనసాగుతోంది. తాము పంపిన 10 బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ తమిళనాడు ప్రభుత్వం 2023 నవంబరులో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బిల్లులను ఆమోదించకపోగా, పునఃపరిశీలించాలని సూచిస్తూ వాటిని వెనక్కి కూడా పంపడం లేదని ఆరోపించింది. ఆ బిల్లులపై గవర్నర్ నిర్ణయం తీసుకునేందుకు గడువును నిర్దేశించాలని కోరింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనం గత మంగళవారం కీలక తీర్పును వెలువరించింది. ప్రభుత్వం ఆమోదించి పంపిన 10 బిల్లులపై గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఏ నిర్ణయం తీసుకోకుండా మూడేళ్లపాటు తొక్కిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. శాసనసభ తీర్మానించి పంపిన బిల్లును గవర్నర్లు గరిష్ఠంగా నెలరోజులకు మించి పెండింగ్‌లో ఉంచకూడదని, మంత్రివర్గ సిఫారసు మేరకు రాష్ట్రపతి పరిశీలనకు పంపాలని భావిస్తే, నెల రోజుల్లోనే పంపాలని తీర్పు చెప్పింది. ఒకవేళ మంత్రివర్గ సలహాలు, సూచనలకు విరుద్ధంగా.. సమ్మతిని నిలుపుదల చేయాలని గవర్నర్ భావిస్తే.. ఆ విషయాన్ని తెలుపుతూ గరిష్ఠంగా 3 నెలల్లోపు బిల్లును తిప్పి పంపాలని పేర్కొంది. ప్రస్తుత బిల్లుల విషయంలో గవర్నర్ సదుద్దేశంతో వ్యవహరించలేదని, రాష్ట్రపతి ఆమోదం కోసం 10 బిల్లులను పెండింగ్‌లో పెట్టడం ఏకపక్ష చర్యగా పేర్కొంది. ఈ నేపథ్యంలో 2023 నవంబరు 18నే ఆ బిల్లుల్ని గవర్నర్ ఆమోదించినట్లు పరిగణించాలని పేర్కొంటూ సంచలన తీర్పు వెలువరించింది. ఇకపై ఆ బిల్లులకు సంబంధించి రాష్ట్రపతి ఏవైనా చర్యలు తీసుకున్నా, అవి చెల్లుబాటు కావని తేల్చిచెప్పింది. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులపై గవర్నర్ నిర్ణయం తీసుకోవడానికి కాల పరిమితిని ధర్మాసనం నిర్ణయించింది.

ఆ 10 బిల్లులు ఇవే...

1) తమిళనాడు వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్ యూనివర్సిటీ (సవరణ) బిల్లు
2) తమిళనాడు ఫిషరీస్ వర్సిటీ (సవరణ) బిల్లు
3) మద్రాసు విశ్వవిద్యాలయం (సవరణ) బిల్లు 2022 ఏప్రిల్‌లో డీఎంకే ప్రభుత్వం ఆమోదించిన ఈ బిల్లును వీసీల నియామకంతో పాటు గవర్నర్‌ను చాన్సలర్ పదవి నుంచి తొలగించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే ఉద్దేశంతో ప్రవేశపెట్టారు.
4) తమిళనాడు వ్యవసాయ వర్సిటీ(సవరణ) బిల్లు
5) తమిళనాడు డాక్టర్ అంబేడ్కర్ లా యూనివర్సిటీ (సవరణ) బిల్లు
6) తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం (సవరణ) బిల్లు
7) తమిళనాడు విశ్వవిద్యాలయం(సవరణ) బిల్లు
8) తమిళనాడు వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్ వర్సిటీ (తదుపరి సవరణ) బిల్లు
9) సిద్ధ వైద్య విశ్వవిద్యాలయ బిల్లు
10) అన్నా విశ్వవిద్యాలయం (సవరణ) బిల్లు

నేషనల్ హెరాల్డ్ కేసు మళ్లీ తెరపైకి



ఏజేఎల్‌కు చెందిన రూ. 661 కోట్ల స్థిరాస్తుల స్వాధీనం!

- చర్యలు ప్రారంభించిన ఈడీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ నిందితులుగా ఉన్న నేషనల్ హెరాల్డ్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. వారికి సంబంధించిన రూ.661 కోట్ల విలువైన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమాయత్తమైంది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) సెక్షన్ 8లోని 5(1) నిబంధన కింద ఆ స్థిరాస్తులను తమ స్వాధీనంలోకి తీసుకుంటామని ఢిల్లీ, ముంబై, లఖ్‌నవూ ప్రాపర్టీస్ రిజిస్ట్రార్లకు నోటీసులు జారీచేసినట్లు ఈడీ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఢిల్లీలోని బహదూర్‌షా జాఫర్ మార్గ్‌లోని 5ఎ-నేషనల్ హెరాల్డ్ నివాసం, ముంబైలోని బాంద్రాలో సర్వే నంబరు 341లోని ప్లాట్ నంబర్2, యూపీలోని లఖ్‌నవూలో బిశ్వేశ్వర్‌నాథ్ రోడ్డులో ఉన్న ఏజేఎల్ భవనానికి శుక్రవారం నోటీసులు అంటించినట్లు తెలిపింది. తాము వీటిని స్వాధీనం చేసుకోవడానికి వీలుగా ఖాళీచేయాలని స్పష్టంచేసింది. అలాగే.. ఇక నుంచి ప్రతి నెలా ఈడీ డైరెక్టరు పేరిట అద్దె/లీజు మొత్తాన్ని బదిలీచేయాలని బాంద్రా హెరాల్డ్ హౌస్ 7,8,9 అంతస్తుల్లో ఉన్న జిందాల్ సౌత్‌వెస్ట్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌కు కూడా నోటీసులిచ్చారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రచురణ సంస్థ ఏజేఎల్. దీని యజమాని యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్. ఇందులో సోనియా, రాహుల్ ప్రధాన వాటాదారులు. వారిద్దరికీ చెరో 38 శాతం షేర్లు ఉన్నాయి. 2010లో ఏజేఎల్‌లోని రూ.2 వేల కోట్ల విలువైన వాటాలను యంగ్ ఇండియన్ కేవలం రూ.50 లక్షలకే తీసుకుంది. సోనియా, రాహుల్, నాటి కాంగ్రెస్ సీనియర్ నేతలు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్‌తో పాటు సుమన్ దూబే, శామ్ పిట్రోడా, యంగ్ ఇండియన్ కంపెనీ మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ బీజేపీ నేత సుబ్రమణ్యంస్వామి 2014 జూన్ 26న ప్రైవేటు ఫిర్యాదుచేశారు. పటియాలా హౌస్ కోర్టుల మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దానిని పరిగణనలోకి తీసుకున్నారు. వారిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను ఢిల్లీ హైకోర్టు, తర్వాత సుప్రీంకోర్టు కూడా సమర్థించాయి. దరిమిలా ఈడీ 2021లో రంగంలోకి దిగి పీఎంఎల్‌ఏ చట్టం కింద దర్యాప్తుచేపట్టింది. సోనియా, రాహుల్‌ను పలు దఫాలు విచారించింది. 2 వేల కోట్ల విలువైన ఆస్తులను రూ.50 లక్షలకే టేకోవర్ చేయడం ద్వారా వారు ఆర్థిక లబ్ధి పొందారని తేల్చింది. అంతేగాక.. బోగస్ విరాళాల రూపంలో రూ.18 కోట్లు, రూ.38 కోట్ల అద్దె చెల్లించినట్లుగా బోగస్ అడ్వాన్సు చూపారని.. అలాగే రూ.29 కోట్ల మేర బోగస్ ప్రకటనలు కూడా చూపారని వెల్లడించింది. సదరు మూడు ప్రాపర్టీల ద్వారా రూ.988 కోట్ల మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని తెలిపింది. వీటితోపాటు రూ.90.2 కోట్ల విలువైన షేర్లను 2023 నవంబరులో ఈడీ తాత్కాలికంగా జప్తు చేసింది.

వలస రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ట్రంప్ సర్కారు నిబంధనకు కోర్టు అనుమతి

- రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే జరిమానా, జైలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: 'నీ పేపర్లు చూపించు'.. అమెరికాలో నివసిస్తున్న వలసదారులు ఇకపై ఈ డిమాండ్‌ను నిత్యం ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది. వర్క్ వీసా లేదా స్టూడెంట్ వీసాపై చట్టబద్ధంగా ఉన్నా సరే ఈ పరిస్థితి తప్పదు. ఎందుకంటే అమెరికా పౌరులు కాని 18 ఏళ్ల దాటిన వారెవరైనా 30 రోజులు దాటి దేశంలో ఉంటే తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందనే నిబంధన ఈనెల 11 నుంచి అమల్లోకి వచ్చింది. అన్ని వేళలా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలని, ఇది పాటించని వారికి ఎలాంటి మినహాయింపులు ఉండవని అమెరికా హోం ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) డిపార్టుమెంట్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇమిగ్రెంట్స్ అందరూ ప్రభుత్వం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆ డాక్యుమెంట్లు తమతో ఉంచుకోవాలని ఇటీవల ట్రంప్ ప్రభుత్వం ఓ చట్ట నిబంధన తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దానికి అమెరికా కోర్టు ఏప్రిల్ 10న ఆమోదం తెలిపింది. ఆ నిబంధనను అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషన్లను జడ్జి ట్రెవర్ ఎన్ మెక్‌ఫాడెన్ కొట్టివేశారు. దీంతో కొత్త నిబంధన అమల్లోకి వచ్చింది. 2022లో డీహెచ్‌ఎస్ లెక్కల ప్రకారం భారత్‌కు చెందిన 2.2 లక్షల మంది అక్రమ ఇమిగ్రెంట్స్ అమెరికాలో నివసిస్తున్నారు. అయితే చెల్లుబాటయ్యే వీసా ఉన్న వారు, గ్రీన్‌కార్డుదారులు, ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్, బోర్డర్ క్రాసింగ్ కార్డు, ఐ-94 అడ్మిషన్ రికార్డులను ఇప్పటికే రిజిస్టర్ అయినట్లుగా భావిస్తారని, కొత్త రిజిస్ట్రేషన్ విధానంతో వారికి ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. అయినా కూడా హెచ్1బీ, స్టూడెంట్ వీసా వ్యక్తులు ధ్రువపత్రాలను 24 గంటలూ తమ వద్ద ఉంచుకోవాలని చెబుతున్నారు. తమ పిల్లలు ఇప్పటికే రిజిస్టర్ అయి ఉన్నా కూడా 14 ఏళ్ల దాటిన వారి వేలిముద్రలతో మరోసారి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అడ్రస్ మార్పు ఉన్నా పది రోజుల్లో తెలియజేయాలి. ఈ నిబంధన పాటించపోతే 5 వేల డాలర్ల వరకు జరిమానా లేదా 30 రోజుల వరకు జైలు శిక్ష విధిస్తారు. దీంతో పాటు అమెరికాలో నివసించే అవకాశాన్ని కోల్పోవడంతో పాటు మరోసారి వారు దేశంలోకి ప్రవేశించే అవకాశం ఉండదు.

ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లకు ట్రంప్ సుంకాల మినహాయింపు

- చైనా సహా అన్ని దేశాలకూ వర్తింపు

వాషింగ్టన్, ఏప్రిల్ 12: సుంకాల నుంచి స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, సెమీకండక్టర్లు, హైటెక్ ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలకు మినహాయింపునిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శనివారం ఆ దేశ 'కస్టమ్స్ అండ్ బార్డర్ ప్రొటెక్షన్' విభాగం ఓ నోటీసు జారీ చేసింది. దీని ప్రకారం చైనా మీద విధించిన 145% సుంకంగానీ, అన్ని విదేశీ సరుకుల మీద విధించిన 10% సాధారణ సుంకంగానీ ఈ ఉత్పత్తులకు వర్తించదు. ట్రంప్ తాజాగా ప్రకటించిన ప్రతీకార సుంకాలపై అమెరికన్లలో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. చిప్‌లు, ప్రాసెసర్లు వంటివి అమెరికాలో పెద్ద ఎత్తున ఉత్పత్తి కావటం లేదు. వీటితోపాటు ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కోసం అమెరికా దిగుమతులపైనే ఆధారపడుతోంది. అడ్డగోలు సుంకాల వల్ల ఈ ఉత్పత్తుల ధరలు ఆకాశన్నంటే ప్రమాదం ఉంది. ఇది అంతిమంగా వినియోగదారులకు పెనుభారంగా మారుతుంది. దీనిపై సాధారణ అమెరికన్లతోపాటు టెక్ దిగ్గజ సంస్థలైన యాపిల్, శాంసంగ్, చిప్ తయారీ కంపెనీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే, ట్రంప్ తాజా మినహాయింపులు ప్రకటించినట్లు తెలుస్తోంది.

బెంగాల్‌లో భారీగా హింస



ముర్షీదాబాద్‌లో కర్రలు చేతబట్టి నిరసనకారుల వీరంగం


- వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు హింసాత్మకం
- ముర్షీదాబాద్ జిల్లాలో ముగ్గురి మృతి
- రాష్ట్రంలో వక్ఫ్ చట్టాన్ని అమలు చేయం: మమత

కోల్‌కతా, ఏప్రిల్ 12: వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లో పెద్ద ఎత్తున హింస చెలరేగింది. పోలీసు వ్యాన్లు సహా పలు వాహనాలకు ఆందోళనకారులు నిప్పు పెట్టారు. భద్రతాదళాలపైకి రాళ్లు రువ్వారు. హింసాత్మక ఘటనల్లో ముగ్గురు మరణించగా, అనేకమంది గాయాలపాలయ్యారు. ముర్షీదాబాద్, మాల్డా, హుగ్లీ, దక్షిణ 24 పరగణా జిల్లాల్లో శుక్రవారం ఆందోళనకారులు రోడ్లను దిగ్బంధించి ఆందోళనలు నిర్వహించారు. శనివారం కూడా ప్రత్యేకించి ముర్షీదాబాద్ జిల్లాలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ జిల్లాలో ఇప్పటి వరకు 118 మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. ఆందోళనల వల్ల న్యూ ఫరక్కా-అజీంగంజ్ సెక్షన్‌లో శుక్రవారం ఆరు గంటల పాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో బెంగాల్‌లో వక్ఫ్‌చట్టాన్ని అమలు చేయబోమని సీఎం మమత పునరుద్ఘాటించారు. 'వక్ఫ్ చట్టాన్ని మేం చేయలేదు. అది కేంద్ర ప్రభుత్వం చేసింది. అందువల్ల మీకు కావాల్సిన సమాధానాన్ని కేంద్ర ప్రభుత్వాన్నే అడగాలి' అని శనివారం 'ఎక్స్'లో మమత పోస్టు చేశారు. 'మన రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేయడంలేదు. అయినా, ఈ ఆందోళనలు ఎందుకు?' అని మమత ప్రశ్నించారు. ప్రజలు శాంతియుతంగా ఉండాలని, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ వద్దని ఆమె కోరారు. 'హింసాత్మక చర్యలను మేం క్షమించబోం. రాజకీయాల కోసం మతాన్ని దుర్వినియోగం చేయాలని కొన్ని రాజకీయపార్టీలు ప్రయత్నిస్తున్నాయి. వాటి ఉచ్చులో పడకండి' అని కోరారు. 'కొన్ని వర్గాల నుంచి ఆధారాలు లేని పుకార్ల వల్ల దురదృష్టఘటనలు చోటు చేసుకున్నాయి. ఇది స్పష్టంగా దుండగుల పనే. ఇలాంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని కోరుతున్నా' అని డీజీపీ రాజీవ్ కుమార్ అన్నారు. కాగా, ముర్షీదాబాద్ జిల్లాలో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు జరిపిన కాల్పుల్లో ఇద్దరు గాయపడ్డారని, వారిద్దరూ ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని శాంతిభద్రతల ఏడీజీ జావెద్ షమీమ్ చెప్పారు. ఆందోళనకారులపై కఠిన చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ టీఎంసీ ప్రభుత్వాన్ని కోరారు. 'రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మైనారిటీ వర్గాలు చేపట్టే ఇలాంటి హింసను ఐదు నిమిషాల్లో అణచివేస్తాం. బుజ్జగింపు ధోరణితో ఉన్న రాష్ట్ర పాలకులు తగిన చర్యలు చేపట్టడం లేదు' అన్నారు. రైల్వే ఆస్తుల ధ్వంసంపై జాతీయ దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాశారు. సమాజంలో అశాంతిని రేకెత్తించేందుకు జిహాదిస్టులు ముందస్తు ప్రణాళిక ప్రకారమే హింసకు పాల్పడ్డారని ఆయన 'ఎక్స్'లో ఆరోపించారు. సువేందు అధికారి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కలకత్తా హైకోర్టు.. ముర్షీదాబాద్ జిల్లాలో కేంద్రబలగాలను రంగంలోకి దించాలని ఆదేశించింది. జస్టిస్ సౌమెన్ సేన్, జస్టిస్ రాజా బసు చౌదరితో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది.

తండ్రీకొడుకులు మృతి..

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనల నేపథ్యంలో ముర్షీదాబాద్ జిల్లా శంషేర్‌గంజ్ ప్రాంతంలోని జఫ్రాబాద్‌లో ఇద్దరు వ్యక్తులు కత్తిపోట్లకు గురై మరణించారు. మృతులను తండ్రీకొడుకులుగా గుర్తించారు. వారు ఇంట్లోనే రక్తపు మడుగులో పడిఉన్నారని, శరీరాలపై అనేక కత్తిపోట్లు ఉన్నాయని, ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించారని పోలీసులు తెలిపారు. ఆందోళనకారులు తమ ఇంటిని లూటీ చేశారని, అనంతరం వారిద్దరినీ కత్తులతో పొడిచి వెళ్లిపోయారని మృతుల కుటుంబసభ్యులు చెప్పారు. కాగా, శంషేర్‌గంజ్ బ్లాక్‌లోని దులియా ప్రాంతంలో జరిగిన హింసలో ఒక వ్యక్తికి బుల్లెట్ గాయమైనట్టు పోలీసులు తెలిపారు.





పంతుళ్లకు ప్రవేశ పరీక్ష!

వేసవి సెలవుల్లో ప్రభుత్వ ప్రత్యేక కార్యాచరణ

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పంతుళ్లు ఈ వేసవిలో ప్రవేశ పరీక్షను ఎదుర్కోనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించే పోటీని ప్రభుత్వం వేసవి సెలవుల్లో పంతుళ్లకు పెట్టబోతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో నానాటికీ ప్రవేశాల సంఖ్య తగ్గిపోతుండటంతో ప్రభుత్వం ఓ బృహత్తర ప్రణాళికకు కార్యాచరణ రూపొందించింది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల సిబ్బంది వేసవి సెలవుల్లో క్యాంపెయిన్ చేస్తూ ప్రవేశాలు చేసుకునే పద్ధతిని ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ఆలోచనలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంపొందించేందుకు ప్రతీ ఉపాధ్యాయుడు ఇంటింటి ప్రచారం చేయాలని, విద్యార్థులను ఎక్కువ సంఖ్యలో పాఠశాలలో చేర్పించాలని డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ వేసవిలో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టేందుకు కార్యాచరణను సిద్ధం చేయాలని చెప్పారు. పాఠశాలల పునఃప్రారంభం నుంచి 15రోజుల పాటు మొక్కుబడిగా నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమం వల్ల ఎలాంటి ప్రయోజనాలు లేవని గుర్తించింది. పంతుళ్లను ప్రవేశాల కోసం క్షేత్రస్థాయిలో ప్రచారానికి పంపించేందుకు రంగం సిద్ధం చేసింది. క్షేత్రస్థాయి ప్రచారానికి వెళ్లే టీచర్లకు వేసవిలో ప్రత్యేక శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసేందుకు విద్యాశాఖ కార్యాచరణను సిద్ధం చేసింది.

పాయింట్ల ప్రాధాన్యత

ప్రభుత్వం చేపడతున్న వినూత్న కార్యక్రమం ప్రవేశాల కోసం క్షేత్ర స్థాయిలో ప్రచారం చేస్తూ వారి లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థులను చేర్పించిన ఉపాధ్యాయులకు పాయింట్లు కేటాయించనున్నారు. ఈ పాయింట్లను ఉపాధ్యాయుల సర్వీస్ రికార్డుల్లో చేర్చి వాటితో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సమయాల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు. ప్రవేశ పోటీల్లో ఉపాధ్యాయులు సాధించిన పాయింట్లను ప్రామాణికంగా తీసుకొని వారికి లబ్ధిని చేకూర్చనున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత వస్తుందనే ఎత్తుగడతో టార్గెట్ పూర్తి చేసిన ఉపాధ్యాయులకు పాయింట్లు కేటాయించి.. వారు సాధించిన పాయింట్ల ద్వారా ప్రాధాన్యత కల్పించనున్నారు.

ప్రవేశాల టార్గెట్

ప్రభుత్వ ఉపాధ్యాయులను క్షేత్రస్థాయిలో ప్ర చారానికి పంపించి ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు విద్యాశాఖ ఇప్పటికే విధానపరమైన నిర్ణయాన్ని తీసుకుంది. అందులో భాగంగానే ప్రతీ ఉపాధ్యాయుడికి విద్యార్థులను చేరించే టార్గెట్‌ను ఫిక్స్ చేయనుంది. లక్ష్యాలకు అనుగుణంగా ప్రతీ ఉపాధ్యాయుడు పనిచేయాల్సి ఉంటుంది. ఇందుకోసం వేసవిలో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణను విద్యాశాఖ సిద్ధం చేసింది. ఈ శిక్షణా శిబిరాల్లో ఉపాధ్యాయులకు వివిధ స్థాయిల్లో శిక్షణ ఇవ్వనున్నారు. క్షేత్రస్థాయిలో ప్రచారం ఎలా చేయాలి? ఊరూరా తిరుగుతూ ఎలా విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ బడులపై నమ్మకం కలిగేలా ప్రచారం చేయాలనే తదితర అంశాలపై దశల వారికి పంతుళ్లకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతీ ఏడాది విద్యాసంవత్సరం ఆరంభంలో చేపడుతున్న బడిబాట మొక్కు బడిగానే సాగుతూ ఆశించిన ఫలితాలను గుర్తించిన ప్రభుత్వం.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది.

- పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడమే ప్రతీ ఉపాధ్యాయుడి లక్ష్యం
- ఎక్కువ మందిని చేర్పించిన వారికి పాయింట్లు నమోదు
- సర్వీసు బుక్కుల్లో చేర్చి పదోన్నతులు, బదిలీల్లో ప్రాధాన్యం
- డీఈవోలకు ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ డైరెక్టర్

ప్రవేశాల సంఖ్య ఎందుకు తగ్గుతోంది?

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య ఏడాదికేడాది తగ్గుతూనే ఉంది. 2022-23 విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 28.80లక్షల విద్యార్థులు చేరితే 2024-25 నాటికి ఈ సంఖ్య 25.13 లక్షలకు చేరింది. అంటే 3.5 లక్షలకుపైగా విద్యార్థుల ప్రవేశాల సం ఖ్య తగ్గిపోయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2022-23లో 10 వేల మంది విద్యార్థులు ప్రవేశాలు పొందగా, 2024-25కు ఆ సంఖ్య 6 వేలకు తగ్గింది. అ యితే ప్రైవేటు స్కూ ళ్లలో మాత్రం ఏడాదికేడా ది ప్రవేశాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోం ది. ఈ పరిస్థితిపై విద్యాశాఖ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దీనిపై ముఖ్యమంత్రి విద్యాశాఖ అధికారులతో ఇటీవల సమీక్షను నిర్వహించారు. ఇదే సమయంలో రాష్ట్ర విద్యాకమిషన్ సైతం ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల దుస్థితిపై ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. ప్రజలకు ప్రభుత్వ బడులపై విశ్వాసం పెంచేలా చర్యలు తీసుకోవాలిన సిఫారసు చేసింది. ఇందులో ప్రభుత్వ పంతుళ్లు కీలక పాత్ర పోషించేలా చూడాలని సూచించింది. ఇదిలా ఉండగా, ప్రభుత్వం ఏటా ఒక్కో విద్యార్థిపై రూ.80వేలు ఖర్చు చేస్తోందని, మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ప్రైవేటు కంటే ప్రభుత్వ స్కూళ్లలోనే అన్ని విధాలా అర్హత గల టీచర్లు ఉండగా పిల్లలెందుకు చేరడం లేదని ముఖ్యమంత్రి అనేక సార్లు విద్యాశాఖాధికారులను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల చేరికను విద్యాశాఖ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. దీంతో వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల చేరికలను పెరిగేలా కార్యాచరణ అమలు చేసేందుకు విద్యాశాఖ సమాయత్తం అవుతోంది.

రజతోత్సవంపై ప్రజలకు స్పష్టత ఉంది..

- కాంగ్రెస్ నేతలే అయోమయంలో ఉన్నారు..
- లక్షలాదిమందితో రజతోత్సవ సభ నిర్వహిస్తున్నాం..
- సభ అనుమతిలో పోలీసుల నిర్లక్ష్యంతోనే కోర్టుకెక్కాం..
- పార్టీ నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవు..
- సభ విజయవంతానికి సమన్వయంతో పని చేసుకున్నాం..
- 'ఆంధ్రజ్యోతి'తో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి చిట్‌చాట్

9





సనాతన ధర్మమే ప్రాచీనమైనది

- హిందువులంతా ధర్మం కోసం పోరాడాలి..
- ఆధ్యాత్మిక గురువు చాముండేశ్వరి మహర్షి
- నగరంలో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

9



హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలి

- అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు
- ఎస్సీ డెవలప్‌మెంట్ రోడ్లను పూర్తి చేయాలి..
- గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి..
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం

9

రేషన్ బియ్యం కల్తీ చేస్తే చర్యలు

- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- దేశాయిపేటలో లబ్ధిదారుల ఇంట్లో సహంపక్తి భోజనం

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 12, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీలో రేషన్ షాపుల నిర్వాహకులు కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర అటవీ. పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. గ్రేటర్ వరంగల్ 12వ డివిజన్ దేశాయిపేటలో శనివారం సన్నబియ్యం లబ్దిదారుడు సోల పూర్ణచందర్ ఇంట్లో ఆమె సహంపక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పథకాన్ని పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేషన్ దుకాణాలలో సన్నబియ్యం కల్తీకి పాల్పడితే పీడి యాక్టులు నమోదు చేసి, నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేస్తామని హెచ్చరించారు. రేషన్ షాపుల పనితీరును అధికారులు నిత్యం పర్యవేక్షిస్తారని, తూకాల్లో మోసా లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు కలెక్టర్ సత్యశారద, మున్సిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీవాకడే, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసిల్దార్ మహ్మద్ ఇక్బాల్, ఆర్‌ఐలు కృష్ణస్వామి, దినాకర్, కార్పొరేటర్లు కావటి కవితయాదవ్, సురేష్‌జోషి, బస్వరాజు కుమారస్వామి, చింతాకుల అనిల్, కాంగ్రెస్ నాయకులు నవీన్‌రాజ్, మీసాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ కాశిబుగ్గ భగత్‌సింగ్ నగర్‌లో పలు అభివృద్ధి పనులకు మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రూ.22లక్షలతో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు నిర్మిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, మున్సిపల్ కమిషనర్ అశ్వినీతానాజీవాకడే, స్థానిక కార్పొరేటర్ ఓని స్వర్ణలతభాస్కర్, కాంగ్రెస్ నాయకులు గోపాలనవీన్‌రాజ్, మీసాల ప్రకాష్, దాసరి రాజేష్, పల్లకొండ రాజమణి, పద్మ గంగాధర్, రేఘాడి కిరణ్, ముత్తయ్య, జంగం మల్లేశం, పాలకుర్తి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సన్నబియ్యం లబ్దిదారుడి ఇంట్లో సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రి కొండా సురేఖ, కలెక్టర్, బల్దియా కమిషనర్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కేసీఆర్‌కు కడియం వెన్నుపోటు

- పార్టీ ఫండ్ తీసుకుని కాంగ్రెస్‌లో చేరారు..
- రాజీనామా చేసేంత వరకు వెంట పడుతాం..
- సిగ్గు ఉంటే రాజీనామా చేసి గెలవాలి..
- మోసం చేయడంలో శ్రీహరి దిట్ట
- మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

9

భూకబ్జా ఆరోపణలు నిరూపిస్తే.. గులాంగిరి చేస్తా..

- చీము, నెత్తురు ఉంటే పల్లా తన సవాల్ స్వీకరించాలి
- పార్టీ ఫిరాయింపులకు శ్రీకారం చుట్టిందే బీఆర్ఎస్
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

9

బీఆర్ఎస్ ప్రస్థానం ముగిసినట్లే..

- రజతోత్సవ సభకు అర్థమే లేదు..
- 25 ఏళ్లు బీఆర్ఎస్‌కా.. టీఆర్ఎస్‌కా..?
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని, ఇక ఆ పార్టీ ప్రస్థానం ముగిసినట్లేనని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ పార్టీ రజతోత్సవ సభను నిర్వహించడంలో అర్థమే లేదన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమవేశంలో ఆయన బీఆర్ఎస్ నేతలపై ధ్వజమెత్తారు. 25 ఏళ్లు పూర్తయ్యింది టీఆర్ఎస్‌కా.. లేక బీఆర్ఎస్ కా.. అనే విషయంలోనే స్పష్టత లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలన అంతా మోసాలతోనే సాగిందని, ఇందులో ప్రధానమైన 25మోసాలను ప్రజల ముందు ఉంచుతున్నట్లు రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మోసాల పేరిట కరపత్రాలను మీడియా ముందు ప్రదర్శించారు. బీఆర్ఎస్ సభను కాంగ్రెస్ అడ్డుకుంటుందనే బీఆర్ఎస్ నేతల వాదన దుష్ప్రచారమేనని రాజేందర్‌రెడ్డి కొట్టిపారేశారు. అధికార బలాన్ని ఉపయోగించడం, పోలీసులతో అడ్డగించాలనే ఆలోచనలే కాంగ్రెస్‌కు లేవన్నారు. ఇలాంటి కుట్రలు బీఆర్ఎస్ పాలనలో జరిగాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ చచ్చిన పాములాంటిదని, ఈ దశలో పట్టించుకునే దెవరని రాజేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఇక మున్ముందు చిలక జోస్యం చెప్పడమే పనిగా మారనుందని రాజేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అధిష్ఠానం విశ్వాసం కోల్పోయిందని హరీశ్‌రావు చెప్పడం హాస్యాస్పదమన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లు ఇద్దరు కలిసి హరీశ్‌రావును పార్టీ నుంచి సాగనంపే పనిలో ఉన్నారని ఆరోపించారు.

వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలన దక్షతను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీయే మెచ్చుకున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలకు విలువే లేదని పేర్కొన్నారు. వరంగల్ అభివృద్ధి కోసం రూ.6వేల కోట్ల నిధులను సీఎం విడుదల చేశారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ సభకు ప్రజాదరణ ఉండబోదన్నారు. ఉనికి కోసం ఆ పార్టీ నేతలు నానా తంటాలు పడుతున్నారని విమర్శించారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ మాట్లాడుతూ.. సభ పేరిట పంపిన కాసుల కోసమే వరంగల్ బీఆర్ఎస్ నేతలు కక్కుర్తి మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బంక సరళాదేవి, పెరుమాండ్ల రామక్రిష్ణ, అనిల్‌కుమార్, రహీమున్నీసా, కూర వెంకట్, లక్ష్మారెడ్డి, గుంటి స్వప్న, జాఫర్, గణేశ్, ఖుర్షీద్, తాడిశెట్టి విద్యాసాగర్, పుప్పాల ప్రభాకర్, బోడ డిన్నా, చీకటి ఆనంద్‌తో పాటు కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, జక్కుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ కడియం కావ్య, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ

డ్రంకెన్ డ్రైవ్ చేస్తే చర్యలు : సీపీ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ హెచ్చరించారు. వాహనాదారులు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రమాదాలకు కారకులవుతున్నారని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో మృత్యువాత పడుతుండటంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ వాహనదారులకు కమిషనరేట్ కార్యాలయంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. తద్వారా న్యాయమూర్తి వాహనదారులకు జరిమాన లేదా జైలు శిక్ష విధుస్తున్నారని గుర్తు చేశారు. నెల రోజులుగా కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 3,029 కేసులు నమోదు కాగా, 53 మందికి జైలు శిక్ష, మరో 15 మందికి సామాజిక సేవా చేయాలంటూ కోర్టు తీర్పు ఇచ్చింద న్నారు. మిగతా వాహనదారులకు రూ.15,72,600 లక్షల జరిమానా విధించిం ద న్నారు. కాగా, వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపడం ఇకనైనా మానుకుని గమ్యానికి సురక్షితంగా చేరాలని సీపీ సూచించారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అనుమతి

- పలు షరతులు విధించిన పోలీసులు
- మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు సభ


సభ అనుమతి లేఖను అందుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

వరంగల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వరంగల్ పోలీసులు అనుమతిచ్చారు. శనివారం రాత్రి బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీష్‌లకు కాజీపేట ఏసీపీ తిరుమల్ పలు షరతులతో కూడిన అనుమతిని లేఖను అందించారు. 27న మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు సభ నిర్వహణకు అనుమతి ఇచ్చారు. అలాగే సభ లో సీసీ కెమెరాలు, బారికేడ్లు, సరిపడా పబ్లిక్ గ్యాలరీలు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్లు, తాగునీరు, తదితర వాటిని సమకూర్చాలని ఆ ఆదేశాల్లో పోలీసులు పేర్కొన్నారు. దీంతో కొద్దిరోజులుగా బీఆర్ఎస్ సభకు అనుమతి నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.

ఆల్ ఇండియా టోర్నమెంట్‌కు జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో డైరెక్టర్ వెంకయ్య

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10 నుంచి 14 వరకు మహార గంగా సింగ్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా పురుషుల సైక్లింగ్ పోటీలకు కేయూ జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన వారిలో ఎన్.రాజేశ్, ఎమ్డీ రియాజ్, జె.సంజీవ్, జి.లోకేశ్, ఎన్.మహేందర్‌యాదవ్, కె.బాలమురుగన్‌లు ఉన్నట్లు పేర్కొన్నారు. వీరికి పీడీ రాజేశ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను వర్సిటీ అధికారులు అభినందించారు.

క్రీడారంగానికి సీఎం రేవంత్ అధిక ప్రాధాన్యం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- క్రీడలాభివృద్ధి పనులకు శంకుస్థాపన

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి విద్య, వైద్యంతో పాటు క్రీడారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ, ప్రత్యేక బడ్జెట్ కేటాయించి అభివృద్ధి చేస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని జేఎన్ ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలు, స్విమ్మింగ్‌పూల్ సుందరీకరణ, అభివృద్ధి, మరమ్మతు పనులకు ఎమ్మెల్యే నాయిని, ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినీ తానాజీలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలోని బ్యాడ్మింటన్ కోర్టు, సింథటిక్‌ట్రాక్ పక్కన క్రీడాకారుల కోసం వామప్ ట్రాక్, బాలసముద్రంలోని డీఎస్ఏ స్విమ్మింగ్‌పూల్ సుందరీకరణకు పనుల నిర్మాణం కోసం అంచనా వ్యయం సుమారు రూ.2.కోట్ల 33 లక్షల నిధులతో శంకుస్థాపన చేశామన్నారు. అదే విధంగా డీఎస్ఏకు నిధులు చేకూరడానికి బస్టాండ్ సర్కిల్ నుంచి చౌరస్తాకు వెళ్లే మార్గంలో జేఎన్ స్టేడియం సమీపంలోని ఉన్న ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడానికి నగరానికి వచ్చే క్రీడాకారుల బస, హాస్టల్ వసతి కల్పించడానికి రెండు నెలల కాలంలో ప్రణాళిక రూపొందిస్తామన్నారు.


జేఎన్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ కోర్టు మరమ్మతు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని, ఎంపీ కావ్య, కలెక్టర్ ప్రావీణ్య

విశిష్ట అతిథి వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగర అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. జేఎన్ఎస్ వేదికగా నిర్వహించే జాతీయ, అంతర్జాతీ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అనుకూలంగా ఉండటానికి హాస్టల్ నిర్మాణం, ఇతర వసతులను ఏర్పాటు చేయాడానికి నూతనంగా భవన నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. డీవైఎస్‌వో అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. హనుమకొండ ఇండోర్ స్టేడియంలోని బ్యాడ్మింటన్ కోర్టు ప్రత్యేక సుందరీకరణ పనుల కోసం రూ.68లక్షలు, స్విమ్మింగ్‌పూల్ అభివృద్ధికి రూ.41లక్షలు, జేఎన్ఎస్‌లోని జిమ్నాస్టిక్స్ హాల్ మరమ్మతుల కోసం రూ.34లక్షలు, అదే విధంగా జేఎన్ఎస్‌లోని సింథటిక్ వామప్ ట్రాక్ నిర్మాణం కోసం రూ.90లక్షలు జీడబ్ల్యూఎంసీ సాధారణ నిధుల నుంచి కేటాయించారని తెలిపారు. ఈ సందర్భంగా త్వరలో జేఎన్ స్టేడియంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన కట్టడాల మ్యాప్‌ను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఎమ్మెల్యే నాయిని, ఎంపీ కావ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినీ తానాజీ లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ వరదరాజేశ్వర్‌రావు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రమేష్‌రెడ్డి, హ్యాండ్‌బాల్ కార్యదర్శి శ్యామాల పవన్ కుమార్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, స్విమ్మింగ్ అసోసియేషన్ బాధ్యులు మంచాల స్వామిచరణ్, డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమాన్, కొత్త ప్రశాంత్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, రాయబారపు నవీన్, జీవన్‌గౌడ్, కూరపాటి రమేష్, రాజు, ఎండీ. అఫ్జల్, రాజారపు రమేష్, మునిసిపల్ ఏఈలు, డీఈలు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమానత్వపు హక్కులను కాలరాస్తున్న కేంద్రం

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- కాటారంలో రాజ్యాంగ స్థూపం ఆవిష్కరణ


సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కాటారం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలోని భావప్రకటన, స్వేచ్ఛ, సమానత్వపు హక్కులను బీజేపీ, కాంగ్రెస్ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో ఏముందో అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో బహుజన సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ స్థూపాన్ని పెద్దపల్లి, భూపాలపల్లి మాజీ జడ్పీ చైర్ పర్సన్లు పుట్ట మధు, జక్కు శ్రీహర్షిణి రాకేష్‌తో కలిసి ఆయన శనివారం ఆవిష్కరించారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు, బహుజన సేనా నాయకులతో ర్యాలీగా అయ్యప్ప కల్యాణ మండపానికి చేరుకున్నారు. అక్కడ బీఆర్ఎస్ నేత జక్కు రాకేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కొప్పుల మాట్లాడారు. రాజ్యాంగం అమలై వజ్రోత్సవ వేడుకలు జరుపుకుంటున్న తరుణంలో అందులో ఏముందో 99 శాతం మంది ప్రజలకు తెలియకపోవడం అత్యంత బాధాకరమని అన్నారు.

విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రపంచంలో అతి పెద్ద రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ ఆశయాలను అన్ని వర్గాల ప్రజలు కొనసాగించాలన్నారు. కొందరు నాయకులు ఓ వైపు రాజ్యాంగ పరిరక్షణ అంటూ గొప్పలు చెబుతూనే చట్టసభల్లో రాజ్యాంగంపై వ్యతి రేకంగా మాట్లాతారని దుయ్యబట్టారు. అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని విమర్శించారు. బీజేపీ ప్రజల మధ్య విభజన రేఖలు పెట్టి మతోన్మాద చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. మాయ మాటలతో అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ ఎన్నికల హామీలను మూలన పడేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల బీఆర్ఎస్ పార్టీ జిల్లా, మండల నాయకులు రాజిరెడ్డి, శంకర్‌లాల్, గీతాబాయి, జోడు శ్రీనివాస్, రామిళ్ల కిరణ్, సౌజన్య, శ్రీలక్ష్మి, రాజమణి, సడువలి, శ్రావణ్, వెంకటేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి, రాఘవరెడ్డి, రాజబాపు, రమణ, వెంకటస్వామి, రవీందర్, జనార్దన్, దుర్గారావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలను ఏప్రిల్ 21 నుంచి నిర్వహిస్తామని వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు షెడ్యూల్ వెలువరించారు. బీఏ, బీకామ్, బీఎస్సీలతో పాటు ఇతర డిగ్రీ కోర్సుల పరీక్షల పరీక్షలు వివరాలను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ పి. వెంకటయ్యలు వెల్లడించారు. డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 21, 23, 25, 28, 30, మే 2, 5, 7 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, అలాగే నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 22, 24, 26, 29, మే 1, 3, 6, 8, 14 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే ఆరో సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 21, 23, 22, 25, 28, 30, మే 2, 5, 7, 9, 15, 16, 17, 19 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో పరీక్షలు జరుగుతాయి. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని అధికారులు పేర్కొన్నారు.

ప్రైవేట్ కళాశాలల వెనుకంజ

రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిష్‌లు ఇవ్వడం లేదని, ఈ దఫా వర్సిటీ పరిధిలో సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు తాము సహకరించేది లేదని వర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఇటీవల వర్సిటీ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలను అందచేశారు. గతంలోనూ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షలకు సహకరించేది లేదని అల్టిమేటం జారీచేసి చివరి నిమిషంలో ప్రభుత్వ హామీ మేరకు ప్రైవేట్ కళాశాలు పరీక్షల నిర్వహణకు ఒకే చెప్పాయి. అయితే ఈ దఫా పరీక్షల నిర్వహణ ఎలా అనే అంశంపై చర్చ నడుస్తోంది. ప్రభుత్వ ఆదేశాలతో ప్రైవేట్ కళాశాలలు సహకరిస్తాయా? లేదా అనేది సందేహంగా మారింది.

నిట్‌లో విద్యార్థుల నిరసన


నిట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కాజీపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లి చెరువులో పడి గురువారం ఆత్మహత్య చేసుకున్న నిట్ వరంగల్ సెకండ్ ఇయర్ విద్యార్థి హృతిక్ సాయి సంతాపసభ శనివారం క్యాంపస్ ఆందోళనకు దారితీసింది. క్యాంపస్‌లో శనివారం విద్యార్థులు, కొంత మంది ప్రొఫెసర్లు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించేందుకు క్యాంపస్ బయటకు రాగానే విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు చేస్తూ నిరసన చేపట్టారు. క్యాంపస్‌లో వివిధ క్లబ్‌లలో విద్యార్థులు చేరాలంటే 6.5 జీపీఏ సాధించిన విద్యార్థులకే కాకుండా మిగతా వారికి అనుమతి కల్పించాలని, స్టూడెంట్స్ ఎలక్షన్స్‌లో మార్కుల అర్హత కాకుండా అందరూ పోటీ చేసే అవకాశం కల్పించాలని, మెస్‌లో నాణ్యత కలిగిన ఆహారం లేదంటూ ఆందోళన చేపట్టారు.

దీంతో హృతిక్ సంతాప జరగకుండా గందరగోళ పరిస్థితి నెలకొంది. విద్యార్థులు క్యాంపస్‌గేట్ వద్దకు పెద సంఖ్యలో చేరుకుని ఆందోళనకు దిగారు. విషయం చేయి దాటిపోతుందని గమనించిన అడ్మినిస్ట్రేషన్ విభాగం విద్యార్థులతో చర్చలు జరిపారు. విద్యార్థులు లేవనెత్తిన సమస్యలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు రాకుండా చూసుకుంటామని నచ్చజెప్పారు. విషయం తెలుసుకున్న స్థానిక సీఐ వై.సుధాకర్‌రెడ్డి బృందం క్యాంపస్ చేసుకుని ఆందోళనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎం, కవి అన్వర్ మృతి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హిందీ కవి, రిటైర్డ్ గెజిటెడ్ హెడ్మాస్టర్ అన్వర్(63) అనారోగ్యంతో శనివారం తుది శ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అన్వర్.. నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. అన్వర్ హిందీ భాషా బోధన, సాహిత్యం, వ్యాకరణంలో నిపుణులే కాక తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌లో రచనలు చేశారు. వరంగల్‌లో హిందీ భాషను ప్రచారం, పోత్సాహంలో ఆయన కృషి చేశారు. సీటీఈలో ఆయన శిక్షకుడిగా పనిచేశారు. అన్వర్ మృతి పట్ల హిందీ టీచర్స్ ఫోరం ఉపాధ్యాయులు లక్ష్మణ్, సుధాకర్, గౌస్‌పాషా, అనురాధ, రమేష్‌బాబు, అంబప్రసాద్, వెంకటేశ్వరు, రఫీకాబేగం, సునీత తదితరులు సంతాపం ప్రకటించారు.

వరంగల్ ప్రెస్‌క్లబ్‌కు అవార్డు

వడ్డెపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. తెలంగాణ రాష్ట్రం నుంచి ఉత్తమ ప్రెస్‌క్లబ్‌గా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఎన్నికైంది. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజుకు ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్యలకు అవార్డును అందజేశారు.

కూచిపూడిలో హరిత
గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్



రెడ్డికాలనీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్య ప్రదర్శనలో హనుమకొండలోని గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన డాక్టర్ గుంటోజు హరిత గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ప్రపంచ అతి పెద్ద కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఆమె పాల్గొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 4218 మంది నృత్య కళాకారులు పాల్గొనగా హరితకు నృత్య ప్రదర్శనలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ దక్కింది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి కల్యాణం


వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కురవి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కందికొండలో వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వ హించారు. అర్చకులు ప్రసాద్ వేద మంత్రోచ్చరణల నడుమ కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహిం చారు. కార్యక్రమంలో జంగాల భాస్కర్, జంగాల నర్సింహా, గ్రామస్థులు బండి వెంకన్న, సీహెచ్. ముత్తి లిం గం, అల్వాల భాస్కర్, నరేష్, కొల్లూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుడిపై కేసు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కాశిబుగ్గ ప్రాంతంలో నకిలీ వైద్యుడు సుహానా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు జి.సదానందంపై కేసు నమోదు చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీ అయిన నకిలీ వైద్యుడు గుర్రం సదానందం ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నాడన్న సమాచారంతో శనివారం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తనిఖీలో నిర్వహించి ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్‌లో రిజిస్ట్రార్ డి.లాలయ్య కుమార్, చైర్మన్ డాక్టర్ కె.మహేశ్‌కుమార్‌లు ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎంఎన్‌సీ చట్టం సెక్షన్లు 34, 35 ప్రకారం, టీఎస్ఎంపీఆర్ చట్టం 22 ప్రకారం ఈ కేసు నమోదు కాగా, చట్టం ప్రకారం నకిలీ వైద్యుడికి ఒక సంవత్సరం జైలుశిక్ష లేదా రూ.5 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌లో ఉద్యోగ అవకాశాలు


సమావేశంలో మాట్లాడుతున్న దక్షిణాఫ్రికా దర్బన్ వర్సిటీ ప్రొఫెసర్ రవీందర్ రేనా

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచీకరణ దృష్ట్యా మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌లో విస్తృతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని దక్షిణాఫ్రికా దర్బన్ వర్సిటీ ప్రొఫెసర్ రవీందర్ రేనా అన్నారు. శనివారం కేయూలో విద్యార్థులకు 'సమకాలీన పరిస్థితుల్లో మేనేజ్‌మెంట్ విద్య' అనే అంశంపై విస్తృత ఉపన్యాసం నిర్వహించారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్, కేయూ అర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అధ్యక్షతన జరిగిన సదస్సులో రవీందర్ రేనా ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు విద్య, ఉపాధి అవకాశాలతో పాటు మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులను విశదీకరించారు. ప్రాశ్చాత్య దేశాల్లో మేనేజ్‌మెంట్ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ప్రాజెక్టు విద్యకు మంచి అదరణ లభిస్తోందని చెప్పారు. ప్రాజెక్టు విద్యతోనే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా వస్తాయని చెప్పారు. ఎంబీఏ విద్యార్థులకు మార్కెటింగ్‌లో మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు విద్యకు వర్సిటీలు అత్యంత ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు వీణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కడియం వర్సెస్ పల్లా

- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య మాటల యుద్ధం
- విమర్శ, ప్రతివిమర్శలతో జనగామ జిల్లాలో రాజకీయ వేడి



జనగామ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాలో రాజకీయం వేడెక్కింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య రాజుకున్న మాటల మంటలు జిల్లాలో హీట్ పుట్టిస్తున్నాయి. మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వారం రోజులుగా మాటల తూటాలు పేల్చుకుంటున్నారు. నిన్నమొన్నటి వరకు రాజకీయ వ్యాఖ్యల వరకే పరిమితమైన ఈ ఇద్దరు నేతలు.. ఏకంగా వ్యక్తిగత దూషణలకు సైతం దిగుతున్నారు. 'బొచ్చుకుక్క, గుంటనక్క' వంటి మాటలతో జిల్లాలో రాజకీయాన్ని వేడెక్కిస్తున్నారు. ఇటు కడియం శ్రీహరి, అటు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మధ్య జరుగుతున్న విమర్శలు, ప్రతి విమర్శల పర్వం జిల్లాలో చర్చనీయాశంగా మారింది.

'ఉప ఎన్నిక' ఊహాగానాలతో..

పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటు పడితే ఉప ఎన్నిక ఖాయమని బీఆర్ఎస్ భావిస్తోంది. దీంతో ఘన్‌పూర్‌లో తిరిగి తమ పార్టీని గెలిపించుకోవాలని ఆ పార్టీ నేత లు భావిస్తున్నారు. ఇదే క్ర మంలో తాజాగా సు ప్రీంకోర్టులో వాద నలు, తీర్పు వాయిదాల నే పథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆశలు రేకెత్తుతున్నాయి. తమకు అనుకూలంగా తీర్పు వస్తే ఎన్నికల్లో పోటీకి సిద్ధమంటూ మాజీ ఎమ్మెల్యే రాజయ్య సంకేతాలు ఇస్తున్నారు. ఇదే క్రమంలో కడియం శ్రీహరిపై వి మర్శలకు దిగుతున్నారు. ఉప ఎన్నిక ఊహాగానాల తో బీ ఆ ర్ ఎ స్ శ్రేణులు వి మర్శలకు దిగుతుండగా మరోవైపు కాంగ్రెస్ శ్రేణులు సైతం ధీటుగా తిప్పికొడు తున్నారు. 'పార్టీ ఫిరాయింపుల అంశం సుప్రీంకోర్టులో ఉన్నందున తాను మాట్లాడబోనని, ఒక వేళ ఉప ఎన్నిక గనుక వస్తే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నా' అంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గట్టిగా చెబుతున్నా రు. ఉప ఎన్నిక ఊహాగానాల నేపథ్యంలో కడియం శ్రీహరిని బీఆర్ఎస్ నేతలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాటికొండ రాజయ్య టార్గెట్ చేస్తుండగా కడియం సైతం ఆ ఇద్దరు నేతలను ధీటుగా ఎదుర్కొంటున్నారు.

విమర్శలు.. ప్రతివిమర్శలు..

కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి మధ్య విమర్శ ప్రతివిమర్శలు వాడీవేడీగా మారుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల ముందు వరకు బీఆర్ఎస్‌లో కొనసాగిన కడియం శ్రీహరి.. ఎంపీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరారు. అంతకుముందు కడియం, పల్లా బీఆర్ఎస్‌లోనే కలిసి పనిచేశారు. కాగా.. పార్టీ మారిన నాటి నుంచి శ్రీహరిపై పల్లా విమర్శలు చేస్తూ వస్తున్నారు. కడియం కావ్యకు బీఆర్ఎస్ పార్టీ బీఫామ్ ఇచ్చి ఎన్నికల ఖర్చుకు ఫండ్ ఇచ్చిందని పల్లా చెబుతూ వస్తున్నారు. తాజాగా మరోసారి ఆ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. దీనితో పాటు స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఒక్క రిజర్వాయర్ నిర్మాణం చేయలేదని, రూ.800 కోట్లు కాదు కదా రూ.8కూడా తేలేదంటూ మాట్లాడారు. అదే విధంగా ధర్మసాగర్ మండలంలోని దేవునూర్‌లో బినామీ పేర్లతో అటవీ భూములను కబ్జా చేశారంటూ కడియంపై పల్లా, తాటికొండ రాజయ్య విమర్శలు చేశారు. దీనిపై కడియం శ్రీహరి స్పందిస్తూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజయ్యపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి బొచ్చుకుక్కలాంటోడని మండిపడ్డారు. పల్లా, రాజయ్య చౌకబారు విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. దీనిపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రతి స్పందిస్తూ తాను 'కుక్కనేనని.. ప్రజలకు కాపలా కుక్కను అని, కానీ కడియంలాగా గుంటనక్కను కాను' అని విమర్శించారు. కాగా.. పల్లా వ్యాఖ్యలపై జనగామలో శనివారం కడియం ప్రెస్‌మీట్ ద్వారా మాట్లాడుతూ 'కాపలా కుక్క అయినా కుక్కనే కాదా', సిగ్గులేని వెధవ..' అం టూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాగా.. ఈ ఇద్దరు నేతల పోటాపోటీ ప్రెస్‌మీట్లకు తోడు కాంగ్రెస్, బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులు సైతం పోటాపోటీగా ప్రెస్‌మీట్లు పెడుతూ విమర్శలు చేసుకుంటున్నారు.

'సోషల్' వార్

జిల్లాలో ప్రస్తుతం కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి మధ్య జరుగుతున్న మాటల యుద్ధం 'సోషల్' వార్‌గా మారింది. ఈ ఇద్దరు నేతల అనుచరులు, ఇరు పార్టీల శ్రేణులు సోషల్ మీడి యా వేదికగా ఘాటైన విమర్శలు చేసుకుంటున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్ వేదికగా ప్రత్యక్ష దూషణలకు దిగుతున్నారు. కాగా.. ఇటీవల కడియం శ్రీహరిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ షోడషపల్లికి చెందిన బీఆర్ఎస్ నేతలు, జనగామకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో రెండు పార్టీల మధ్య రాజకీయ వేడి మరింత ముదిరింది. కాగా.. తనపై అనుచితంగా పోస్టులలు పెట్టేవారి వి షయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని కడియం శ్రీహరి తాజాగా వ్యాఖ్యానించడం మరింత హీట్ పెంచింది.

భూకబ్జా ఆరోపణలు నిరూపిస్తే.. గులాంగిరి చేస్తా..

- చీము, నెత్తురు ఉంటే పల్లా తన సవాల్ స్వీకరించాలి
- పార్టీ ఫిరాయింపులకు శ్రీకారం చుట్టిందే బీఆర్ఎస్
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

జనగామ రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తనపై చేసిన భూకబ్జా ఆరోపణలు నిరూపిస్తే పల్లా ఇంట్లో తాను గులాంగిరి చేస్తానని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జనగామలోని శనివారం కడియం శ్రీహరి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది బీఆర్ఎస్ పార్టీయేనని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 36 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకొని కొంద రికి మంత్రి పదవులను కూడా కట్టబెట్టారన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి పదే పదే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు పదవికి రాజీనామా చేయాలని అం టున్నారని, ప్రస్తుతం ఈ విషయం సుప్రీం కోర్టులో ఉందని, తాను కోర్టు తీర్పునకు కట్టుబడి ఉంటానన్నారు. పార్టీ ఫిరాయింపుపై బీఆర్ ఎస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కడియం కావ్య ఎన్నికల ఖర్చుకు బీఆర్ఎస్ పార్టీ నిధులు ఇస్తేనే లోక్‌సభ ఎన్ని కల్లో కాంగ్రెస్ తరపున గెలుపొందారని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కావ్యపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన ఆరోప ణలు నిరూపిస్తే ఎమ్మెల్యే, ఎంపీ పదవులకు రాజీనామా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని, నిరూపించకపో తే రాజీనామా చేస్తావా? అని సవాల్ విసిరారు. తాను దేవునూర్ అటవీ భూములలో ఒక గుంట భూమిని కబ్జా చేసినట్లు, బినామీ పేరుతో పట్టా చేయించినట్లు పల్లా నిరూపిస్తే ఆయన ఇంట్లో తాను గులాంగిరి చేస్తానని, లేకపోతే ఆయన తన ఇంట్లో గులాం గిరి చేయాలని, చీము, నెత్తురు ఉంటే పల్లా సవాల్‌ను స్వీకరించాలన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి బొచ్చు కుక్క కాదని కాపలా కుక్క అని చెప్పుకుంటున్నాడని, కుక్క ఏదైనా కుక్క కుక్కేనని అన్నారు. నియో జకవర్గ అభివృద్ధి కోసం తాను పార్టీ మారానని, ప్రజల ప్రేమనే తన ఆస్తి అని అన్నారు. రూ.800కోట్లతో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానన్నారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపి ణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, నాయకులు గుడి వంశీధర్‌రెడ్డి, కోళ్ల రవి, దిలీప్, ఋషిగంపల ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు కడియం వెన్నుపోటు

- పార్టీ ఫండ్ తీసుకుని కాంగ్రెస్‌లో చేరారు..
- రాజీనామా చేసేంత వరకు వెంట పడుతాం..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్‌లో అన్ని పదవులు అనుభవించి కాంగ్రెస్‌లో చేరి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల సమయంలో కడియం శ్రీహరి పార్టీ ఫండ్ రూ.100కోట్లు తీసుకొని తన కూతురు కావ్యకు బీఆర్ఎస్ టికెట్ తెచ్చుకుని కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఉంటే అందులో చేరతారన్నారు. గతంలో చంద్రబాబు నాయుడికి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. మోసం చేయడంలో కడియం శ్రీహరి దిట్ట అని అన్నారు. కడియం శ్రీహరి 25 ఏళ్లలో తెలంగాణ సాధన కోసం ఎక్కడ పనిచేయలేదని విమర్శించారు. దమ్ముంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలని దయాకర్‌రావు సవాల్ విసిరారు.

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేంత వరకు వెంట పడుతామన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ను విమర్శించడం కాదు.. సిగ్గు ఉంటే రాజీనామా చేసి గెలుపొందాలని సవాల్ చేశారు. రఘునాథపల్లి మేకల గట్టు, జఫర్‌గడ్‌లో అధికారులతో కుమ్మక్కై భూములను కడియం సంపాదించారన్నారు. హనుమకొండలో అత్యంత పెద్ద ఇల్లు, హైదరాబాద్‌లో 3 ఇళ్లు, అమెరికాలో మూడు ఇళ్లు ఎట్లా వచ్చాయో చెప్పాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలో సీనియర్ నాయకుడినని చెప్పుకునే కడియం.. బీఆర్ఎస్ నేతలపై పచ్చి బూతులు మాట్లాడుతున్నారని, ఆయన మాట్లాడే భాష వరంగల్ సంస్కృతి కాదన్నారు. కేసీఆర్ దేవాదుల ద్వారా 5.13లక్షల ఎకరాలకు నీళ్లు అందించారని, తాటికొండ రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎక్కువ నిధులు కేటాయించి అభివృద్ధి చేశారని తెలిపారు. కడియం శ్రీహరి ఆంధ్రా అల్లుడికి బినామీ పేర్లతో వందల ఎకరాలు ఉన్నాయని ఆరోపించారు. దేవునూరు, ముప్పారంలో రెవెన్యూ, పోలీసు అధికారులతో కుమ్మక్కై భూములను చెరపడుతున్నారని విమర్శించారు.

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. కడియం శ్రీహరి టాల్ నాయకుడు కాదు.. పాల్ నాయకుడని ఎద్దేవా చేశారు. తిన్నింటి వాసాలు లెక్కబెట్టే స్వభావం ఆయనదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. స్థాయికి మించి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతున్నారన్నారు. 25 ఏళ్ల కిందటే జాతీయ పార్టీలు ఆశ్చర్యపోయే విధంగా ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఆధ్వర్యంలో సభలు నిర్వహించిన చరిత్ర బీఆర్ఎస్‌కుందన్నారు. కేటీఆర్, కేసీఆర్ కాలిగోటికి రాజేందర్‌రెడ్డి సరిపోడని తీవ్రస్థాయిలో విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అటవీ భూములు అన్యాక్రాంతానికి గురవుతుంటే మంత్రి కొండా సురేఖ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. 70 ఏళ్ల వయసున్న కడియం శ్రీహరి మతితప్పి మాట్లాడుతున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఇండ్ల నాగేశ్వర్‌రావు, పులి రజినీకాంత్, జోరిక రమేష్, నయీమొద్దీన్, సోదా కిరణ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రజతోత్సవంపై ప్రజలకు స్పష్టత ఉంది..

ఆంధ్రజ్యోతి చిట్‌చాట్

'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'తో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి చిట్‌చాట్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

'బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వచ్చే లక్షలాది మందికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా విశాలమైన మైదానంలో సభను నిర్వహిస్తున్నాం.. సభ అనుమతులపై పోలీసులు తాత్సారం చేయటంతోనే కోర్టుకు వెళ్లాం.. టీఆర్ఎస్, బీఆర్ఎస్ వేరు కాదు.. అదే గులాబీ జెండా.. అదే కారు గుర్తు.. కేసీఆరే అధ్యక్షుడు.. రజతోత్సవంపై ప్రజలకు స్పష్త ఉంది.. కాంగ్రెస్ నేతలే అయోమయంలో ఉన్నారు.' అని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద సభా ఏర్పాట్లను పరిశీలించిన ఆయన 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'తో పలు అంశాలపై చిట్‌చాట్ చేశారు.

ఆంధ్రజ్యోతి : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఏర్పాట్లు ఎలా చేస్తున్నారు..?

పోచంపల్లి: రజతోత్సవ సభకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నాం. 160 ఎకరాల్లో సభ ప్రాంగ ణాన్ని నిర్మిస్తున్నాం. మరో 1200 ఎకరాల్లో వాహ నాల పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించాం. ఏ రూట్ నుంచి వాహనాలు వచ్చినా, ఎక్కడ ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా రహదారులను ఏర్పాటు చేస్తున్నాం. ఇక వేసవి కావటంతో సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. 10లక్షల వాటర్ బాటిళ్లు, 10లక్షల మజ్జిగ ప్యాకెట్లు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా వేలాది మరుగుదొడ్లు నిర్మిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : సభకు ఎంతమందిని తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు..?

పోచంపల్లి: బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ. స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ప్రజలు సన్నద్ధులవుతున్నారు. గతంలో ఏ పార్టీ కూడా నిర్వహించలేని విధంగా భారీగా లక్షలాది మంది ఈ సభకు వస్తారు. ప్రతీ నియోజకవర్గంలో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నాం. ప్రజల నుంచి భారీగా స్పందన వస్తోంది.

ఆంధ్రజ్యోతి : బీఆర్ఎస్ సభకు పోలీసుల అనుమతిలో ఎందుకు జాప్యం జరుగుతోంది..?

పోచంపల్లి: రజతోత్సవ సభకు అనుమతి కోరుతూ మార్చి 28వ తేదీన పోలీసులను కలిసి విజ్ఞప్తి చేశాం. అయితే ఇప్పటి వరకు పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి రాలేదు. దీంతో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అనుమతి కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశాం. పోలీసులకు కోర్టు నుంచి నోటీసులు ఇచ్చారు. ఈ నెల 17వ తేదీలోగా అనుమతులు వస్తాయని భావిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మీ పార్టీ నేతల మధ్య సమన్వయం లేదనే ప్రచారం జరుగుతోంది. నిజమేనా..?

పోచంపల్లి: అదంతా తప్పుడు ప్రచారం. ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలంతా కలిసి సమన్వయంతో పని చేస్తున్నాం. మా అధ్యక్షుడు కేసీఆర్ ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యతలను అప్పగించారు. కొందరికి సభ ఏర్పాట్లను, మరికొందరికి సభకు జనసమీకరణ బాధ్యతలను అప్పగించారు. ఎవరికి అప్పగించిన బాధ్యతల్లో వాళ్లు నిమగ్నమయ్యాం.

ఆంధ్రజ్యోతి : కొన్ని చోట్ల జిల్లా, మండల, గ్రామ కమిటీలు కూడా లేవు కదా.. జనసమీకరణ ఎలా సాధ్యం..?

పోచంపల్లి: బీఆర్ఎస్ తెలంగాణలో 60లక్షల సభ్యత్వాలు ఉన్నాయి. ప్రతీ గ్రామంలో పార్టీకి కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. అన్ని జిల్లాల్లో బాధ్యులు ఉన్నారు. మండల, గ్రామ కమిటీలు కూడా ఉన్నాయి. గ్రామాల్లో జనసమీకరణ చేస్తున్న క్రమంలోనే స్వచ్ఛందంగా సభకు వచ్చేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారు. అన్ని నియోజకవర్గాలు, ముఖ్య కేంద్రాల్లో సన్నాహక సమావేశాలు సక్సెస్ ఫుల్‌గా జరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి : రజతోత్సవం టీఆర్ఎస్‌కా.. బీఆర్ఎస్‌కా..? అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు కదా.. మీరేమంటారు..?

పోచంపల్లి: తెలంగాణ కోసం పుట్టిన పార్టీ టీఆర్ఎస్. ప్రజల సంక్షేమాన్ని విస్తరించేందుకు టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా పేరు మాత్రమే మార్చాం. అంతమాత్రన టీఆర్ఎస్, బీఆర్ఎస్‌లు వేర్వేరు కావు. అదే గులాబీ జెండా.. అదే కారు గుర్తు.. కేసీఆరే అధ్యక్షుడు.. ఈ విషయంలో తెలంగాణ ప్రజలకు చాలా క్లారిటీ ఉంది. ఎందుకో కాంగ్రెస్ నేతలే కన్ఫ్యూజన్‌లో ఉన్నారు. 25ఏళ్ల గులాబీ పండుగను విజయవంతం చేసేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

ఆంధ్రజ్యోతి : సభతో ప్రజలకు ఏం సందేశం ఇవ్వనున్నారు..?

పోచంపల్లి: తెలంగాణ కోసం 25ఏళ్ల కిందట పుట్టిన పార్టీ ఏం చేసిందో ప్రజలకు చెబుతాం. 14ఏళ్లు స్వరాష్ట్రం కోసం చేసిన పోరాటాలు.. 10ఏళ్లలో ప్రజల సంక్షేమం కోసం చేసిన అభివృద్ధిపై చెప్పుతాం. 16 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల మోసం, ద్రోహంపై వివరిస్తాం. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను అమలు చేయాలని ఒత్తిడి తీసుకవచ్చేందుకు పోరాటాలు చేస్తాం.

సనాతన ధర్మమే ప్రాచీనమైనది..

- ఆధ్యాత్మిక గురువు చాముండేశ్వరి మహర్షి
- నగరంలో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



శంభునిపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : ప్రపంచానికి నాగరికత నేర్పిన సనాతన ధర్మమే అత్యంత ప్రాచీనమైనదని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, బ్రహ్మశ్రీ చాముండేశ్వరి మహర్షి అన్నారు. చైత్ర పౌర్ణమి హనుమాన్ జన్మదినం సందర్భంగా వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో భారీఎత్తున వీరహనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. రంగశాయిపేట మహంకాళి మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన చాముండేశ్వరి మహర్షి మహంకాళీ ఆలయంలో పూజారి పరాశర భట్టమ్ శ్రీనివాసాచార్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. శతాబ్దాలుగా హైందవ ధర్మంపై దాడులు జరుగుతున్నాయని, ఈ విషయంలో హిందువులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. విశ్వహిందూపరిషత్ వరంగల్ మహానగర అధ్యక్షుడు కేతిరెడ్డి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజ సేవ కోసం హిందువులంతా ఏకం కావాలన్నారు. వీహెచ్‌పీ వరంగల్ విభాగ్ సహప్రముఖ్ శ్రీరామ్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. తూర్పు నియోజకవర్గంలో ఆలయాల ఆస్తులను దోచుకుంటున్నా రక్షించలేకపోతున్నారని మంత్రి విమర్శించారు. భజరంగ్‌దళ్ సంయోజక్ ఆదిత్య సాయి మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతీ హిందువు ధర్మం కోసం పోరాడాలన్నారు. అనంతరం చాముండేశ్వరి మహర్షి జెండా ఊపి హనుమాన్ శోభాయాత్ర, బైక్‌ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రత

ఈ శోభాయాత్ర ఉర్సు కరీమాబాద్, చౌరస్తా, స్టేషన్ రోడ్, కాశిబుగ్గ, పోచమ్మమైదాన్, ఎంజీఎం, ములుగురోడ్, అలంకార్ జంక్షన్, మీదుగా హనుమద్గిరి పద్మాక్షి దేవాలయం వరకు కొనసాగింది. శోభాయాత్ర సందర్భంగా వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు పెద్దఎత్తున భద్రత కల్పించారు. ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్య తీసుకున్నారు. బందోబస్తులో మిల్స్‌కాలనీ, మట్టెవాడ, ఇంతెజార్‌గంజ్ సీఐలు వెంకటరత్నం, గోపి, షుకుర్‌లతో పాటు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, హనుమకొండ పోలీసులు పాల్గొన్నారు.

పనులు చేయని టెండర్‌దారులను బ్లాక్‌లిస్టులో పెట్టాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం



హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో రోడ్ల అభివృద్ధి పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టెండర్‌దారులను బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా పంచాయతీరాజ్ మిషన్ భగీరథ, మహిళా, శిశు సంక్షేమ శాఖలపై శనివారం సాయంత్రం మంత్రి సీతక్క సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో రోడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి భేషజాలు లేకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. హైదరాబాద్ తర్వాత రెండో పెద్ద జిల్లా అయిన ఉమ్మడి వరంగల్‌ను అభివృద్ధి చేసుకోవడానికి ప్రజాప్రతినిదులు, అధికారులు సమన్వయంతో కృషి చేద్దామన్నారు. ఎస్సీ డెవలప్‌మెంట్ కింద ఇచ్చిన రోడ్లను అధికారులు త్వరగా పూర్తిచేసేలా చూడాలన్నారు. అధికారులు కాంట్రాక్టర్‌లతో సమావేశాలు ఏర్పాటు చేసి రోడ్లు పూర్తయ్యేలా చూసుకోవాలన్నారు. పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, వారం రోజుల్లోగా అన్ని టెండర్లు పూర్తి చేసుకుని పనులను ప్రారంభించాలని సూచించారు. పనులు నాణ్యతగా ఉంటేనే బిల్లులు చెల్లిస్తామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. బాగా పని చేసిన కాంట్రాక్టర్‌లకు మిగతా చోట్ల పనులను అప్పగిస్తామని, గడువును నిర్ణయించుకుని పనులు పూర్తయ్యే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తూ జిల్లా కలెక్టర్‌లకు త్వరలోనే ఆదేశాలు ఇవ్వనున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల సంఖ్య తక్కువగా ఉన్న దగ్గర సమీపంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణకు తరలించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో తాగునీరు, టాయిలెట్స్, తదితర సౌకర్యాలను సమకూర్చే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందిరా మహిళా శక్తి భవనాలు పూర్తికాని దగ్గర పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకో వాలన్నారు. ట్యాంకుల మరమ్మతులు ఉన్నట్లయితే సత్వరమే చేయించాలన్నారు.

వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాను అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. కేంద్రం నుంచి జిల్లాకు ఎక్కువ సంఖ్యలో నిధులు తీసుకువచ్చి జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో కంకరవేసిన రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎస్సీ కాలనీల్లో సీసీరోడ్లు పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. జనగామ జిల్లాలో రోడ్లు, ప్రభుత్వ భవనాలు, వంతెన, ఇతర అభివృద్ధిపనులు, సమస్యలను పరిష్కరించాలని జనగామ ఎమ్మెల్యే మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మహబూబాబాద్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావులు తమ నియోజకవర్గాల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని మంత్రి సీతక్కను కోరారు. నగరంలోని అంగన్వాడీ కేంద్రాల్లో సరైన వసతులు లేవని, వసతులు కల్పించాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కోరారు.

ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనితా రామచంద్రన్, మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్లు, పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధిశాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 14వ తేదీన నిర్వహించే అంబేద్కర్ 134వ జయంతికి సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. 14వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే జయంతి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, అంబేద్కర్ జయంతి కమిటీ నాయకులు రాంచందర్‌రావు, రవి, రాజేందర్, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ జయంతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య


సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మడికొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. మడికొండలో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో దయాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతం కోసం మనం కష్టపడాల్సిన అవసరం లేదని, కేసీఆర్ చేసిన పనులే మనకు శ్రీరామరక్ష అని తెలిపారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభకు కాంగ్రెస్ అడ్డంకులు

బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తిలో ఏప్రిల్ 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని, అనుమతులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆరోపించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని, రజతోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల కోసం నాడు ఉద్యమంలో, తర్వాత అభివృద్ధిలో, నేడు ప్రతిపక్షంలో ఉంటూ కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తున్న పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. రాష్ట్రంలో 60 లక్షల పార్టీ సభ్యత్వాలు కలిగిన అతి పెద్ద ప్రాంతీయ పార్టీగా బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సభకు అడ్డంకులు సృష్టిస్తోందని, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ఏప్రిల్ 27న సభను నిర్వహించి విజయవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు జోరిక రమేష్, పులి రజినీకాంత్, తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

'కృషి-వర్తమాన ప్రాసంగీకత' గ్రంథావిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ అంపశయ్య నవీన్, తదితరులు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని ప్రముఖ నవలాకారుడు డాక్టర్ అంపశయ్య నవీన్ స్వగృహంలో మిత్ర మండలి సాహిత్య సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో శనివారం కేఎస్ఆర్ జి.ప్రసాద్ జీవితం, 'కృషి- వర్తమాన ప్రాసంగీకత' గ్రంథావిష్కరణ జరిగింది. రుద్రమ సాహిత్య సామాజిక అధ్యయన వేదిక అధ్యక్షురాలు అనిశెట్టి రజిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డాక్టర్ అంపశయ్య నవీన్ గ్రంథావిష్కరణ చేసి మాట్లాడుతూ.. ప్రసాద్ విలువలతో కూడిన జీవితాన్ని గడిపారని పేర్కొన్నారు. ప్రధాన వక్త మెట్టు రవీందర్ మాట్లాడుతూ.. నేటి సంక్షిప్త వర్తమాన సందర్భంలో కేఎస్ఆర్ జి.ప్రసాద్- జీవితం కృషి అనే పుస్తకావిష్కరణ జరగడం చాలా సముచితమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ కుమారుడు డాక్టర్ సతీష్‌చంద్ర, తెరసం అధ్యక్షుడు పొట్లపల్లి శ్రీనివాసరావు, కొమర్రాజు రామలక్ష్మీప్రసాద్, సాహితీ వేత్తలు నాగిళ్ల రామశాస్త్రి, పి.చందు, బిల్లా మహేందర్, చందనాల సుమిత్రాదేవి, శశి కిరణ్, శ్యామల, అంజనీదేవి, సింగరాజు రమాదేవి, ఆకునూరు విద్యాదేవి, మదనపల్లి కిష్టయ్య, సంపత్‌రెడ్డి, మెట్టు మురళీధర్, సదాశివరావుతో పాటు ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు త్రిచక్ర సొసైటీ సాయం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఎంతో అండగా నిలిచిందని, రోడ్డు ట్యాక్సీ మాఫీ చేసి జిల్లాలోని ఆటో కార్మికులకు బీమా వసతి కల్పించారని ఏప్రిల్ 27న నిర్వహించే రజతోత్సవ సభకు త్రిచక్ర కమిటీ తరఫున రూ.1,00,116, సభకు 800 ఆటోలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేస్తున్నట్లు త్రిచక్ర పొదుపు పరపతి సంఘం అధ్యక్షుడు ఈసంపల్లి సంజీవ తెలిపారు. నగదును హనుమకొండ బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద శ్రీధర్‌రెడ్డి, చీకటి కుమార్, మడికొండ బాబు, కలకోట్ల జయరామ్, స్వామి, సంజీవ, బాబు, వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అణగదొక్కాలని చూస్తున్న బీజేపీ

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- మడికొండ, కొత్తూరు జెండాలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీలు

మడికొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సాక్షిగా బీజేపీ భారత రాజ్యాంగాన్ని అణగదొక్కాలని చూస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మడికొండలో శనివారం స్థానిక చౌరస్తా నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే ర్యాలీలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా అంబేద్కర్‌ను అవమానించారన్నారు. మహనీయులు, రాజ్యాంగం గురించి ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకొని బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. మడికొండ డంప్‌యార్డు, నీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా జై గాంధీ, జై భీమ్, జై సంవిధాన్ నినాదాలతో గ్రామం హోరెత్తింది. స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ పులి అనిల్‌కుమార్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రావు, నరసింహారెడ్డి, కేఆర్. దిలీప్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కందుకూరి పూర్ణచందర్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, రామాలయ చైర్మన్ పల్లపు అర్జున్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్మెట వెంకటరమణగౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, వస్కుల శంకర్, కర్ర హరీష్‌రెడ్డి, బిల్ల రవీందర్, వస్కుల నాగరాజు, వస్కుల శ్రీను, మహిళలు పాల్గొన్నారు.


మడికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు



కొత్తూరుజెండాలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత : ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రమాదపుటంచులో ఉందని, బీజేపీ ప్రభుత్వం కుట్ర చేసి రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. జై బాపు.. జై భీం.. జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం 5వ డివిజన్ కొత్తూరుజెండాలో రాజ్యాంగ పరిరక్షణ యాత్రను ఘనంగా నిర్వహించారు. హనుమకొండ సాబీర్ హోటల్ నుంచి ప్రారంభం చేసి కొత్తూరుజెండా ఈదులవాగు వరకు సాగిన యాత్రంలో కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అహింసా, శాంతి సిద్ధాంతాలను పాటిస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి అంబేద్కర్ ఇచ్చిన స్ఫూర్తి గాంధీజీ తత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. అజీజ్‌ఖాన్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు గాండ్ల శ్రవంతి, వేముల శ్రీనివాస్, బిన్ని లక్ష్మణ్, వెంకట్, నాగరాజు, కొడిపాక గణేష్, సిరబోయిన సతీష్, ప్రణీల్‌కుమార్, ఎండీ ఖయ్యూం పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వల్ల రోగాలు

మీడియా సమావేశంలో ఎర్రగట్టు స్వామి

కాజీపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మడికొండ డంపింగ్ యార్డుతో నిత్యం నరకం చూస్తున్నామని, శ్వాసకోశ వ్యాధులు, దగ్గు, జ్వరంతో పాటు వివిధ రకాల వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ సమస్యతో మా ఊరికి యువకులకు పిల్లనివ్వడం లేదని అడహక్ కమిటీ సభ్యుడు, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం కాజీపేట మీడియా పాయింట్‌లో మడికొండ అడ్‌హక్ కమిటీ సభ్యులు ఎర్రగట్టు స్వామి, పెళ్లి కృష్ణమూర్తి మాట్లాడారు. 2009 సంవత్సరం నుంచి వరంగల్ మున్సిపాలిటీలోని తడిచెత్త, పొడి చెత్త, పరిశ్రమల వ్యర్థపదార్థాలు, జంతు కళేబరాలు, ప్రతీరోజు 450 టన్నుల చెత్త మడికొండ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారని చెప్పారు. ఇక వర్షాకాలం వచ్చిందంటే ఈ చెత్తలో నీరుచేరి కలుషితమై వివిధరకాల వ్యాధులు తలెత్తడంతో అంతా రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. కొందరి ప్రాణాలు సైతం పోతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. మడికొండతో పాటు చుట్టుపక్కల 16గ్రామాల ప్రజలకు ఈ సమస్య ఉత్పన్నమవుతోందని చెప్పారు. డంపింగ్ యార్డు సమస్య గురించి ఈ మధ్యనే సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు, కడియం శ్రీహరి దృష్టికి తీసుకువచ్చామని, వారు డంపింగ్ యార్డు ఎత్తిసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని, వీరి హామీతో రిలే దీక్షలతో పాటు ఆందోళనలు కార్యక్రమాలు వాయిదా వేస్తున్నట్లు వివరించారు. డంపింగ్ యార్డు ఎత్తివేసేందుకు కలిసివచ్చే అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలతో శాంతియుతంగా ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో సభ్యులు బొల్లికొండ రాజు, దువ్వ నవీన్, తౌటురెడ్డి కరుణాకర్ రెడ్డి, బోగి మహేందర్, కొలిపాక కుమార్‌బాబు, బొల్లికుంట వినోద్, బొమ్మిశెట్టి వేణు, వస్కుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి

20న రిటైర్డ్ పోలీసుల సమావేశం

వడ్డెపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్డులోని వరంగల్ ఉమ్మడి జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల అసోసియేషన్ కార్యాలయంలో ఈ నెల 20న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు వరంగల్ ఉమ్మడి జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు పులి వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండీ మస్తాన్‌లు తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని రిటైర్డ్ పోలీస్ అధికా రులందరూ ఈ సర్వసభ్య సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి


ఎంపీ కావ్యకు వినతి పత్రాన్ని ఇస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ శ్రీధర్‌కుమార్‌లోథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎంపీ కడియం కావ్యను తన నివాసంలో కలిసి కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్యకు తమ సమస్యలను నివేదించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాధు రాజేశ్, డాక్టర్ టి.నాగయ్య, డాక్టర్ సంగీత్ కుమార్, డాక్టర్ లక్ష్మారెడ్డి, డాక్టర్ మామిడి లింగయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంఘం అధ్యక్షుడు అస్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన యాత్రను జయప్రదం చేయాలి

వడ్డెపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే నాగరాజు ఆధ్వర్యంలో ఈ నెల 14న నిర్వహించే జ్ఞాన యాత్రను జయప్రదం చేయాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు మాట్లాడారు. జ్ఞాన యాత్ర 14న ఉదయం 9 గంటలకు వరంగల్ ఎంజీఎం చౌరస్తా నుంచి హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వరకు జరుగుతుందని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు కొంక హరిబాబు, మణీంద్రనాథ్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య, ప్రజా సంఘాల నాయకులు చుంచు రాజేందర్, అంకేశ్వరపు రాంచందర్, పణికల శ్రీనివాస్, అంకూస్ రవికుమార్, గరిగె అనిల్, కడారి కుమార్, కోండ్ర నర్సింగరావు, బండి అశోక్, ఐలయ్య, రామన్న పాల్గొన్నారు.

మార్గదర్శకాలను అమలు చేయాలి

వడ్డెపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): యూజీ, పీజీ అడ్మిషన్ల విషయంలో యూజీసీ మార్గదర్శకాలను అమలు చేయాలని ఆల్ తెలంగాణ స్టూడెంట్స్ ప్రతినిధులు సంపుటం సాయికిరణ్, శ్రీకాంత్ యాదవ్‌లు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత నవంబర్ లో విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) దేశంలో ని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాలకు యూజీ, పీజీ అడ్మిషన్ల అర్హతలకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేసినా అమలు చేయడం లేదన్నారు. ఇంటర్మీడియేట్ లేదా తత్సమాన అర్హత కలిగిన కోర్సు పాసైన విద్యార్థులు వారు చదివిన గ్రూప్‌లతో సంబంధం లేకుండా ఏ డిగ్రీ కోర్సులోనైనా చేరవచ్చుననే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి జాతీయ లేదా యూనివర్సిటీ స్థాయి ప్రవేశ పరీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు కందకట్ల వికాస్, గుంటుక నవ్య, ఇరప కృష్ణబాబు, ఐదునూరి ఆదిత్య, ఉప్పిరి కల్యాణ్‌కృష్ణ, డాక్టర్ కె. వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని నిట్ ప్రొఫెసర్ ఆనంద్ కిషోర్ అన్నారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాలలో 'భారత రాజ్యాంగం-సామాజిక న్యాయం' అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. సదస్సులోఆనంద్ కిషోర్ ప్రసంగిస్తూ.. రాజ్యాంగం భారత ప్రజలకు రక్షణ కవచంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి కృష్ణారావు, శ్రీనివాస్‌రావు, సదాశివ్, గిరిప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో భారీ వాహనాలకు చెక్

మడికొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మడికొండ - ధర్మసాగర్ రోడ్డులో భారీ వాహనాలు ప్రయాణిస్తూ తరచూ ప్రమాదాలు జరగడంతో పాటు పలువురు మృత్యువాత పడుతుండడంతో స్థానిక ప్రజలు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచన మేరకు శనివారం స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ప్రత్యేక చొరవ చూపి రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వద్ద నుంచి రైలు పట్టాలను తెప్పించి చౌరస్తా వద్ద, గ్రామ చివర పెద్దమ్మ గుడి వద్ద భారీ వాహనాల లోనికి రాకుండా పటిష్టంగా కమాన్ ఏర్పాటు చేయించారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

వడ్డెపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వివిధ డివిజన్లలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సాయంత్రం శోభా యాత్రను నేత్రపర్వంగా జరుపుకున్నారు. హనుమకొండ 57వ డివిజన్‌లోని శ్రీవేణుగోపాలస్వామి ఆవరణలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ దీక్షా స్వాములు కోరుట్ల రమేష్, ఈగ రాజ్‌కుమార్, బండి మహేంద్ర, రాజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో అంజన్నకు చందనతో కూడిన అభిషేకాలు , హనుమాన్ చాలీసా పారాయణాన్ని పఠించారు. కార్యక్రమంలో దీక్షా స్వాములు మూగుల రాజ్‌కుమార్, బొమ్మిడి సతీష్, బొంగు రాజ్‌కుమార్, వెంకన్నయాదవ్, బంక సతీష్‌యాదవ్, సతీష్ యాదవ్ పాల్గొని అంజన్నను కొలిచారు. 56వ డివిజన్ గోపాల్‌పూర్ జోన్ బీజేపీ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్, బీజేపీ సీనియర్ నేతలు అమరేందర్‌రెడ్డి, అలుగునూరి కృష్ణంరాజు ఆధ్వర్యంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. హనుమాన్ శోభా బైక్‌యాత్ర గోపాల్‌పూర్ నుంచి భీమారం, కేయూసీ క్రాస్, సమ్మయ్యనగర్, వడ్డెపల్లి చర్చి, పరిమళకాలనీ, జవహర్ కాలనీ మీదుగా గోపాల్‌పూర్‌లోని సర్దార్ సర్వాయి పాపన్న జంక్షన్ వరకు నిర్వహించారు. జై శ్రీరామ్ అనే నినాదాలతో పలు కాలనీలు మార్మోగాయి. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ గోపాల్‌పూర్ జోనల్ శాఖ ప్రముఖ్ పెరుమాండ్ల అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చింత శేఖర్, హనుమాన్ భక్తులు వల్లాల రాజ్‌కుమార్ గౌడ్, బీజేపీ శ్రేణులు నాతి రమేష్, ఇమ్మడి సందీప్, బొనగాని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ కల్చరల్: హనుమకొండలోని చారిత్రాత్మక రుద్రేశ్వర స్వామి వేయిస్తంభాల దేవాలయంలో హనుమత్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని పంచముఖ ఆంజనేయ స్వామికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, అర్చకులు మణికంఠ శర్మ, ప్రణవ్‌తో పాటు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో శనివారం హనుమత్ విజయోత్సవం సందర్భంగా ఆలయంలోని ఆంజనేయ స్వామికి విశేషపూజలు చేశారు. క్షీరాభిషేకం, పంచామృత, పంచవర్ణ పూజలు, అభిషేకాలు చేశారు. సామూహిక సుందరకాండ పారాయణం నిర్వహించారు. బ్రహ్మశ్రీ కందికొండ శ్రీనివాస్‌శర్మ, దేవాలయం వ్యవస్థాపక చైర్మన్ ఐనవోలు వెంకటేశ్వర శర్మ, ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● న్యూశాయంపేట : హనుమకొండ పద్మాక్షిరోడ్డులో ఉన్న హనుమత్‌గిరి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలోని హనుమంతుడికి శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు క్వింటాన్ బంతిపూలతో అలంకరించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూజారి రామాచార్యులు సుమారు 200 మందికి మాలధారణ చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ స్వాములకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్షా సేవా సమితి అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, కర్రు దశరథ్ కుమార్, మాదాసు మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.


వేయిస్తంభాల గుడిలో అంజన్నకు పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు


క్వింటా బంతిపూల అలంకరణలో హనుమంతుడు


ఆంజనేయస్వామికి అభిషేకం చేస్తున్న దృశ్యం

సామాజిక అణచివేత అంతానికి పోరాడుదాం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): శ్రమ దోపిడీ, సామాజిక అణచివేత, వివక్షల అంతానికి పోరాడుదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్‌లో భాగంగా శనివారం హనుమకొండ వేయిస్తంభాల ఆలయం నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడాలేని కుల వ్యవస్థ మన దేశంలోనే ఉందని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో పురోగతి సాధించినా సాటి మనిషిని మనిషిగా చూడలేని దుర్మార్గపు స్థితి నేటికి కొనసాగడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. కులం, మతం, ప్రాంతం, లింగభేదం లాంటి సామాజిక రుగ్మతలు మన దేశంలో ప్రజల్ని, కార్మికవర్గాన్ని ఐక్యం కానివ్వకుండా ముళ్ల కంచెలా ఉన్నాయని మండిపడ్డారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య మాట్లాడుతూ.. మనువాద సిద్ధాంతాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తోందని, దేశ భక్తి ముసుగుతో మతం పేరుతో శ్రామిక ప్రజల, కార్మికుల్లో చిచ్చు పెడుతోందని ఆరోపించారు. ఈ బైక్ ర్యాలీలో సీఐటీయూ నాయకులు బొట్ల చక్రపాణి, పెండ్యాల రవి, పుల్ల అశోక్, ఎన్. రజిత, యాస బాబు, మల్లేశం, కారు ఉపేందర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐటీయూ నాయకుడు రమేష్

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది గ్లాస్ డోమ్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 15
ఐ హోస్టేజ	ఒరిజినల్ మూవీ	ఏప్రిల్ 18
అమెజాన్ ప్రైమ్		
గాడ్‌ఫాదర్ ఆఫ్ హాలెం	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 13
ఖౌఫ్	హిందీ సిరీస్	ఏప్రిల్ 18
జియో హాట్‌స్టార్		
ది లాస్ట్ ఆఫ్ అజ్ 2	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 14
ది స్టోలెన్ గర్ల్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 16
సోనీ లివ్		
చమక్: ది కంక్లూజన్	హిందీ సిరీస్	ఏప్రిల్ 14





ఖౌఫ్

హారర్ చిత్రాలు, వెబ్‌సిరీస్‌లకు ఇటీవల కాలంలో ప్రేక్షకాదరణ అమితంగా దక్కుతోంది. ఈ కోవలో వస్తోన్న మరో భయానక బీభత్స ప్రధానమైన హిందీ సిరీస్ 'ఖౌఫ్'. ఓ మహిళల హాస్టల్‌లో జరిగే సంఘటనల నేపథ్యంలో తెరకెక్కిన సూపర్ నేచురల్ హారర్ సిరీస్ ఇది. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే కోరికతో ఢిల్లీ వచ్చిన మాధురి జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో సాగుతుంది.

ఓ పాడుపడిన హాస్టల్‌లో చేరినప్పటి నుంచి ఆమె జీవితం నరకప్రాయమవుతుంది. అక్కడి నుంచి బయటపడేందుకు ఆమె చేసే ప్రయత్నాలు మరింత కష్టాల్లోకి నెడతాయి. హాస్టల్ గేట్ దాటి బయట అడుగుపెట్టలేని నిస్సహాయ పరిస్థితుల్లో చివరకు ఏం జరిగింది అనేది కథ. హారర్ ప్రియులకు కొత్త తరహా అనుభూతిని ఇచ్చేలా 'ఖౌఫ్' తెరకెక్కిందని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది.





సంకల్పం

మాది... 'విశ్వశాంతి' పథం

మొదట అనుకున్నది డాక్టర్ కావాలని.
కాలేజీలో నాటకాలు వేశాక మనసు నటన వైపు మళ్లింది.
ఆ రెండూ నెరవేరలేదు కానీ... విద్యావేత్తగా ఆయన మరో ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు.
ప్రపంచ శాంతి స్ఫూర్తితో... రేపటి తరాన్ని ఉన్నతంగా నిలపాలన్న లక్ష్యంతో...
'శ్రీ విశ్వశాంతి'కి శ్రీకారం చుట్టారు. దశాబ్దాలుగా... దేశవ్యాప్తంగా వేలమంది విద్యార్థులను విశ్వ విజేతలుగా తీర్చిదిద్దుతున్నారు.
'శ్రీ విశ్వశాంతి' 50వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా... విద్యా శిఖరం...
ఆ సంస్థల చైర్మన్... మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావును 'నవ్య' పలుకరించింది.

"కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం గండిగుంట మా స్వగ్రామం. మాది సాధారణ రైతు కుటుంబం. నాన్న శేషగిరిరావు, అమ్మ కమలా మనోహరి. కుటుంబంలో నేను మూడోవాడిని. నాన్న మాకు ఉన్న రెండెకరాల పొలాన్ని సాగు చేసేవారు. కుటుంబ పోషణకు దాని మీద వచ్చే సంపాదన సరిపోకపోవడంతో వల్లభనేని లక్ష్మీనారాయణ అనే భూస్వామి దగ్గర నౌకరీకి వెళ్లేవారు. దీనికి నెలకు రెండు బస్తాల ధాన్యం ఇచ్చేవారు. అమ్మ ఈ ధాన్యాన్ని... మిల్లు పట్టించి, కుటుంబానికి సరిపడా బియ్యం ఉంచుకుని, మిగిలింది అమ్మేది. నా పాఠశాల విద్యాభ్యాసం అద్దాడలోని అమ్మమ్మ ఇంటి వద్ద సాగింది. అక్కడ తొమ్మిదో తరగతి వరకు చదువుకున్నా. అప్పట్లో ట్యూషన్ చెప్పినందుకు నెలకు మూడు రూపాయల ఫీజు తీసుకునేవారు. ఆ డబ్బులు చెల్లించే స్తోమత కూడా మాకు లేదు. అమ్మమ్మ, తాతయ్య... ట్యూషన్ మాస్టారు వద్దకు వెళ్లి ఆ ఫీజు ఇచ్చుకోలేమని చెప్పడంతో ఆయన నాకు ఉచితంగా పాఠాలు బోధించారు. తర్వాత ఎస్ఎస్ఎల్‌సీని ఉయ్యూరు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో పూర్తి చేశాను.

■ కొడుకుతో డిగ్రీ తరగతులకు...

జమ్మిగొలివేపల్లి... ఉయ్యూరుకు 12 కిలోమీటర్ల దూరంలో ఉండే గ్రామం. అక్కడి నుంచి స్కూల్‌కు వచ్చే ప్రమీలరాణి నా జీవిత భాగస్వామి అవుతుందని అనుకోలేదు. ఐదో తరగతిలో తనతో పరిచయం ఏర్పడింది. ఎస్ఆర్ఆర్ కాలేజీలో పీయూసీలో సీటు రావడంతో విజయవాడకు వచ్చేశాను. గుణదలలో అక్క ఇంట్లో ఉంటూ పీయూసీ పూర్తి చేశాను. సీటు ఎస్ఆర్ఆర్ కాలేజీలో వచ్చినా చదువంతా ఆంధ్రా లయోలా కాలేజీ లెక్చరర్ల వద్ద సాగింది. ప్రమీలకు స్టెల్లా కాలేజీలో బీఏ సీటు రావడంతో తను కూడా విజయవాడకు వచ్చింది. హాస్టల్‌లో ఉంటూ నా యోగక్షేమాలను తెలుసుకోవడానికి ఉత్తరాలు రాసేది. ఆదివారాల్లో హాస్టల్‌కు వెళ్లి ప్రమీలతో మాట్లాడేవాడిని. తర్వాత ఇద్దరం కలిసి చదువుకోవాలని నిర్ణయించుకున్నాం. అప్పట్లో మచిలీపట్నంలోని హిందూ కాలేజీలో కో-ఎడ్యుకేషన్ ఉండేది. ఇద్దరం కలిసి హిందూ కాలేజీలో చేరాం. అక్కడ ఒక గది అద్దెకు తీసుకున్నాం. అద్దె నెలకు రూ.25. ప్రమీలతో పరిచయం ఏర్పడిన పదకొండేళ్లకు మేమిద్దరం పెళ్లి చేసుకున్నాం. అప్పట్లో ప్రేమ పెళ్లంటే గ్రామాల్లో చాలా విచిత్రంగా చూసేవాళ్లు. ప్రమీల కుటుంబానికి, మా కుటుంబానికి పరిచయం ఉండడంతో ప్రేమ విషయాన్ని పెద్దలకు చెప్పాం. ఇద్దరిదీ ఒకే కులం కావడం మాకు కలిసివచ్చింది. డిగ్రీ రెండో సంవత్సరంలో మాకు ఒక బాబు పుట్టాడు. తోటివాళ్లంతా పుస్తకాలతో క్లాస్‌లకు వస్తే... మేం మాత్రం మా బాబుతో వెళ్లేవాళ్లం.



అప్పట్లో మచిలీపట్నంలోని హిందూ కాలేజీలో కోఎడ్యుకేషన్ ఉండేది. ఇద్దరం కలిసి హిందూ కాలేజీలో చేరాం. అక్కడ ఒక గది అద్దెకు తీసుకున్నాం. అద్దె నెలకు రూ.25. ప్రమీలతో పరిచయం ఏర్పడిన పదకొండేళ్లకు మేమిద్దరం పెళ్లి చేసుకున్నాం. అప్పట్లో ప్రేమ పెళ్లంటే గ్రామాల్లో చాలా విచిత్రంగా చూసేవాళ్లు.

■ డిగ్రీలోనే స్కూల్ ఆలోచన...

డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే నాకు, ప్రమీలకు ఒక స్కూలు పెడదామన్న ఆలోచన వచ్చింది. విజయవాడలో ప్రైవేటు స్కూళ్లను పరిశీలించాం. అప్పుడే మిషనరీ స్కూళ్ల ప్రారంభమవుతున్నాయి. గుడివాడలో మాకు పరిచయం ఉన్న శ్రీమన్నారాయణ... 'విశ్వభారతి' స్కూల్‌ను ప్రారంభించారు. ఉద్యోగం కోసం ముందుగా ఆయన దగ్గరకు వెళ్లాను. పరిచయస్తులకు వాళ్లకు ఉద్యోగం ఇవ్వడం ఇష్టం లేని ఆయన ఖాళీలు లేవని చెప్పారు. రాయలసీమకు చెందిన శ్రీరాములు... కైకలూరుకు సమీపాన కోరుకల్లు గ్రామంలో స్కూలు ఏర్పాటు చేశారు. బతుకుదెరువు కోసం మేమిద్దరం అక్కడ టీచర్లుగా చేరాం. నెలకు ఒక్కొక్కరికి రూ.125 జీతం. మూడు నెలలు పని చేసిన తర్వాత సంక్రాంతి సెలవులకు నేను, ప్రమీల సొంతూరు వెళ్లాం. మా ఊళ్లో స్కూలు పెట్టాలని రెండు, మూడు స్థలాలు చూశాం. మా రెండో అబ్బాయికి జలుబు చేస్తే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాం. మేం పెట్టాలనుకున్న స్కూలు గురించి డాక్టర్ దంపతులు అడిగారు. వారి ఇద్దరు పిల్లలకూ ట్యూషన్ చెప్పమని కోరారు. అక్కడి నుంచి మా స్కూలు ప్రయాణం మొదలైంది.

■ ఆరుగురు విద్యార్థులతో...

1975 ఫిబ్రవరి 22న ఆరుగురు విద్యార్థులతో 'విశ్వశాంతి' స్కూలు ప్రారంభమైంది. మొదటి సంవత్సరం 16 మంది విద్యార్థులు ఉండేవారు. మరుసటి ఏడాది ఆ సంఖ్య 136కి చేరింది. విద్యార్థులకు నేను, ప్రమీల పాఠాలు చెప్పేవాళ్లం. మరో ఇద్దరు ఆంగ్లో ఇండియన్లు టీచర్లుగా ఉండేవారు. 1988 నుంచి ఎమ్మెల్యేల పిల్లలూ 'విశ్వశాంతి'లో అడ్మిషన్లు తీసుకోవడం మొదలైంది. ఇప్పుడు 80 ఎకరాల విస్తీర్ణంలో 'శ్రీ విశ్వశాంతి' నడుస్తోంది. ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు 6,300 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన 700 మంది మా దగ్గర అడ్మిషన్లు తీసుకున్నారు. విదేశాల్లో స్థిరపడినవారి పిల్లలూ విశ్వశాంతిలో ఉన్నారు. డాక్టర్ కావాలన్నది నా మొదటి లక్ష్యం. కాలేజీలో చదువుతున్నప్పుడు రంగస్థలంపై నాటకాలు వేయడంతో నటుడు కావాలన్న లక్ష్యం పుట్టింది. ఈ రెండు లక్ష్యాలూ నెరవేర్చుకోలేకపోయాను.

■ విశ్వశాంతి కోసమే...

నాకు పుస్తకాలు చదివే అలవాటు ఎక్కువ. జవహర్‌లాల్ నెహ్రూకు సంబంధించిన పుస్తకాలు బాగా చదివేవాడిని. ఆ సమయంలో చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ యుద్ధాలు జరిగేవి. వాటితో కలిగిన హింస కలచివేసింది. మా అన్నయ్య కృష్ణమూర్తి ఆర్మీలో పని చేసేవాడు. ఈ యుద్ధాలు జరిగే సమయంలో మా కుటుంబమంతా చాలా ఆందోళనగా ఉండేది. 'చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకుంటే ప్రపంచంలో శాంతి నెలకొంటుంది కదా' అన్న భావన నాలో ఉండేది. అందుకే మా స్కూలుకు 'విశ్వశాంతి' పేరు పెట్టాం. సిద్ధాంతి సూచనలతో ముందు శ్రీ చేర్చాం. ఇక అప్పటి నుంచి 'శ్రీ విశ్వశాంతి'గా స్థిరపడిపోయింది. నేను ఇప్పటికీ ఉదయం నుంచి రాత్రి వరకు విద్యార్థుల మధ్యే గడుపుతాను. 50 ఏళ్ల 'శ్రీ విశ్వశాంతి' ప్రయాణంలో దేశానికి ఉత్తమ విద్యార్థులను అందించానన్న సంతృప్తి నాకు ఎప్పటికీ ఉంటుంది.

■ ఆరోగ్యమూ ముఖ్యమే...

విద్యార్థులకు చదువు ఒక్కటే సరిపోదని, అందుకు తగిన వాతావరణం కూడా కల్పించాలనేది 'విశ్వశాంతి గ్రామీణ యూనివర్సిటీ' సంకల్పం. దానికి అనుగుణంగానే ప్రాంగణమంతా పచ్చని మొక్కలు పెంచాం. అంతేకాదు... విద్యార్థుల ఆరోగ్యం కోసం సొంతంగా ఒక డెయిరీని ఏర్పాటు చేశాం. అత్యున్నత ప్రమాణాల్లో నిర్వహిస్తున్నందుకు దీనికి 'బెస్ట్ డెయిరీ ఫారమ్ ఆఫ్ ఏపీ అవార్డు' కూడా దక్కింది.

■ ఆమె ఆకాంక్షలకు అనుగుణంగా...

ఆర్థిక భారం తగ్గించి గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించాలనేది ప్రమీల ఆకాంక్ష. ఆమె కోరిక మేరకు ఏటా మూడొందల మందికి పైగా విద్యార్థులకు ఫీజు రాయితీ ఇస్తున్నాం. దీంతోపాటు ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మా అబ్బాయిలు, కోడళ్లు కూడా 'శ్రీ విశ్వశాంతి' విద్యా ప్రగతిలో భాగస్వాములయ్యారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యావంతులైతే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం ప్రగతి పథంలో పయనిస్తుంది."

• గుడాల శ్రీనివాస, విజయవాడ
ఫొటోలు: లక్ష్మణ్

1975 ఫిబ్రవరి 22న ఆరుగురు విద్యార్థులతో 'విశ్వశాంతి' స్కూలు ప్రారంభమైంది. మొదటి సంవత్సరం 16 మంది విద్యార్థులు ఉండేవారు. మరుసటి ఏడాది ఆ సంఖ్య 136కి చేరింది. విద్యార్థులకు నేను, ప్రమీల పాఠాలు చెప్పేవాళ్లం. మరో ఇద్దరు ఆంగ్లో ఇండియన్లు టీచర్లుగా ఉండేవారు. 1988 నుంచి ఎమ్మెల్యేల పిల్లలూ 'విశ్వశాంతి'లో అడ్మిషన్లు తీసుకోవడం మొదలైంది. ఇప్పుడు 80 ఎకరాల విస్తీర్ణంలో 'శ్రీ విశ్వశాంతి' నడుస్తోంది.



నార్నె నితిన్.. 'ఆయ్', 'మ్యాడ్' చిత్రాల సిరీస్‌తో ఇప్పుడు వినిపిస్తోన్న పేరు. తొలి సినిమా ఇంకా విడుదల కాకుండానే మరో మూడు చిత్రాల్లో నటించేసి, విజయాలను తన ఖాతాలో వేసుకున్న ఈ యువ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌కు స్వయానా బావమరిది. అయితే ఆ బ్రాండ్‌ను ఇప్పుడే ఉపయోగించుకోకుండా కెరీర్‌ను ప్లాన్ చేసుకుంటున్న నితిన్ 'నవ్య'కు చెప్పిన విశేషాలివి.

బావ అలా అనగానే ఆనందపడ్డా..!



• మూడు సినిమాలు.. వరుస హిట్స్.. ఎలా అనిపిస్తోంది?

నా కంటే అదృష్టవంతుడు మరొకరు ఉండరేమో అనిపిస్తోంది. ఎందుకంటే కొత్త హీరోలకు హిట్ దొరకడమే కష్టమవుతున్న ఈ రోజుల్లో నాకు వరుసగా మూడు హిట్స్ రావడం ఓ అద్భుతమే కదండీ.

• తెరపై మిమ్మల్ని మీరు చూసుకోవాలనే కోరిక ఎప్పుడు కలిగింది?

నేను సినిమా పిచ్చోడిని. సినిమాలు బాగా చూస్తుంటాను. సీనియర్ నటుడు భిక్షుగారు తెలుసు కదా.. ఆయన భార్య అరుణగారు కూడా నటనలో శిక్షణ ఇస్తుండేవారు. స్కూల్ ఫైనల్ కూడా నాకు అప్పుడు పూర్తి కాలేదు. సాయంత్రం స్కూల్ నుంచి రాగానే మణికొండలో ఉన్న వారి ఇంటికి ట్రైనింగ్ కోసం వెళ్లేవాడిని. సాయిధరమ్ తేజ్, బెల్లంకొండ శ్రీనివాస్, నాగశౌర్య కూడా అక్కడికి ట్రైనింగ్ కోసం వచ్చేవారు. వాళ్లు నాకు సీనియర్స్. వాళ్లకి పెద్ద పెద్ద డైలాగులు, నాకు చిన్న డైలాగులు ఇచ్చి చెప్పమనేవారు. అదో సరదాగా ఉండేది. బావగారు (జూనియర్ ఎన్టీఆర్) మా ఇంట్లో అడుగుపెట్టిన తర్వాత ఆ సరదా మరింత పెరిగింది.

• ఎన్టీఆర్ మీకు బావ కాకముందు నుంచీ ఆయనంటే అభిమానం ఉండేదా?

'సింహాద్రి' చూసిన తర్వాత బావగారికి అభిమానిగా మారాను. కడియాలు చేయించుకుని రోజూ ఎవరో ఒకరిని కొట్టడం, వాళ్లు ఇంటి మీదకి రావడం, ఇంట్లో వాళ్లు నన్ను తిట్టడం . జరిగేది. చిన్నప్పటి నుంచి ఆయనంటే నాకు బాగా ఇష్టం.

• మీ బావ ప్రోత్సాహం ఎలా ఉంది?

సినిమాల్లో నటించాలనుంది అని ధైర్యంగా నా మనసులోని కోరికను మొదట బావగారికి చెప్పినప్పుడు వెంటనే ఆయన ఓ మాట అన్నారు. "ఒరేయ్.. ఈ పరిశ్రమలో ఎవరి సపోర్ట్ ఆశించకూడదు. మనకు మనకే నేర్చుకోవాలి, కష్టపడాలి, ఎదగాలి. కింద పడినా వెంటనే మనమే లేవాలి. ఎవరో వచ్చి లేపుతారని వెయిట్ చేయకూడదు. నీ ప్రయత్నాలు నువ్వు చేసుకో. ఆ తర్వాత నా సపోర్ట్, నా అభిమానుల సపోర్ట్ నీకు తప్పకుండా ఉంటుంది.

• ఎన్టీఆర్ బావమరిది అనే బ్రాండ్ మీకు పాజిటివా, నెగెటివా?

పాజిటివ్‌నెస్‌తో పాటు నెగెటివిటీ కూడా ఉంటుంది. వంద మంది మావాడు అన్నప్పుడు, ఓ పది మంది 'మీ వాడు ఏమిటిరా' అని కూడా అనొచ్చు. అటువంటి మాట తప్పకుండా వస్తుంది కూడా. అయినా సరే ఎన్టీఆర్ బావమరిది అనేది నాకు ఎప్పుడూ పాజిటివే. నెగెటివ్‌గా అస్సలు చూడను.

• మీ పేరుతోనే మరో హీరో ఉన్నారు కదా. పేరు మార్చుకోవాలని అనుకోలేదా?

హీరోగా నేను ఎంట్రీ ఇవ్వాలనుకున్నప్పుడు నా పేరు గురించి పెద్ద చర్చ జరిగింది.. 'పేరు మార్చాలా వద్దా.. మారిస్తే ఎలాంటి పేరు పెట్టాలి' అని. కానీ నాకు పేరు మార్చుకోవాలనిపించలేదు. చిన్నప్పటి నుంచి అలవాటు అయిన పేరు. దాన్ని వదులుకోవాలని అనిపించలేదు. అందుకే ఇంటిపేరు కూడా చేర్చుకుని 'నార్నే నితిన్'గా ఎంట్రీ ఇచ్చా. ఆర్టిస్ట్‌గా టాలెంట్ నిరూపించుకోవాలి కానీ పేరు దానికి అడ్డంకి కాదని నా అభిప్రాయం.

• కథల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఫలానా జోనర్‌లో మాత్రమే చేయాలని అనుకోవడం లేదు. ఈ సందర్భంగా దర్శకులకు నాదొక విన్నపం... ఎలాంటి కథ అయినా నాకు చెప్పండి. అది కామెడీ కావచ్చు, హారర్ కావచ్చు, రొమాన్స్ కావచ్చు. పాయింట్ కొత్తగా ఉంది, ప్రేక్షకులు తప్పకుండా చూస్తారు అనిపిస్తే చేసేస్తా. మరో విషయం ఏమిటంటే వంద మందిని కొట్టేసే మాస్ హీరో కావాలనే ఆశ నాకు ఇప్పుడైతే లేదు. నాలాంటి అప్‌కమింగ్ హీరో ఇలాంటి ప్రయత్నాలు చేస్తే తొందరగా ఇంటికి తిరిగెళ్లిపోతాడు. 'వీడు మా వాడే.. నా ఫ్రెండే' అనే భావన ప్రేక్షకులకు కలిగిస్తేనే వాళ్లకి తొందరగా దగ్గర కాగలం. నేను సూపర్ హ్యూమన్‌ని, హీరోని, మీరంతా నేను ఏది చేస్తే అది చూడాలి' అన్నట్లు ఉండకూడదు. నేను కూడా ఒకప్పుడు ఓ సాధారణ ప్రేక్షకుడినే. అప్పట్లో బావగారు తప్ప పరిశ్రమలో నాకు ఎవరూ తెలీదు. ఓ కొత్త హీరో వచ్చి కొంచెం ఓవర్‌గా చేస్తుంటే ఏమిట్రా వీడు? అని అనుకున్న రోజులు చాలా ఉన్నాయి. ఓ పదేళ్ల టార్గెట్ పెట్టుకుని ఆ జర్నీలో మెల్లగా ఇమేజ్ మార్చుకుంటూ రావాలే కానీ వచ్చిన తొలి రోజుల్లోనే అన్నీ చేసేయాలని అనుకోకూడదు.

• 'మ్యాడ్' ఫస్ట్ పార్ట్‌కి, సెకండ్ పార్ట్‌కి మధ్య కాలంలో మీలో వచ్చిన మార్పు ఏమిటి?

'మ్యాడ్' చిత్రం రిలీజ్ అయ్యాక నా గురించి వినిపించిన కామెంట్స్‌ను పాజిటివ్‌గా తీసుకున్నా. వాటిని ఇంప్రూవ్ చేసుకుని 'ఆయ్' సినిమా చేశా. ఆ తర్వాత 'మ్యాడ్ 2' లో నటించా. ఆ సినిమా తర్వాత నెగెటివ్ కామెంట్స్ రాలేదు. మా బావగారే స్వయంగా అన్నారు 'ఒరేయ్.. నీలో ఈజ్ పెరిగింది. క్యారెక్టర్‌లో లీనం అయ్యావు' అని ఆయన అనడం ఆనందంగా అనిపించింది. నా గురించి వచ్చే కామెంట్స్‌ను ఫాలో అవుతుంటా. నేర్చుకుంటూనే ఉంటా. 'మ్యాడ్' తర్వాత 'ఆయ్' చేశా. ఆ తర్వాత 'మ్యాడ్ 2' చేశా. రోజురోజుకీ కొత్త విషయాలు నేర్చుకుంటున్నా.

• మీ మొదటి సినిమా 'శ్రీ శ్రీ రాజావారు' రిలీజ్ ఎప్పుడు?

ఎలా చేయాలి, ఎప్పుడు రిలీజ్ చేయాలని అని చర్చలు జరుగుతున్నాయి. ఆ చిత్ర దర్శక నిర్మాతలతో మాట్లాడుతున్నాం. అది నాలుగో సినిమా అవుతుందా, ఐదో సినిమా అవుతుందా అని ఇప్పుడే చెప్పలేదను.

• వినాయకరావు



పూజలు, ఉపవాసాలు చేసేసింది

'మ్యాడ్ 2' రిలీజ్‌కు ముందు శివానీకి ఓ టెన్షన్ ఉండేది. మాకు ఎంగేజ్‌మెంట్ అయిన తర్వాత ఆ సినిమా రిలీజ్ అయింది. అది హిట్ కాకపోతే ఆ ఫ్లాప్ తన ఖాతాలో వేసేసి ఇదంతా తనవల్లే జరిగిందని అంటారేమోననే భయంతో చాలా టెన్షన్ పడింది. సినిమా హిట్ కోసం పూజలు, ఉపవాసాలు చేసింది. 'ఏమీ వద్దు.. అవసరం లేదు' అన్నా శివానీ వినలేదు. లక్కీగా 'మ్యాడ్ 2' హిట్ కావడంతో ఆమె చాలా రిలీఫ్ ఫీలయింది. వరుసగా మూడో హిట్ పడే సరికి తను హ్యాపీ. మేమందరం హ్యాపీ. అక్టోబరులో మా పెళ్లి జరుగుతుంది.

వేసవిలో లంచ్ బాక్స్ సర్దేటప్పుడు...

ఎండాకాలంలో ఆహారం తొందరగా పాడైపోతూ ఉంటుంది. పొద్దున్నే బాక్సులో పెట్టుకుని ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం మధ్యాహ్నం అయ్యేటప్పటికి తినడానికి వీలుగా ఉండదు. అందుకే ఉదయాన్నే లంచ్ బాక్సులు సర్దేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

• అప్పుడే వండిన వేడివేడి ఆహారాన్ని వెంటనే బాక్సుల్లో సర్దేయకూడదు. అలా సర్దితే... వేడి వల్ల ఆహార పదార్థాలు తొందరగా పాడవుతాయి. కాబట్టి అన్నం, కూరలను చల్లార్చి విడివిడిగా బాక్సుల్లో సర్దాలి. అప్పుడే అవి చాలాసేపటి వరకూ తాజాగా ఉంటాయి.

• టమాటా, దోసకాయ, ఆలుగడ్డలతో చేసిన కూరలు తొందరగా చెడిపోతూ ఉంటాయి. వీటికి బదులు పప్పు, పచ్చడి, పులుసు లాంటి వాటిని లంచ్ బాక్స్‌లో పెట్టుకోవచ్చు. అలాగే అన్నానికి బదులు చపాతీ, పుల్కా, శాండ్‌విచ్ పెట్టుకోవడం మంచిది.



• పండ్లు ఎంత తాజాగా ఉన్నప్పటికీ వాటిని ముక్కలుగా కోసి బాక్సులో పెట్టుకుంటే మధ్యాహ్నానికే రుచి మారుతూ ఉంటాయి. పండ్లను ముక్కలుగా కోయకుండా వాటిని అలాగే బాక్సులో పెట్టుకుని తీసుకెళ్లడం మంచిది.

• మామూలు స్టీల్ బాక్సులు కాకుండా గాలి చొరబడని విధంగా గట్టి మూత ఉన్న బాక్సులు వాడుకుంటే ఆహారం ఎక్కువసేపు తాజాగా ఉంటుంది.

• కొంతమంది రాత్రి వంటలను ఫ్రిజ్‌లో ఉంచి ఉదయాన్నే వాటిని బాక్సుల్లో సర్దుకుంటూ ఉంటారు. ఇలా రాత్రి వేళ ఆహారం మరుసటి రోజు మధ్యాహ్నం వరకు నిల్వ ఉండదు. ముఖ్యంగా ఎండాకాలంలో..! అందుకే ఉదయం పూట తాజాగా వండిన ఆహారాన్ని మాత్రమే లంచ్ బాక్స్‌లో సర్దుకోవాలి.









రావయ్యా అంజని తనయా!



చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ బేనర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ భారీ బడ్జెట్‌తో గ్రాండియర్‌గా నిర్మిస్తున్నారు. చిత్రబృందం మ్యూజిక్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుట్టింది. హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం 'విశ్వంభర' నుంచి తొలి గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. సీతారాముల కల్యాణం నేపథ్యంలో సాగే గీతమిది. 'రామ రామ' అంటూ మొదలైన ఈ గీతం శ్రీరాముని పట్ల హనుమంతుడికి ఉన్న అచంచలమైన ప్రేమ, భక్తిని వివరిస్తూ సాగుతుంది. ఎంఎం కీరవాణి స్వరకల్పన చేయగా, శంకర్ మహదేవన్, లిప్సిక ఆలపించారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ఈ పాటలో చిరంజీవి సంప్రదాయ దుస్తుల్లో సరికొత్త లుక్‌తో ఎనర్జిటిక్‌గా కనిపించారు. ఆయన స్టెప్పులు గ్రేస్‌ఫుల్‌గా ఉన్నాయి. ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. కునాల్ కపూర్ కీలకపాత్ర పోషిస్తున్నారు.



కల్యాణ్‌రామ్ కెరీర్‌లో గొప్ప చిత్రమిది

ఎన్టీఆర్

'మా అన్న కల్యాణ్‌రామ్ నటించిన 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమా కార్యక్రమానికి అతిథిగా వచ్చినందుకు ఆనందంగా ఉంది. ప్రతి సారీ అభిమానులను కాలర్ ఎగరేయమని నేను చెబుతుంటాను. కానీ ఈసారి కల్యాణ్ రామ్ అన్నను కాలర్ ఎగరేయమని చెబుతున్నాను. ఆయన సినీ జీవితంలో మైలురాయిగా నిలిచిపోయే చిత్రం ఇది' అని జూనియర్ ఎన్టీఆర్ అన్నారు. కల్యాణ్‌రామ్ హీరోగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 18న విడుదలవుతోంది. శనివారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మాట్లాడుతూ 'నేను ఈ సినిమా చూశాను. ప్రేక్షకుడిగా ఎంజాయ్ చేశాను. విజయశాంతి గారు లేకపోతే ఈ చిత్రం లేదు. క్లైమాక్స్‌లో 20 నిమిషాలు ప్రేక్షకుల కళ్లలో నీళ్లు తిరుగుతాయి. అన్నయ్య, విజయశాంతి గారివల్లే ఈ సినిమా ఇంత గొప్పగా వచ్చింది' అని అన్నారు. కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ 'ఈ సినిమా గురించి ఇప్పుడు మాట్లాడడం కన్నా సక్సెస్‌మీట్‌లో మాట్లాడడం సమంజసం అనుకుంటున్నాను. కొన్ని సినిమాలే మనసులో నిలిచిపోతాయి. ఇది కూడా అలాంటి సినిమా అవుతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. విజయశాంతి మాట్లాడుతూ 'ఇందులో ఒక తల్లి పడే ఆరాటం, కొడుకు చేసే పోరాటం ఆకట్టుకుంటుంది. చాలా సంవత్సరాల నుంచి మంచి సినిమా చేయమని అభిమానులు అడుగుతున్నారు. అలాంటి పాత్ర కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఈ సినిమా అవకాశం వచ్చింది. షూటింగ్ సమయంలోనే సూపర్‌హిట్ అవుతుందనే నమ్మకం కలిగింది. మాతృమూర్తులందరికీ ఈ సినిమా అంకితం' అని అన్నారు. నిర్మాత అశోక్ వర్ధన్ ముప్పా మాట్లాడుతూ 'ఈ చిత్రం కోసం కల్యాణ్‌రామ్ రెండేళ్లు కష్టపడ్డారు. విజయశాంతి గారి నటన ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ' అని చెప్పారు. ప్రదీప్ చిలుకూరి మాట్లాడుతూ 'ఈ చిత్రంలో ఒక బాధ్యతాయుతమైన పాత్రలో కల్యాణ్‌రామ్ నటించారు' అని తెలిపారు.

జాన్వీ కపూర్‌కు ఖరీదైన కానుక



బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కార్ల కలెక్షన్స్‌లో మరో లగ్జరీ కారు చేరింది. జాన్వీ స్నేహితురాలు, ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార్ మంగళం బిర్లా పెద్ద కుమార్తె అనన్య బిర్లా రూ.5 కోట్ల విలువైన లంబోర్ఘిని కారును కానుకగా ఇచ్చారు. ఈ కారు శుక్రవారం ఉదయం జాన్వీ నివాసానికి చేరుకుంది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కారుతోపాటు మరో గిఫ్ట్ ప్యాక్‌ను కూడా అనన్య పంపించారు. దానిపై 'ప్రేమతో నీ అనన్య' అని రాసి ఉంది. కాగా, ఇటీవలె అనన్య బ్యూటీ ప్రొడక్ట్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టినట్లు ప్రకటించారు. ఈ బ్రాండ్‌కు జాన్వీ కపూర్ ప్రచారకర్తగా వ్యవహరించనున్నట్లు సమాచారం. తన బ్రాండ్ కోసం జాన్వీ సహకరిస్తున్నందుకు కానుకగా అనన్య ఖరీదైన కారును బహూకరించారని బాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి.



మధురానుభూతినిస్తుంది


'దియా' ఫేమ్ పృథ్వీ అంబర్ ప్రధానపాత్రలో సాయిరాజేశ్ మహదేవ్ తెరకెక్కించిన చిత్రం 'డియర్ ఉమ'. సుమయ రెడ్డి హీరోయిన్‌గా నటించి నిర్మించారు. ఈ నెల 18న సినిమా విడుదలవుతోంది. కమల్ కామరాజు, సప్తగిరి, అజయ్ ఘోష్, ఆమని తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇటీవలె విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్ ఆకట్టుకున్నాయి. తాజాగా, ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత, హీరోయిన్ సుమయ రెడ్డి మాట్లాడుతూ "మంచి కంటెంట్‌తో చేసిన విభిన్నమైన ప్రయత్నం ఇది. సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని అన్నారు. "ప్రేక్షకులకు మధురానుభూతినిచ్చే సినిమా ఇది" అని హీరో పృథ్వీ అంబర్ చెప్పారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటా

హృతిక్ రోషన్



హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వార్-2'. కియారా అద్వానీ హీరోయిన్. యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న హృతిక్ రోషన్ సినిమా విశేషాలను వివరిస్తూ ఎన్టీఆర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జూనియర్ ఎన్టీఆర్‌తో పనిచేయడం వల్ల ఎన్నో కొత్త విషయాలు నేర్చుకొన్నాను. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటా. 'వార్-1'తో పోల్చితే రెండో భాగం భారీగా ఉంటుంది. ఈ చిత్ర నిర్మాణం సులభంగా పూర్తయ్యింది. నిర్మాత ఆదిత్య చోప్రా, దర్శకుడు అయాన్ ముఖర్జీ వల్లే ఇది సాధ్యమైంది. ఈ మూవీ చేసినందుకు చాలా గర్వంగా ఉంది' అని పేర్కొన్నారు.

ఇరు కనులు కలిసి మురిసే



రాజేంద్ర ప్రసాద్, అర్చన కాంబినేషన్‌లో రూపేశ్, ఆకాంక్ష సింగ్ హీరో హీరోయిన్లుగా పవన్ ప్రభ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'షష్టిపూర్తి'. మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేశ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'ఇరు కనులు కలిసి మురిసే.. మొదటి చూపులో..' అనే గీతాన్ని హీరో రవితేజ ఆవిష్కరించారు. రెహమాన్ రాసిన ఈ పాటకు ఇళయరాజా సంగీతం అందించారు. ఎస్పీ చరణ్, విభావరి ఆలపించారు.

మాట నిలబెట్టుకున్నాం

- ప్రదీప్



'ఫస్ట్ ఫ్రేమ్ నుంచి లాస్ట్ ఫ్రేమ్ వరకూ ప్రేక్షకుల పెదాల మీద నవ్వు ఉంటుందని ప్రామిస్ చేశాం. దాన్ని నిలబెట్టుకున్నాం. ఆడియన్స్ థియేటర్‌లో నవ్వుతుంటే ఆనందంతో మా కడుపు నిండిపోయింది. మమ్మల్ని నమ్మి థియేటర్‌కు వస్తున్న ప్రేక్షకులకు థాంక్స్' అన్నారు ప్రదీప్ మాచిరాజు. ఆయన హీరోగా నటించిన 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రం విడుదలైన సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. సినిమా విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. తమ జీవితాల్లో ఇది మరుపురాని రోజు అని పేర్కొన్నారు. మంచి తెలుగు సినిమా చూసి నవ్వుకుందాం అని భావించే వారికి ఆయన ఈ సందర్భంగా థియేటర్‌కు రండంటూ ఆహ్వానం పలికారు. సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు దర్శక ద్వయం నితిన్, భరత్ కృతజ్ఞతలు తెలిపారు. 'కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మంచి సమ్మర్ ఎంటర్‌టైనర్. అందరూ ఫ్యామిలీతో థియేటర్‌కు రండి. కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు' అని మైత్రీ మూవీ మేకర్స్ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి చెప్పారు.

కడుపుబ్బా నవ్వించే చిత్రం



నూతన నటుడు పవన్‌కల్యాణ్ తెరంగేట్రం చేస్తున్న చిత్రం 'పురుష'. ఈ సినిమాను వీరు ఉలవల దర్శకత్వంలో బత్తుల కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాను ప్రారంభించారు. 'మళ్లీరావా', 'జెర్సీ' ఫేమ్, దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కామెడీ ప్రధానంగా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ తెలిపారు.



గుజరాత్ జోరుకు బ్రేక్

చెలరేగిన పూరన్, మార్‌క్రమ్

6 వికెట్లతో లఖ్‌నవూ విజయం ● గిల్, సుదర్శన్ శ్రమ వృథా


మార్‌క్రమ్ (58)


పూరన్ (34 బంతుల్లో 61)

లఖ్‌నవూ: నికోలస్ పూరన్ (34 బంతుల్లో ఫోర్, 7 సిక్స్‌లతో 61) సుడిగాలి ఇన్నింగ్స్‌తో.. గుజరాత్ టైటాన్స్ నాలుగు వరుస విజయాల జోరుకు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ) బ్రేకులు వేసింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో లఖ్‌నవూ 6 వికెట్ల తేడాతో గుజరాత్‌ను ఓడించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ 20 ఓవర్లలో 180/6 స్కోరు చేసింది. శుభ్‌మన్ గిల్ (60), సాయి సుదర్శన్ (56) హాఫ్ సెంచరీలు వృథా అయ్యాయి. శార్దూల్ ఠాకూర్, బిష్ణోయ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో లఖ్‌నవూ 19.3 ఓవర్లలో 4 వికెట్లకు 186 పరుగులు చేసి నెగ్గింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మార్‌క్రమ్ (58) కూల్‌గా ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. ప్రసిద్ధ్ కృష్ణకు 2వికెట్లు దక్కాయి. వరుసగా విఫలమవుతున్న కెప్టెన్ రిషభ్ పంత్ (21) ఓపెనర్‌గా రావడం విశేషం.

అలవోకగా..: ఓ మాదిరి లక్ష్య ఛేదనలో మార్‌క్రమ్, పంత్ తొలి వికెట్‌కు 38 బంతుల్లో 68 పరుగులతో అదిరే ఆరంభాన్నిచ్చారు. పంత్‌ను కృష్ణ అవుట్ చేసినా.. వన్‌డౌన్‌లో వచ్చిన పూరన్ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడడంతో మ్యాచ్ వన్‌సైడ్‌గా మారింది. దీంతో ఎల్‌ఎస్‌జీ 114/1తో గెలుపు దిశగా దూసుకెళ్లింది. అయితే, మార్‌క్రమ్‌ను కృష్ణ వెనక్కిపంపడంతో.. రెండో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. చివరి 5 ఓవర్లలో గెలుపునకు 27 పరుగులు కావల్సి ఉండగా.. హాఫ్ సెంచరీ చేసిన పూరన్‌ను రషీద్ వెనక్కిపంపాడు. మిల్లర్ (7)ను సుందర్ బౌల్డ్ చేశాడు. కానీ, బదోని (28 నాటౌట్), సమద్ (2 నాటౌట్) 3 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించారు.

ఆరంభం అదిరినా.. : గిల్, సుదర్శన్ అదిరే అర్ధ శతకాలతో పటిష్ఠ పునాది వేసినా.. మిడిలార్డర్ వైఫల్యంతో గుజరాత్ 180 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్లు గిల్, సుదర్శన్ తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో.. టైటాన్స్ రికార్డు స్కోరు చేస్తుందని భావించారు. కానీ, వరుస ఓవర్లలో సెటిల్డ్ బ్యాటర్లు పెవిలియన్ చేరారు. చివరి 8 ఓవర్లలో 60 పరుగులు మాత్రమే ఇచ్చి 6 వికెట్లు పడగొట్టారు. 13వ ఓవర్ తొలి బంతికి గిల్‌ను ఆవేశ్ క్యాచవుట్ చేసి.. జట్టుకు బ్రేక్ అందించాడు. ఆ తర్వాతి ఓవర్‌లో సుదర్శన్‌ను బిష్ణోయ్ పెవిలియన్ చేర్చడంతో టైటాన్స్ 122/2తో నిలిచింది. సుందర్ (2)ను బిష్ణోయ్ బౌల్డ్ చేయగా.. బట్లర్ (16)ను రాఠీ వెనక్కిపంపడంతో ఒక్కసారిగా సీన్ మారింది. ఆఖరి ఓవర్‌లో రూథర్‌ఫోర్డ్ (22), తెవాటియా (0)ను శార్దూల్ వరుస బంతుల్లో అవుట్ చేశాడు.

స్కోరుబోర్డు

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) పూరన్ (బి) బిష్ణోయ్ 56, గిల్ (సి) మార్‌క్రమ్ (బి) ఆవేశ్ 60, బట్లర్ (సి) శార్దూల్ (బి) రాఠీ 16, సుందర్ (బి) బిష్ణోయ్ 2, రూథర్‌ఫోర్డ్ (ఎల్బీ) శార్దూల్ 22, షారుక్ ఖాన్ (నాటౌట్) 11, తెవాటియా (సి) మార్‌క్రమ్ (బి) శార్దూల్ 0, రషీద్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 180/6; వికెట్ల పతనం:** 1-120, 2-122, 3-127, 4-145, 5-176, 6-176; **బౌలింగ్:** శార్దూల్ 4-0-34-2, ఆకాశ్ దీప్ 3-0-33-0, దిగ్వేష్ రాఠీ 4-0-30-1, ఆవేశ్ ఖాన్ 4-0-32-1, బిష్ణోయ్ 4-0-36-2, మార్‌క్రమ్ 1-0-15-0.

లఖ్‌నవూ: మార్‌క్రమ్ (సి) గిల్ (బి) ప్రసిద్ధ్ 58, పంత్ (సి) సుందర్ (బి) ప్రసిద్ధ్ 21, పూరన్ (సి) షారుక్ (బి) రషీద్ 61, ఆయుష్ బదోని (నాటౌట్) 28, మిల్లర్ (బి) సుందర్ 7, సమద్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 19.3 ఓవర్లలో 186/4; వికెట్ల పతనం:** 1-65, 2-123, 3-155, 4-174; **బౌలింగ్:** సిరాజ్ 4-0-50-0, అర్షద్ ఖాన్ 2-0-11-0, ప్రసిద్ధ్ కృష్ణ 4-0-26-2, రషీద్ 4-0-35-1, వాషింగ్టన్ సుందర్ 4-0-28-1, సాయి కిశోర్ 1.3-0-35-0.

నేటి మ్యాచ్‌లు

రాజస్థాన్ x బెంగళూరు — మ.3.30 నుంచి — వేదిక: జైపూర్

ఢిల్లీ x ముంబై — రా.7.30 నుంచి — వేదిక: ఢిల్లీ

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	4	4	0	0	8	1.278
గుజరాత్	6	4	2	0	8	1.081
లఖ్‌నవూ	6	4	2	0	8	0.162
కోల్‌కతా	6	3	3	0	6	0.803
బెంగళూరు	5	3	2	0	6	0.539
పంజాబ్	5	3	2	0	6	0.065
రాజస్థాన్	5	2	3	0	4	-0.733
హైదరాబాద్	6	2	4	0	4	-1.245
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	6	1	5	0	2	-1.554

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) నితీశ్ (బి) హర్షల్ 36, ప్రభ్‌సిమ్రన్ (సి) కమిన్స్ (బి) మలింగ 42, శ్రేయాస్ (సి) హెడ్ (బి) హర్షల్ 82, నేహల్ వధేరా (ఎల్బీ) మలింగ 27, శశాంక్ (ఎల్బీ) హర్షల్ 2, మ్యాక్స్‌వెల్ (బి) హర్షల్ 3, స్టొయినిస్ (నాటౌట్) 34, జాన్సెన్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 245/6; వికెట్ల పతనం:** 1-66, 2-91, 3-164, 4-168, 5-205, 6-206; **బౌలింగ్:** షమి 4-0-75-0, కమిన్స్ 4-0-40-0, హర్షల్ 4-0-42-4, ఇషాన్ మలింగ 4-0-45-2, జీషన్ 4-0-41-0.

సన్‌రైజర్స్: హెడ్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) చాహల్ 66, అభిషేక్ (సి/సబ్) ప్రవీణ్ దూబే (బి) అర్షదీప్ 141, క్లాసెన్ (నాటౌట్) 21, ఇషాన్ (నాటౌట్) 9, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 18.3 ఓవర్లలో 247/2; వికెట్ల పతనం:** 1-171, 2-222; **బౌలింగ్:** అర్షదీప్ 4-0-37-1, జాన్సెన్ 2-0-39-0, యష్ ఠాకూర్ 2.3-0-40-0, మ్యాక్స్‌వెల్ 3-0-40-0, ఫెర్గూసన్ 0.2-0-1-0, స్టొయినిస్ 0.4-0-6-0, చాహల్ 4-0-56-1, శశాంక్ 2-0-27-0.

సన్‌రైజర్స్‌పై అత్యధిక పవర్‌ప్లే పరుగులు (89) సాధించిన జట్టుగా పంజాబ్.

1 ఐపీఎల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు (141) సాధించిన భారత ఆటగాడిగా అభిషేక్. ఓవరాల్‌గా మూడో ప్లేయర్.

ఐపీఎల్‌లో పంజాబ్‌కిది రెండో అత్యధిక స్కోరు (245/6). కోల్‌కతాపై ఎక్కువ రన్స్ (262/2) సాధించింది.

2 ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక ఛేజింగ్ (246) చేసిన జట్టుగా సన్‌రైజర్స్

ఓ ఐపీఎల్ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు (0/75) సమర్పించుకున్న రెండో బౌలర్‌గా షమి. ఆర్చర్ (0/76) టాప్‌లో ఉన్నాడు.

ప్లేఆఫ్స్‌కు భారత అమ్మాయిలు



పుణె: తెలుగమ్మాయిలు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, సహజ యామలపల్లిలతో కూడిన భారత టెన్నిస్ మహిళల జట్టు చరిత్ర సృష్టించింది. బిల్లీజీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 టోర్నీలో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. శనివారం ఇక్కడ జరిగిన పోరులో భారత్ 2-1తో కొరియాను ఓడించి ఈ ఘనత సాధించింది. ఈ టోర్నీలో ప్లేఆఫ్స్ చేరడం భారత్‌కిది రెండోసారి మాత్రమే. అంతకుముందు 2020లో ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టింది.


సురేఖ జోడీకి పసిడి



న్యూఢిల్లీ: తెలుగు ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా చాటింది. అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడాలో జరుగుతున్న ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 1 పోటీల్లో రిషభ్ యాదవ్‌తో కలిసి కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం కొల్లగొట్టింది. ఫైనల్లో సురేఖ-రిషభ్ జోడీ 153-151తో చైనీస్ తైపీ ద్వయం హువాంగ్ జో - చెన్ చి లున్‌పై విజయం సాధించింది. ఇప్పుడు సురేఖ గెలిచిన కాంపౌండ్ మిక్స్‌డ్ ఈవెంట్‌నే 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో ప్రవేశపెడుతున్నట్టు ఇటీవల అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ప్రకటించిన సంగతి తెలిసిందే. విజయవాడ ఆర్చర్ సురేఖకు ప్రపంచ కప్‌లో ఇది 11వ పసిడి పతకం.

అభిషేక్ చేశాడు

40 బంతుల్లోనే శతకం
246 పరుగులను ఛేదించిన సన్‌రైజర్స్
పంజాబ్‌కు షాక్


సెంచరీ అనంతరం 'ఇది ఆరెంజ్ ఆర్మీ కోసం' అంటూ రాసిన కాగితాన్ని చూపిస్తున్న అభిషేక్

అభిషేక్ శర్మ (141) (55 బంతుల్లో 14 ఫోర్లు, 10 సిక్సర్లతో)

హైదరాబాద్: ఇదీ సన్‌రైజర్స్ సత్తా.. అంటూ ఓపెనర్ అభిషేక్ శర్మ (55 బంతుల్లో 14 ఫోర్లు, 10 సిక్సర్లతో 141) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. రికార్డులను తిరగరాస్తూ సాగిన అతడి విధ్వంసానికి ఉప్పల్ స్టేడియం ఊగిపోయింది. కొడితే సిక్సర్ లేదంటే ఫోర్ అనే మాదిరిగా సాగిన బాదుడుకు, పంజాబ్ కింగ్స్ సాధించిన భారీ స్కోరు కూడా చిన్నబోయింది. దీంతో వరుసగా నాలుగు ఓటములకు చెక్ పెడుతూ రైజర్స్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం అందుకుంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 245 పరుగులు చేసింది. శ్రేయాస్ (82), ప్రభ్‌సిమ్రన్ (42), ప్రియాన్ష్ (34), స్టొయినిస్ (34 నాటౌట్) వేగం కనబర్చారు. హర్షల్‌కు నాలుగు, ఎషాన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో సన్‌రైజర్స్ 18.3 ఓవర్లలో 2 వికెట్లకు 247 పరుగులు చేసి గెలిచింది. హెడ్ (66), క్లాసెన్ (21 నాటౌట్) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభిషేక్ నిలిచాడు.

ఏమా బాదుడు..?: 246 పరుగుల ఛేదనలో సన్‌రైజర్స్ ఏ దశలోనూ వెనక్కితగ్గలేదు. ఓపెనర్ అభిషేక్ శర్మ వాయువేగంతో పరుగులు రాబట్టగా.. అటు మరో ఓపెనర్ హెడ్ చక్కగా సహకరించాడు. పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై ఈ ఇద్దరూ వీరంగమే ఆడారు. అయితే 29 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అభిషేక్ క్యాచ్ అవుటైనా అది నోబ్‌గా తేలడంతో బతికిపోయాడు. ఇక పవర్‌ప్లేలో 83 రన్స్‌తో జట్టు ఛేదన వైపు వేగంగా సాగింది. ఎట్టకేలకు 13వ ఓవర్‌లో హెడ్‌ను చాహల్ అవుట్ చేయగా తొలి వికెట్‌కు 171 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ అదే ఓవర్‌లో సింగిల్‌తో అభిషేక్ 40 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి 'ఇది ఆరెంజ్ ఆర్మీ కోసం' అంటూ ఓ పేపర్‌ను చూపాడు. వన్‌డౌన్‌లో క్లాసెన్ క్రీజులోకి వచ్చినా అభిషేక్‌దే హవా సాగింది. బౌండరీలతో హోరెత్తిస్తూ లక్ష్యాన్ని వేగంగా కరిగించాడు. చివరకు 23 బంతుల్లో 24 రన్స్ కావాల్సిన వేళ అర్ష్‌దీప్‌కు చిక్కాడు. ఆ తర్వాత క్లాసెన్ బౌండరీల హోరుతో మరో 9 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

పంజాబ్ దూకుడు: టాస్ గెలవగానే పంజాబ్ బ్యాటింగ్‌కు దిగగా.. ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ శివాలెత్తారు. మధ్య ఓవర్లలో శ్రేయాస్, ఆఖర్లో స్టొయినిస్ ఫినిషింగ్‌కు పంజాబ్ అవలీలగా 220 స్కోరు దాటేసింది. అలాగే రైజర్స్ పేలవ ఫీల్డింగ్ కూడా భారీ స్కోరుకు దోహదపడింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్ ప్రభ్ హ్యాట్రిక్ ఫోర్లతో ఆరంభమైంది. ఇక రెండో ఓవర్‌లో ప్రియాన్ష్ 6,4తో పాటు.. తర్వాతి ఓవర్‌లోనే అతడి 6,6,4తో జట్టు 18 బంతులకే 53 పరుగులతో వావ్ అనిపించింది. అయితే హర్షల్ ఓవర్‌లో సిక్సర్ బాదిన వెంటనే ఆర్య విడ్ వికెట్‌లో నితీశ్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో తొలి వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆరో ఓవర్‌లో కెప్టెన్ శ్రేయాస్ సిక్సర్‌తో జట్టు పవర్‌ప్లేలో 89/1 స్కోరుతో నిలిచింది. కానీ తర్వాతి ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్‌ను కొత్త పేసర్ ఎషాన్ మలింగ అవుట్ చేశాడు. ఈ స్థితిలో శ్రేయాస్ బాధ్యత తీసుకుని రన్‌రేట్ తగ్గకుండా చూశాడు. నేహల్ (27)తో కలిసి మూడో వికెట్‌కు 73 పరుగులు జోడించాడు. 12వ ఓవర్‌లో శ్రేయాస్ 6,4,6తో 20 రన్స్ సమకూరాయి. ఈ జోరుతో అతడు 21 బంతుల్లోనే తన ఫాస్టెస్ట్ ఫిఫ్టీని కూడా పూర్తి చేశాడు. వరుస ఓవర్లలో నేహల్ (27), శశాంక్ (2)ల వికెట్లను కోల్పోయినా శ్రేయాస్ దూకుడు తగ్గించలేదు. 17వ ఓవర్‌లో అతడి నాలుగు ఫోర్లతో జట్టు 200 దాటింది. అయితే తర్వాతి ఓవర్‌లో 5 పరుగులే ఇచ్చిన హర్షల్.. మ్యాక్స్‌వెల్ (3), శ్రేయాస్ వికెట్లతో ఝలక్ ఇచ్చాడు. కానీ ఆఖరి ఓవర్‌లో స్టొయినిస్ నాలుగు సిక్సర్లతో షమి ఏకంగా 27 రన్స్ సమర్పించుకున్నాడు.

ఐఎస్‌ఎల్ విజేత మోహన్ బగాన్

కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టైటిల్‌ను మోహన్ బగాన్ సూపర్ జెయింట్స్ సొంతం చేసుకొంది. శనివారం జరిగిన ఫైనల్లో మోహన్ బగాన్ 2-1తో బెంగళూరు ఎఫ్‌సీపై గెలిచింది. సెకండాఫ్ 49వ నిమిషంలో రోడ్రిగ్వెజ్ సెల్ఫ్ గోల్ చేయగా బెంగళూరు 1-0 ఆధిక్యంలో నిలిచింది. కానీ, 72వ నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్‌తో గోల్ చేయగా స్కోర్లు సమమయ్యాయి. ఆ తర్వాత 96వ నిమిషంలో మెక్‌లారెన్ గోల్‌తో మోహన్ బగాన్ 2-1తో పైచేయి సాధించింది.

జంటగా గృహ రుణం తీసుకుంటున్నారా!



అయితే ఈ జాగ్రత్తలు తప్పనిసరి

మన దేశంలోనూ ఉమ్మడి గృహ రుణాలు పెరిగి పోతున్నాయి. కొత్త ఇల్లు కొనుక్కునేందుకు లేదా కట్టుకునేందుకు యువ దంపతులు, ముఖ్యంగా వేరు కాపురాలు పెట్టుకునే జంటలు ఈ తరహా గృహ రుణాలకు మొగ్గు చూపుతున్నారు. అంతేకాదు ఇలాంటి రుణాలతో కుటుంబంపై కొంత భారం తగ్గుతుందని కొందరు.. బాధ్యతాయుతంగా వ్యవహరించ వచ్చని కొందరు భావిస్తుంటారు. అయితే ఈ రుణాల చెల్లింపు బాధ్యత ఒకరికి బదులు ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది తీసుకుంటారు. ఈ ఉమ్మడి గృహ రుణాల్లో అనేక సానుకూలతలతో పాటు ప్రతికూలతలూ ఉన్నాయి. అవేమిటంటే..

అనుకూలతలు

అధిక రుణ అర్హత: ఇద్దరి ఆదాయాలు కలపడంతో అధిక రుణ అర్హత ఏర్పడుడుతుంది. దాంతో ఖరీదైన ఇల్లు లేదా ఫ్లాట్ కొనుక్కోవడం తేలిక అవుతుంది.

చెల్లింపు బాధ్యత: ఉమ్మడి గృహ రుణాల చెల్లింపు బాధ్యత ఒకరి కంటే ఎక్కువ మందిపై ఉంటుంది. దీంతో సమయానికి రుణ కిస్తీలు చెల్లించడాన్ని సహ దరఖాస్తుదారులు అందరూ బాధ్యతగా స్వీకరిస్తారు.

అధిక అవకాశాలు: ఇద్దరు ముగ్గురి ఆదాయాలు స్పష్టంగా కనిపించడంతో బ్యాంకులు, గృహ ఫైనాన్స్ కంపెనీలు ఉమ్మడి గృహ రుణాల దరఖాస్తులను ఆమోదించే అవకాశాలు ఎక్కువ.

పన్ను ప్రయోజనాలు

ఉమ్మడిగా గృహ రుణం తీసునే అందరికీ సెక్షన్ 80సీ కింద, 24 (బీ) కింద పన్ను పయోజనాలు లభిస్తాయి.

మహిళలకు తక్కువ వడ్డీ రేటు: ఫస్ట్ కో అప్లికెంట్ లేదా ప్రధాన అప్లికెంట్ మహిళలు అయి ఉంటే వడ్డీ రేటు కూడా కొద్దిగా తక్కువగా ఉంటుంది.

ప్రతికూలతలు

చెల్లింపు సమస్యలు: ఉమ్మడి గృహ రుణ ఈఎంఐల చెల్లింపు బాధ్యత అందరిపై సమానంగా ఉంటుంది. ఈ విషయంలో ఏ ఒక్కరు విఫలమైనా ఆ భారం మిగతా వారిపై పడుతుంది.

క్రెడిట్ స్కోరుపై ప్రభావం: ఈఎంఐల చెల్లింపులో విఫలమైనా లేదా ఆలస్యమైనా అది ఉమ్మడిగా రుణం తీసుకున్న అందరి పరపతి స్కోరును దెబ్బతీస్తుంది. దాంతో భవిష్యత్‌లో ఏమైనా రుణాలు తీసుకోవాల్సి వస్తే, సమస్యలు వస్తాయి.

రుణ సేకరణ సామర్థ్యం తగ్గిపోవడం: ఉమ్మడి గృహ రుణం చెల్లించడం సహ దరఖాస్తుదారులు అందరి బాధ్యత.ఈ బాధ్యత పూర్తయ్యే వరకు వీరికి ర వ్యక్తిగత రుణాలు పెద్దగా లభించవు.

ఆర్థిక సవాళ్లు: ఇవి దీర్ఘకాలిక రుణాలు. వీటి చెల్లింపులు పూర్తయ్యే సరికి దాదాపు పాతిక, ముప్పై సంవత్సరాల సమయం పడుతుంది. ఈ లోపు ఉద్యోగాలు పోవడం, ఆర్థిక మాంద్యం, ఇతర సమస్యలు ఏర్పడితే చెల్లింపు సమస్యలు ఏర్పడి ఆర్థిక పరిస్థితులు తలకిందులయ్యే ప్రమాదం ఉంది.

వివాదాలు న్యాయ సమస్యలు: ఈ రుణాల చెల్లింపునకు సంబంధించి సహ అప్లికెంట్స్ మధ్య చక్కటి సఖ్యత, సమన్వయం ఉండాలి. లేకపోతే వివాదాలు, కోర్టు కేసులు, అపోహలు తలెత్తి మానవ సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

ఆరోగ్య బీమాకు రైడర్ల బూస్ట్

ఈ రోజుల్లో కార్పొరేట్ వైద్యం చాలా ఖరీదుతో కూడిన వ్యవహారం. అందుకే ఆరోగ్య బీమా ఎంతో అవసరం. లేదంటే ఆస్తులు అర్పించుకోవాల్సిందే. ఒక్కోసారి బీమా కవరేజీ ఉన్నప్పటికీ, అదనంగా మన జేబు నుంచి ఖర్చు పెట్టాల్సి రావచ్చు. ఎందుకంటే, ఎంత సమగ్ర పాలసీ అయినా కొన్ని సందర్భాల్లో పాలసీదారు ప్రత్యేక అవసరానికి కవరేజీ కల్పించడంలో విఫలం కావచ్చు. అలాంటప్పుడే బీమా రైడర్లు పనికొస్తాయి. పాలసీ కవరేజీ లేమి లేదా అంతరాన్ని భర్తీ చేయడంతో పాటు పాలసీదారు ప్రత్యేక అవసరాలను తీర్చడం ద్వారా సంపూర్ణ రక్షణ కల్పిస్తాయి.

సమగ్ర కవరేజీ ఆవశ్యకత: వైద్య ఖర్చులు వేగంగా పెరుగుతున్న తరుణంలో వ్యక్తులు, కుటుంబాలు తమ ఆరోగ్యంతో పాటు ఆదాయాన్ని రక్షించుకోడం తప్పనిసరి. ఎందుకంటే, జీవనశైలి సమస్యలు పెరుగుతున్నాయి. ఇందుకు తోడు కొత్త వ్యాధులు ప్రబలుతున్నాయి. ఆరోగ్య బీమా కవరేజీ కలిగి ఉండటం కేవలం భవిష్యత్‌కు భద్రత మాత్రమే కాదు. మన భవిష్యత్ ఆర్థిక ప్రణాళికలోనూ అత్యవసర భాగం. అయితే, ఒకే ఆరోగ్య బీమా పాలసీ అందరి అవసరాలను తీర్చలేదు. బీమా రైడర్ల ద్వారా సమగ్ర కవరేజీ పొందవచ్చు.

రైడర్లు అంటే..: బీమా పాలసీ కవరేజీ పరిధిని మరింత విస్తరించేందుకు అదనపు ఫీచర్లు లేదా ఆఫర్ల జోడింపే రైడర్. ఇది మీ పాలసీ కవరేజీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఊహించని ఆరోగ్య అత్యయిక సందర్భాల్లోనూ మిమ్మల్ని సంసిద్ధులుగా ఉంచుతుంది. మీ ఆర్థిక భవిష్యత్ అనిశ్చితిలోకి జారుకోకుండా కాపాడుతుంది. క్యాన్సర్ వంటి పెద్ద జబ్బులు, తీవ్ర అనారోగ్యాల వైద్యానికి కవరేజీ కల్పించే క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్, యాక్సిడెంటల్ డెత్ రైడర్, ప్రసవ ఖర్చులకూ కవరేజీ కల్పించే రైడర్ ఇందుకు కొన్ని ఉదాహరణలు. వీటి ద్వారా మీ పాలసీ కవరేజీలోని అంతరాలను భర్తీ చేయవచ్చు.

బిజినెస్ ప్లస్

ప్రయోజనాలు

అదనపు కవరేజీ: బీమా రైడర్లు మీ పాలసీ కవరేజీ పరిధిని విస్తరిస్తాయి. ఉదాహరణకు, క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్ ఏదైనా పెద్ద జబ్బు చేసినప్పుడు వైద్యానికయ్యే భారీ ఖర్చుకు కవరేజీ కల్పిస్తుంది.

అవసరానికి అనుగుణంగా మార్పులు: ఆరోగ్య అవసరాలు వ్యక్తిని బట్టి మారుతుంటాయి. బీమా రైడర్లు మీ వ్యక్తిగత, ప్రత్యేక అవసరాలను తీరుస్తాయి. అలాగే, మీ కవరేజీ అవసరానికి మాత్రమే ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది.

వెసులుబాటు: మీ జీవిత దశలు, ఆర్యోగ ప్రాధాన్యాల ఆధారంగా ఆరోగ్య బీమా పాలసీ కవరేజీ కావాల్సినప్పుడు మార్చుకునే వెసులుబాటును రైడర్లు కల్పిస్తాయి.

తక్కువ ఖర్చు: ఒక్కో అవసరం కోసం ప్రత్యేక పాలసీ కొనుగోలు చేయడం కంటే రైడర్ల ఎంపిక ద్వారా అదనపు కవరేజీ పొందడం తక్కువ ఖర్చుతో కూడిన ప్రక్రియ.

ఆర్థిక భద్రత: ఊహించని వైద్య అవసరాలకూ కవరేజీ కల్పించడం ద్వారా రైడర్లు మీ ఆరోగ్యంతో పాటు ఆదాయం, ఆస్తులకూ అదనపు రక్షణ కల్పిస్తాయి.

పరిమితులు

వెయిటింగ్ పీరియడ్: చాలా వరకు బీమా రైడర్లు వెయిటింగ్ పీరియడ్‌తో కూడినవే. అంటే, పాలసీదారు రైడర్ కొనుగోలు చేసినప్పటికీ, వెయిటింగ్ పీరియడ్ ముగిసిన తర్వాతే దాని ప్రయోజనాలను పొందడానికి వీలుంటుంది.

పరిమిత పరిధి: రైడర్లు ప్రత్యేక వైద్య అవసరం లేదా సందర్భం నుంచి రక్షిస్తుంది. అంతేతప్ప అన్ని ఆపద సందర్భాల్లోనూ ఒకే రైడర్ కవరేజీ కల్పించదు.

మినహాయింపులు: రైడర్ల ద్వారానూ కొన్ని పరిస్థితులు లేదా సందర్భాల్లో కవరేజీ లభించకపోవచ్చు. అందుకే పాలసీ నియమ నిబంధనలను జాగ్రత్తగా చదివి అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

- రమిత్ గోయల్, సీడీవో
ఫ్యూచర్ జెనరాలీ ఇండియా

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	127
కరీంనగర్	120	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	93
కర్నూలు	120	నెల్లూరు	98
విశాఖపట్నం	124	అనంతపురం	98
గోదావరి	130		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ

హైదరాబాద్	390	విజయవాడ	420
వరంగల్	392	గోదావరి	395
చిత్తూరు	460	విశాఖపట్నం	415
		డజను గుడ్లు రూ. 60	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,670 ▲	87,700 ▲	1,10,000 ▲
విజయవాడ	97,300 ▲	91,500 ▲	98,200 ▲
విశాఖపట్నం	93,990 ▲	86,160 ▲	94,640 ▲
రాజమండ్రి	95,670 ▲	87,700 ▲	97,600 ▲
ప్రొద్దుటూరు	93,100 ▲	85,560 ▲	93,100 ▼
ముంబై	93,353 ▲	85,511 ▲	92,929 ▲

స్టాక్ ట్రాన్స్‌ఫర్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు!

ఇదీ GST


రాంబాబు గొండాల

వివిధ ప్రదేశాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న సంస్థలకు ముఖ్యంగా పలు ప్రాంతాల్లో బ్రాంచీలు, షోరూమ్‌లు కలిగిన సంస్థలు సరుకును ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి పంపాల్సిన సందర్భాలు చాలా పర్యాయాలు ఎదురవుతుంటాయి. అంటే గోదాము నుంచి షాప్‌కు, ఒక షాప్ నుంచి మరొక షాప్‌కు ఇలా సరుకును పంపాల్సి ఉంటుంది. దీనికి కారణాలు అనేకం. ఉదాహరణకు పెద్ద సూపర్ మార్కెట్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అమ్మే షాప్‌లు, కార్పొరేట్ మొబైల్ షోరూమ్‌లు ఇవన్నీ ఒక వేర్ హౌస్‌లో సరుకును నిల్వ చేసి అవసరాన్ని బట్టి వివిధ షోరూమ్‌లకు పంపుతాయి. అలాగే అవసరాన్ని బట్టి ఒక షోరూమ్ నుంచి మరొక షోరూమ్‌కు కూడా పంపుతాయి. దీనినే స్టాక్ ట్రాన్స్‌ఫర్ అంటారు. అంటే ఒక సంస్థకు సంబంధించిన వివిధ బ్రాంచీల మధ్య సరుకు రవాణా అవుతుంటే దానిని స్టాక్ ట్రాన్స్‌ఫర్‌గా వ్యవహరిస్తారు.

మరి ఈ స్టాక్ ట్రాన్స్‌ఫర్‌కి సంబంధించి జీఎస్‌టీ చెల్లించాలా? లేదా మినహాయింపులు ఏమైనా ఉన్నాయా? అలాగే దీనికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏవిటి? మొదలైన విషయాలు మీకోసం..

జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఒక సంస్థకు వివిధ రాష్ట్రాల్లో శాఖలు ఉంటే ప్రతి రాష్ట్రంలో విధిగా రిజిస్ట్రేషన్ తీసుకోవాలి. అలాగే, ఒక రాష్ట్రంలో వివిధ శాఖలు ఉంటే వాటన్నిటికి ఒకటే జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ సరిపోతుంది. కాకపోతే, అన్ని శాఖల వివరాలను జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఇప్పుడు ఒక రాష్ట్రంలోని ఒక గోదాము నుంచి అదే రాష్ట్రంలోని ఒక బ్రాంచీకి లేదా ఒక బ్రాంచీ నుంచి మరొక బ్రాంచీకి మధ్య స్టాక్ ట్రాన్స్‌ఫర్ జరుగుతుంటే దీనికి సంబంధించి ఎలాంటి జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే సరుకు పంపే ప్రదేశం, పొందే ప్రదేశం ఒకటే జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ కింద ఉన్నాయి. కాబట్టి. మరి అలాంటప్పుడు సరుకును ఎలా పంపాలంటే, దీనికి ఇన్వాయిస్ జారీ చేయకుండా ఒక డెలివరీ చలాన్ కింద సరుకును పంపాల్సి ఉంటుంది. కాకుంటే ఈ-వే బిల్ మాత్రం నిబంధనల ప్రకారం జారీ చేయాల్సి ఉంటుంది.

ఇకపోతే సరుకును ఒక రాష్ట్రం నుంచి ఇంకొక రాష్ట్రానికి అంటే ఒకటే యాజమాన్య సంస్థకు సంబంధించిన రెండు బ్రాంచీలకు మధ్య స్టాక్ ట్రాన్స్‌ఫర్ అవుతుంటే మాత్రం కొంత జాగ్రత్త తీసుకోవాలి. ఎందుకంటే పాన్ నంబరు ఒకటే ఉన్నప్పటికీ జీఎస్‌టీ ప్రకారం ఈ రెండు వేర్వేరు రిజిస్ట్రేషన్లు. ఇలాంటి రిజిస్ట్రేషన్స్‌ను డిస్టింక్ట్ పర్సన్స్ అంటారు. ఇలా డిస్టింక్ట్ పర్సన్స్ మధ్య స్టాక్ ట్రాన్స్‌ఫర్ జరుగుతుంటే దీనిని సరఫరా కింద భావించి అందుకు తగ్గట్టుగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. మరి ఎంత విలువ మీద పన్ను చెల్లించాలి? దీనికి సంబంధించి కొన్ని నిబంధనలు ఉన్నాయి.

మొదటగా ఈ విలువ అనేది మార్కెట్ విలువ ప్రకారం ఉండాలి. దీన్నే ఓపెన్ మార్కెట్ వాల్యూ అంటారు. అంటే సాధారణ కొనుగోలుదారులకు ఏ విలువకు అమ్ముతారో ఆ విలువ లేదా సరుకును ఏ బ్రాంచీకి అయితే అమ్ముతున్నారో ఆ బ్రాంచీ వినియోగదారులకు అమ్మే ధరలో 90 శాతం విలువను చూపించవచ్చు. ఉదాహరణకు ఒక సంస్థ తన హైదరాబాద్ బ్రాంచీ నుంచి తమ విజయవాడ బ్రాంచీకి కొన్ని మొబైల్ ఫోన్లు స్టాక్ ట్రాన్స్‌ఫర్ చేస్తుందనుకుందాం. దీని సాధారణ మార్కెట్ విలువ రూ.28,000 అనుకుంటే ఇన్వాయిస్‌లో విలువ రూ.28,000 చూపించవచ్చు. లేదా ఈ మొబైల్‌ను విజయవాడ బ్రాంచీలో కొనుగోలుదారులకు రూ.30,000 అమ్ముతున్నారనుకుంటే దానిలో 90 శాతం అంటే రూ.27,000 చూపించవచ్చు. దీని మీద కట్టిన పన్నును విజయవాడ బ్రాంచీ నిబంధనలు అనుసరించి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద తీసుకోవచ్చు.

ఈ నిబంధనలతో సంబంధం లేకుండా ఇంకొక ఆప్షన్ కూడా అందుబాటులో ఉంది. అదేమిటంటే, సరఫరా పొందే శాఖ అంటే ఈ ఉదాహరణలో విజయవాడ బ్రాంచీకి స్టాక్ ట్రాన్స్‌ఫర్ చేసే సరుకు మీద పూర్తి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకోవటానికి అర్హత ఉన్నట్లయితే అప్పుడు ఇన్వాయిస్‌లో ఏ విలువ అయినా చూపించవచ్చు. ఎందుకంటే, ఎంత విలువ చూపినా, ఎలాగూ ఆ మొత్తం మీద క్రెడిట్ తీసుకోవచ్చు కాబట్టి.

ఒక్కొక్కసారి ఒకే రాష్ట్రంలో కూడా ఒకటి కంటే ఎక్కువ రిజిస్ట్రేషన్ ఉండవచ్చు. అలాంటప్పుడు కూడా స్టాక్ ట్రాన్స్‌ఫర్ మీద పన్ను చెల్లించాలి. సింపుల్‌గా చెప్పాలంటే ఒకటే రిజిస్ట్రేషన్ మధ్య జరిగే స్టాక్ ట్రాన్స్‌ఫర్‌కు ఎలాంటి పన్నులు వర్తించవు. అలాకాకుండా స్టాక్ ట్రాన్స్‌ఫర్ రెండు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ల మధ్య జరిగినప్పుడు తప్పకుండా పన్ను చెల్లించాలి. ఈ రెండు సందర్భాల్లోనూ ఈ-వే బిల్లును నిబంధనల ప్రకారం జారీ చేయాల్సి ఉంటుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

జమిలి ఎన్నికలతోనే సుస్థిర పాలన

- కొందరు ఎందుకు వ్యతిరేకిస్తున్నారో అర్థం కావడంలేదు
- 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' సదస్సులో వెంకయ్యనాయుడు



తిరుపతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల పాటు ఏదో ఒక ఎన్నికల గురించి వ్యూహాలు పన్నుకుంటూ, ఎన్నికల మూడ్‌లోనే ఉంటే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది. ఒకసారి గెలిస్తే ఐదేళ్ల స్థిరంగా ఉండి, అభివృద్ధి చేస్తామన్న భరోసా కూడా రాజకీయ పార్టీలకు వస్తుంది. అప్పుడే గట్టి నిర్ణయాలు తీసుకోగలుగుతారు. జమిలి ఎన్నికలతోనే ఇది సాధ్యమవుతుంది' అని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రాముఖ్యత, సవాళ్లు, ప్రభావం వంటి అంశాలపై శనివారం తిరుపతిలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జమిలి ఎన్నికల గురించి సుదీర్ఘంగా ప్రసంగించారు. ఏకకాల ఎన్నికలు మనకు కొత్తేమీ కాదన్నారు. 1952, 1957, 1962, 1967 సంవత్సరాల్లో పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయని గుర్తుచేశారు. ప్రస్తుతం రాజకీయ కారణాల వల్లే కొన్ని పార్టీలు జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నాయన్నారు. సగటు భారతీయ ఓటరు తెలివి, వివేచనను తక్కువ అంచనా వేయవద్దని పార్టీలకు విజ్ఞప్తి చేశారు. జమిలి ఎన్నికలతో సమయం మిగులుతుందని, ఖర్చు తగ్గుతుందని, మిగిలిన నిధులను సంక్షేమం, అభివృద్ధికి వినియోగించవచ్చని చెప్పారు. కాగా, పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని పూర్తిగా మార్చాలని వెంకయ్య కోరారు. ఏ పార్టీ తరఫున ఎన్నికయ్యారో ఆ పార్టీ నచ్చకపోతే పదవికి కూడా రాజీనామా చేసేలా చట్ట సవరణ చేయాలన్నారు. విద్య, వైద్య సౌకర్యాలు మినహా ఏది ఉచితంగా ఇస్తామని చెప్పినా, ఎవరు చెప్పినా అది అనుచితమేనని అన్నారు.

సవతి తల్లి మీది.. తెలంగాణ తల్లి మాది: కవిత

మనోహరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): 'సవతి తల్లి మీది.. తెలంగాణ తల్లి మాది' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. శనివారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కూచారంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రకు ముఖ్య అతిథులుగా కవితతో పాటు ఎమ్మెల్సీ యాదవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని కోదండరామ చంద్రస్వామి ఆలయంలో సీతారాములను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మళ్లీఅధికారంలోకి వస్తుందని, అప్పుడు మళ్లీ తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు కవితకు వినతిపత్రం అందజేశారు.

బీసీలకు మేలు చేస్తే అండగా ఉంటాం: జాజుల

పంజాగుట్ట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీసీలకు మేలు చేసే ప్రభుత్వమైనా, పార్టీలైనా.. వారికి తాము అండగా ఉంటామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీలను రాజకీయంగా వాడుకుని మోసం చేయాలని చూస్తే మాత్రం ఎవరినీ వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాల నిర్వహణ కమిటీ చైర్మన్ చిన్నశ్రీశైలం యాదవ్, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. జ్యోతిబాపూలే విగ్రహాన్ని హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని లేక్‌వ్యూ పార్కులో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో పూలే విగ్రహాన్ని నెలకొల్పాలని మూడు దశాబ్దాలుగా ప్రభుత్వాలపై పోరాటం చేశామని, ఇందుకు ఆయా ప్రభుత్వాలు హామీలు ఇచ్చాయి కానీ అమలు చేయలేదన్నారు.

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు ఉద్యోగుల బదిలీలు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్లలో నిర్మిస్తున్న 4,000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి(వైటీపీఎస్) భారీ సంఖ్యలో విద్యుత్ ఇంజనీర్లు, సిబ్బందిని తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (టీజీజెన్‌కో) బదిలీ చేసింది. ఇద్దరు సూపరింటెండింగ్ ఇంజనీర్లు (ఎస్ఈ), ఒక డీఈ, 29 మంది ఏడీఈలు, 60 మంది ప్లాంట్ అటెండెంట్లు, 30 మంది జూనియర్ ప్లాంట్ అటెండెంట్లకు థర్మల్ విద్యుత్ కేంద్రంలో పోస్టింగ్ ఇస్తూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. వీరితో పాటు గత ఏడాది జూన్ 4న మూసివేసిన రామగుండం థర్మల్-బీ విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న 28 మంది ఫోర్‌మన్లు, 30 మంది ప్లాంట్ అటెండెంట్లు, 14 మంది జూనియర్ ప్లాంట్ అటెండెంట్లకు కూడా పోస్టింగ్ ఇచ్చారు. బదిలీ అయిన వారిలో రామగుండం థర్మల్-బీ విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న ఒక ఎస్ఈ, డీఈ, 11 మంది ఏడీఈలు కూడా ఉన్నారు.

యాలాలలో నకిలీ విత్తన ముఠా గుట్టురట్టు

తాండూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అమాయక రైతులకు నకిలీ విత్తనాలతో టోకరా వేసి, లాభాలు గడించేందుకు ప్రయత్నించిన ముఠా గుట్టురట్టయింది. ముఠా సభ్యుల్లో ఏపీలోని అన్నమయ్య జిల్లా అంగళ్ల వాసి నన్నపునేని శివ నాగేశ్వర్‌రావు, గుంటూరు జిల్లా చేగ్రోలు వాసి దాసరి శ్రీనివాసరావులను పోలీసులు అరెస్ట్ చేయగా, అన్నమయ్య జిల్లా కొత్తకోట నివాసి నారాయణరెడ్డి పారిపోయాడు. వీరు తీసుకొచ్చిన పత్తి విత్తన ప్యాకెట్లను పరిశీలించిన రైతులు.. వాటిపై తయారీ తేదీ, బ్యాచ్ నంబర్లు సహా ఏ లేబుల్ లేకపోవడంతో అనుమానంతో అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో శనివారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో వికారాబాద్ జిల్లా యాలాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బగాయిపల్లి చౌరస్తా వద్ద ప్లాస్టిక్ సంచులతో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను రంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా, కరన్‌కోట్ సీఐ నగేశ్‌తోపాటు వ్యవసాయాధికారులు ప్రశ్నించారు. వారిని తనిఖీ చేయగా 75 సంచుల్లో రూ.44 లక్షల విలువైన 22 క్వింటాళ్ల పత్తి విత్తనాలు దొరికాయని, వాటిని చేశామని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి మీడియాకు చెప్పారు. వీటిని పరిశీలించిన వ్యవసాయ అధికారి శ్వేతరాణి.. అవి నకిలీ విత్తనాలని నిర్ధారించారు.

ఏఐ, సోషల్ మీడియాపై త్వరలో వర్క్‌షాప్

- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

బర్కత్‌పుర, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), సోషల్ మీడియాపై త్వరలో హైదరాబాద్‌లో జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సీఈటీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నసీమ్ ఆర్ఫీ ఉర్దూ మీడియా అవార్డ్స్ 2025ను ఆయన ప్రదానం చేశారు. డాక్టర్ రుషి దాషహీన్(న్యూఢిల్లీ), మహ్మద్ ఆర్షద్(హైదరాబాద్), సయ్యద్ సజ్జదుల్ హుస్సేన్(హైదరాబాద్), జాకీరియా మధుబాని(బిహార్), కుర్బాన్ అలీ(న్యూఢిల్లీ)లకు అవార్డులను ప్రదానం చేశారు. ఆంగ్లభాష మోజులో ప్రాంతీయ భాషలను విస్మరిస్తున్నారని, ఇది అత్యంత ప్రమాదకరమని శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ భాషలను పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విరాహత్ అలీ, రాం నారాయణ, ఎం.మాజీద్ పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పకుంటే క్రిమినల్ కేసులు పెడతాం

- బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డికి టీజీపీఎస్సీ నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్ష ఫలితాలపై చేసిన నిరాధార, అసత్య ఆరోపణలపై వెంటనే బేషరతుగా లిఖితపూర్వక క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డికి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నోటీసులు పంపింది. 'రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. గ్రూప్-1 ఫలితాలపై ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ఆరోపణలను ఉపసంహరించుకుని వారంలోపు క్షమాపణలు చెప్పాలి. లేనిపక్షంలో టీజీపీఎస్సీ పరువుకు భంగం కలిగించినందుకు పరువు నష్టం దావా వేస్తాం. క్రిమినల్ కేసులు పెడతాం' అని కమిషన్ అదనపు కార్యదర్శి ఆర్.సుమతి నోటీసులో హెచ్చరించారు. కాగా, నిరుద్యోగుల పక్షాన వాస్తవాలు చెబితే పరువునష్టం నోటీసులు పంపిస్తారా.. అని మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

21 తర్వాత ఇంటర్ ఫలితాల విడుదల

- మూల్యాంకనం పూర్తి
- తొలిసారిగా ఫెయిలైనవారి సమాధాన పత్రాల 'రీవాల్యుయేషన్'

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21 తర్వాత ఇంటర్ ఫలితాలను విడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. గత నెల 5 నుంచి 25 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు నిర్వహించగా.. రాష్ట్రవ్యాప్తంగా 9,96,971 మంది హాజరయ్యారు. జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ నెల రోజుల క్రితమే ప్రారంభమై ఇటీవలే ముగిసింది. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఫెయిలైన విద్యార్థుల సమాధాన పత్రాలను రెండోసారి (రీవాల్యుయేషన్) పరిశీలిస్తున్నారు. ఇంటర్ విద్య సంచాలకుడు కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను ఈ నెల 11న ప్రారంభించారు. సాధారణంగా ఫలితాలు విడుదల తర్వాత ఫెయిలైన విద్యార్థులు పునర్‌మూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకుంటారు. ఇందుకు ఇంటర్ బోర్డు పేపరుకు రూ.600 చొప్పున వసూలు చేస్తుంది. అయితే దీనికిముందే ఈ ప్రక్రియను ఇంటర్ బోర్డు ఈసారి స్వచ్ఛందంగా చేపట్టింది. మూల్యాంకనంలో చిన్నపాటి తప్పిదాలతో ఏ ఒక్క విద్యార్థికీ అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతో ఈ ప్రక్రియ చేపట్టింది.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు షరతులతో గ్రీన్‌సిగ్నల్

27న మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకే అనుమతి

వరంగల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సమీపాన బీఆర్ఎస్ నిర్వహించ తలపెట్టిన రజతోత్సవ సభకు వరంగల్ పోలీసులు అనుమతి ఇచ్చారు. శనివారం రాత్రి బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీష్‌లకు కాజీపేట ఏసీపీ తిరుమల్ పలు షరతులతో కూడిన అనుమతిని లేఖను అందించారు. 27వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సభ నిర్వహణకు అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే సభలో సీసీటీవీ కెమెరాలు, బారికేడ్లు, సరిపడా పబ్లిక్ గ్యాలరీలు కల్పించాలని పేర్కొన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, తదితర వసతులు కల్పించాలని ఆ ఆదేశాల్లో పోలీసులు పేర్కొన్నారు.

బీసీ బిల్లులపై 3 నెలల్లో నిర్ణయం!

గవర్నర్ పంపిన రెండు బిల్లులపై రాష్ట్రపతి ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం!

- తెలంగాణ పెండింగ్ బిల్లులపై.. సుప్రీంకోర్టు తాజా తీర్పు ప్రభావం
- ఆమోదించకపోతే కారణాలు చెప్పాలి
- రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని ఇప్పటికే తీర్పు
- రాష్ట్రపతి న్యాయ సలహా కోరే చాన్స్!

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన రెండు బీసీ బిల్లులపై రాష్ట్రపతి (కేంద్ర ప్రభుత్వం) నుంచి మూడు నెలల్లో ఏదో ఒక నిర్ణయం వెలువడే అవకాశం కనిపిస్తోంది. ఆయా రాష్ట్రాల గవర్నర్‌లు పంపే బిల్లులపై రాష్ట్రపతి గరిష్ఠంగా మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాల్సిందేనంటూ తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు తాజాగా తీర్పు ఇవ్వడమే ఇందుకు కారణం. మూడు నెలల్లో ఏదో ఒక నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాకపోతే.. అందుకు కారణాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్రపతి పంపిన ప్రశ్నలకు సమాధానం చెప్పే విషయంలో సహకారం అందించాలని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. ఒకవేళ సదరు బిల్లు రాజ్యాంగ విరుద్ధమని రాష్ట్రపతి భావిస్తే.. దానిని సుప్రీంకోర్టు న్యాయ సలహాకు కూడా పంపించవచ్చు. కాగా, ఈ తీర్పు ప్రభావం తెలంగాణ రాష్ట్ర బిల్లులపై కూడా ఉంటుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన రెండు బీసీ బిల్లులను గవర్నర్ ఇటీవలే రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన నేపథ్యంలో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటుతున్నాయి. బీసీలకు 42 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం కలిపి మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి చేరుకుంటున్నాయి. కానీ, మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టంగా తీర్పు ఇచ్చింది. దీంతో బీసీ రిజర్వేషన్ల బిల్లులు సుదీర్ఘకాలంపాటు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంటాయని, వాటికి ఆమోదం లభిస్తుందా? లేదా? అనే అభిప్రాయం సర్వత్రా నెలకొంది. అయితే సుప్రీంకోర్టు తాజా తీర్పు నేపథ్యంలో తెలంగాణ బీసీ బిల్లులపై ఏదో ఒక నిర్ణయం వెలువరించాల్సిన పరిస్థితి కేంద్ర ప్రభుత్వానికి ఏర్పడింది.

రాష్ట్రపతి నిర్ణయం తీసుకోకపోతే మళ్లీ సుప్రీంకు!

బీసీ బిల్లులపై రాష్ట్రపతి ఒకవేళ నిర్ణయం తీసుకోకపోతే.. ఎందుకు ఆలస్యమవుతుందో కారణాలను రాష్ట్ర ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా పంపించాలి. రాష్ట్రపతి పంపిన అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చి సహకరించాలి. రాష్ట్రపతి తన వద్ద ఉన్న బిల్లులను ఆమోదించడం, తిప్పిపంపడం, లేదంటే కొన్ని అంశాలపై లిఖితపూర్వకంగా వివరణ అడగడం, లేకుంటే రాజ్యాంగబద్ధత ఉందా? అని సుప్రీంకోర్టుకు లేఖ రాయడం.. వీటిలో ఏదో ఒకటి చేయాల్సి ఉంటుంది. కానీ, ఇందులో ఏదీ చేయకపోతే.. తమ బిల్లులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా రాష్ట్రపతి పెండింగ్‌లో పెట్టారంటూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంటుంది. అయితే రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదన్న సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు ఉన్నాయి. వీటిపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్రపతి ఎదుట పలు అవకాశాలున్నాయి. అందులో ఒకటి.. తెలంగాణ గవర్నర్ పంపిన బిల్లులను తిప్పి పంపవచ్చు. లేదా అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్ వంటి న్యాయకోవిదుల సలహా తీసుకోవచ్చు. రిజర్వేషన్లు 50 శాతం దాటరాదన్న అంశం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పవచ్చు.



సుప్రీం తీర్పుతో బీసీలకు ఎంతో మేలు: పొన్నం

రాష్ట్రపతి తన వద్దకు వచ్చిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణకు, రాష్ట్రంలోని బీసీ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు నిర్దిష్ట కాలపరిమితిలోపు గవర్నర్లు, రాష్ట్రపతి కూడా ఆమోదం తెలపాలని సుప్రీంకోర్టు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్ర చట్టసభలు ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి కూడా ఆమోదించాల్సిందేనని తెలిపారు.

3 నెలల్లో నిర్ణయం తీసుకోవాల్సిందే



రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 ప్రకారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుంది. రాష్ట్ర గవర్నర్ పంపిన బీసీ బిల్లులపై సైతం రాష్ట్రపతి మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నట్లు బీసీ బిల్లులను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చినా.. న్యాయసమీక్షకు నిలబడతాయనే గ్యారెంటీ లేదు. రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధంగా ఉంటే తొమ్మిదో షెడ్యూల్‌లో ఉన్నా సరే వాటిపై న్యాయసమీక్ష చేయవచ్చునని 'ఐఆర్, కొహెలో' కేసులో సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొంది. అందుకే తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టినంత మాత్రాన తెలంగాణ రాష్ట్రంలో రిజర్వేషన్లు 67శాతం అమలవుతాయని చెప్పలేం. తమిళనాడు 69 శాతం రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టినా సుప్రీంలో పిటిషన్‌లు దాఖలయ్యాయి. అవి పెండింగ్‌లో ఉన్నాయి.

\- కె.రామకృష్ణారెడ్డి, మాజీ అడ్వకేట్ జనరల్

రాష్ట్రపతి సుప్రీంకోర్టు అభిప్రాయం కోరవచ్చు



సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ గవర్నర్ పంపిన బీసీ బిల్లులపై ఏం చేయాలనే దానిపై రాష్ట్రపతి.. అటార్నీ జనరల్ అభిప్రాయం కోరవచ్చు. మరోవైపు రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి నేరుగా సుప్రీంకోర్టు సలహా కూడా కోరవచ్చు. 'ఇందిరా సహానీ' కేసులో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని సుప్రీంకోర్టు నిర్దేశించింది. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరే అవకాశం ఉంది.

\- బి.శివానంద ప్రసాద్, మాజీ అడ్వకేట్ జనరల్

టెట్రా ప్యాకెట్లలో మద్యం!

ఫ్రూట్ జ్యూస్ తరహాలో 60, 90, 180 ఎంఎల్ ప్యాకెట్లు

మద్యం సీసా కంటే వీటి ధర తక్కువే

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక తరహాలో రాష్ట్రంలో టెట్రా ప్యాకెట్లలో మద్యం అందుబాటులోకి రానుంది. ఫ్రూట్ జ్యూస్ తరహాలో మద్యం ప్యాకెట్లను జేబులో పెట్టుకుని తీసుకెళ్లేలా 60 ఎంఎల్, 90 ఎంఎల్, 180 ఎంఎల్‌ల ప్యాకెట్లను అమ్మడానికి సిద్ధం చేస్తున్నారు. సీసాలో దొరుకుతున్న మద్యం కంటే.. టెట్రా ప్యాకెట్లలో తక్కువ ధరకు లభించనుంది. రాష్ట్రంలో ఇప్పుడు క్వార్టర్ చీప్ లిక్కర్ ధర రూ.120గా ఉంది. అదే మద్యం టెట్రా ప్యాకెట్లలోకి మారితే రూ.100లకు లభించే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సంబంధిత ప్రతిపాదనలను ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వ ఆమోదం తర్వాత రాష్ట్రంలో టెట్రా ప్యాకెట్లలో మద్యం విక్రయాలు జరగనున్నాయి. రాష్ట్రంలో 2620 వైన్ షాపులు, 1117 వరకు బార్లున్నాయి. వీటికి దేశ విదేశాలకు చెందిన 55 కంపెనీల ద్వారా మద్యం సరఫరా అవుతుంది. కర్ణాటకలో మెక్‌డొవెల్స్ నంబర్ వన్ అనే కంపెనీ 90శాతం టెట్రా ప్యాకెట్లలో విక్రయాలు జరుపుతోంది. అదే విధానాన్ని రాష్ట్రంలో విక్రయించడానికి ముందుకొచ్చింది. క్వార్టర్ సీసాల్లో విక్రయాలు తగ్గడం, ప్యాకెట్ల విధానం కొత్తగా తీసుకరావడం వల్ల అమ్మకాలు పెంచుకోవచ్చుననే ఉద్దేశంతో ఇప్పటికే ఆ కంపెనీ ప్రతినిధులు రెండుసార్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులను సంప్రదించారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న క్వార్టర్ బాటిల్స్ స్థానంలో టెట్రా ప్యాకెట్లను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. దీని వల్ల ఖర్చు తగ్గడంతో పాటు ప్రభుత్వానికి, వినియోగదారుడు, కంపెనీకు కలిగే ప్రయోజనాల గురించి ఆ శాఖ అధికారులతో చర్చించారు. ఈ అమ్మకాలపై ప్రజల్లో స్పందన ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి అవసరమైతే.. కర్ణాటక సరిహద్దులోని మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా విక్రయించుకోవడానికి అవకాశం ఇవ్వండనే విషయం కూడా చర్చకు వచ్చింది.

కల్తీకి అవకాశం?

సీసాల్లో మాదిరిగా మూతలు తీసి కల్తీ చేసే అవకాశం టెట్రా ప్యాకెట్లలో ఉండదని, జేబులో పెట్టుకుని తీసుకెళ్లే విధంగా ఉంటుందని మద్యం కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. అయితే ప్యాకెట్లలో లభించే మద్యం కల్తీ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టెట్రా ప్యాకెట్‌కు వేసే సీల్ మద్యం కల్తీ కాకుండా ఆపగలుగుతుందా? ప్యాకెట్ మందం ఎంత? వంటి విషయాలపై స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. గతంలో మహారాష్ట్ర తరహాలో ప్లాస్టిక్ సీసాల్లో మద్యం విక్రయాలు చేయగా.. వాటికి సులువుగా సిరంజీల ద్వారా కల్తీ చేసేవాళ్లు. ప్యాకెట్లలో మద్యం వస్తే.. అదే విధంగా కల్తీకి అవకాశం ఉంటుందని అంటున్నారు.

వేములవాడలో తాత్కాలిక దర్శనాలు ఎలా?

- భీమన్న గుడి అనువేనా? కాదా?
- ఎల్లుండి ఉన్నతాధికారుల పరిశీలన

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వం.. ఆ పనులను ప్రారంభించేందుకు అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా భక్తులకు తాత్కాలిక దర్శన ఏర్పాట్లను ఎక్కడ చేయాలనే అంశంపై కసరత్తు చేస్తోంది. ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో భీమేశ్వరస్వామి గుడిలో దర్శనాలను ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే అంశంపై యోచిస్తోంది. ఈ విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నేతృత్వంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం క్షేత్రంలో పర్యటించనున్నారు. అభిషేక పూజల మండపం, నిత్య కల్యాణ మండపం వంటి వాటికి షెడ్ల నిర్మాణాలు ఎటువైపు ఏర్పాటు చేస్తే బాగుంటుందనే విషయంలో పరిశీలన చేయనున్నారు. ఒకవేళ భీమేశ్వరాలయం దర్శనాలకు అనువుగా లేకపోతే అందుబాటులోనే మరో చోటును చూడనున్నారు. కాగా, అభివృద్ధి పనులు ప్రారంభమైనా రాజరాజేశ్వర స్వామి ఆలయంలోని మూలవిరాట్టుకు జరిగే నిత్య పూజల్లో ఎలాంటి మార్పు ఉండదు. అయితే, ప్రధాన ఆలయంలోకి భక్తులను అనుమతించరు.

సలేశ్వరానికి పోటెత్తిన భక్తులు



అచ్చంపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నల్లమల అభయారణ్యంలో వెయ్యి అడుగుల లోయలో కొలువైన లింగమయ్యస్వామి దర్శనం కోసం రెండోరోజైన శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. చైత్ర పౌర్ణమి కావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని దట్టమైన అభయారణ్యంలో వెలసిన లింగమయ్యను దర్శించుకునేందుకు అటవీశాఖ అధికారులు మూడు రోజులు అనుమతి ఇచ్చారు. దీంతో భక్తులు వ్యయప్రయాసలకు ఓర్చుకుంటూ సాహసమే చేస్తున్నారు. వేలాదిగా వస్తున్న భక్తులతో అభయారణ్యం జనసంద్రంగా మారింది. లింగమయ్య కొలువైన లోయ కిటకిటలాడింది. సలేశ్వరం వెళ్లేదారులు మొత్తం ట్రాఫిక్‌జామ్ కావడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. స్వామివారి దర్శనం కోసం 6 నుంచి 8 గంటల సమయం పడుతోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 300 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. భక్తుల కోసం స్వచ్ఛంద సంస్థలు పండ్లు, అన్నప్రసాదాలు అందజేస్తున్నారు.

కంచ గచ్చిబౌలి భూములపై తలోమాట

- అమ్ముకున్నారా.. తాకట్టు పెట్టారా? చెప్పండి
- వాటిపై ప్రభుత్వం చూపిస్తున్న పత్రాలు నకిలీ
- ఆ భూముల్లో రూ.10 వేల కోట్ల అవినీతి నిజం: కేటీఆర్



కరీంనగర్ టౌన్/ హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని తాకట్టుపెట్టినట్లు టీపీసీసీ అధ్యక్షుడు చెబుతుంటే, తాకట్టు పెట్టలేదని మంత్రులు, ముఖ్యమంత్రి చెబుతున్నారని, అందరూ ఒక గదిలో కూర్చుని అసలు అమ్ముకున్నారో, కుదవ పెట్టారో చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ భూవివాదం దేశంలోనే అది పెద్ద మోసం అని ఆరోపించారు. ఈ భూమిని ఎవరు కొన్నా 2028లో అధికారంలోకి వచ్చిన తర్వాత అంగుళం కూడా వదిలిపెట్టకుండా తీసుకుంటామని, గ్రీన్ జోన్ చేస్తామన్నారు. శనివారం కరీంనగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జిలతో కలిసి కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న పత్రాలు నకిలీవని, ఎందుకంటే సీఎం రేవంత్ రెడ్డి కూడా నకిలీ వ్యక్తి అని, అనేక అంశాలపై పదే పదే మాట మార్చే మనిషి అని వ్యాఖ్యానించారు. టీకాన్ అనే సంస్థకు భూములు కుదువపెట్టారని, ఆ పత్రాలను బయటపెట్టానని, అవి అవాస్తవమైతే ప్రభుత్వం తేల్చాలన్నారు. రూ.10 వేల కోట్ల రుణానికి రూ.170 కోట్ల కమీషన్ ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీ ముంబై బ్రోకర్ సంస్థను తీసుకుని రాగా... దాని సాయంతో ప్రభుత్వం డబ్బులు తెచ్చుకుందన్నారు. దీనికి బదులుగా ప్రభుత్వం బీజేపీ ఎంపీకి సహాయం చేస్తోందని ఆరోపించారు. ఆ సహాయం బీజేపీ ఎంపీకి చేరగానే ఆయన పేరును, ఆయనకు పొందిన లాభాన్ని, ఆయనతో ముఖ్యమంత్రికి ఉన్న పాత దందాలను కూడా బయటపెడతానన్నారు. 15 నెలలుగా రేవంత్ రెడ్డిని బీజేపీ అన్ని రకాలుగా కాపాడుతోందన్నారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్... రేవంత్ రెడ్డికి అండగా నిలబడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటి కాకుంటే దీనిపై ఆర్‌బీఐ, సెబీ వంటి సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా అప్పటి గవర్నర్ పలు విషయాల్లో జోక్యం చేసుకుని ఇబ్బందులకు గురిచేశారని, కాంగ్రెస్ పాలనలో ఇంత అవినీతి జరుగుతున్నా గవర్నర్ పత్తా లేరన్నారు.

రేవంత్‌కు మాటలెక్కువ చేతలు తక్కువ: హరీశ్



చిన్నకోడూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పంటలకు బీమా చేయిస్తామని చెప్పి మాటతప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి తీవ్ర అన్యాయం చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డికి మాటలు ఎక్కువ చేతలు తక్కువ అని విమర్శించారు. శనివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో పలు గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తమకు రైతుబంధు డబ్బు పడలేదని, రుణమాఫీ కాలేదని, అకాల వర్షంతో నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు గోడును వెళ్లబోసుకున్నారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు ఇచ్చేదాక పోరాడుతామని చెప్పారు. ఏ రైతును అడిగిన రుణమాఫీ కాలేదని చెప్తున్నారని, కేవలం 40% రుణమాఫీ అయిందని, ఇంకా 60% కాలేదన్నారు. రైతు బంధు సగం మంది కూడా పడలేదని, ఈ ప్రభుత్వం రైతులకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి వనజీవి రామయ్య మృతి పట్ల సంతాపం ప్రకటించడం హంతకుడే సంతాపం తెలిపినట్లు ఉందని విమర్శించారు. చెట్లు నరుకుడు సీఎం రేవంత్ రెడ్డి వంతు, చెట్లు పెట్టుడు రామయ్య వంతని వ్యాఖ్యానించారు. అలాంటి ముఖ్యమంత్రికి వనజీవి రామయ్యకు సంతాపం తెలిపే హక్కులేదన్నారు. హార్టికల్చర్ వర్సిటీలో 100 ఎకరాల్లో, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 150 ఎకరాల్లో చెట్లను నరికారని, చెట్ల రక్షణ గురించి సీఎం పట్టించుకోవడం లేదన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య మృతి పట్ల బీఆర్ఎస్ తరఫున హరీశ్‌రావు తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చారు.

ఆస్పత్రుల్లో తాగునీటికి ఇబ్బంది రావొద్దు

» ఫ్యాన్లు, ఏసీలు ఏర్పాటు చేసుకోవాలి: దామోదర



హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లు, వారి అటెండెంట్లకు, సిబ్బందికి తాగునీరు అందుబాటులో ఉంచాలని ఉన్నతాధికారులను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఆస్పత్రుల ఆవరణల్లో అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో తాగునీటి సౌకర్యం, ఇతర అంశాలపై మంత్రి శనివారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నందున అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐసీయూలు, అవసరమైన ఇతర వార్డుల్లో ఏసీలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, ఈ నేపథ్యంలో ఆస్పత్రుల్లో పవర్ కేబుళ్లను సరిచూసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రుల లోపల, బయట గుట్కా నమలడం, పొగ తాగడం, మద్యపానం సేవించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని ఆదేశించారు. వడ దెబ్బ నివారణ కోసం తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఆరా తీశారు. వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆయన సుచించారు.

ప్రజల అభిప్రాయం మేరకే పథకాలు: సీతక్క

» ఆదివాసీలతో కలిసి సన్నబియ్యంతో భోజనం



ములుగు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల అభిప్రాయం మేరకే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. తిండి విషయంలో పేద, ధనిక తేడాలు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ములుగు జిల్లాలో మంత్రి శనివారం పర్యటించారు. ములుగు మండలంలోని పలు గ్రామాలలో రూ.33కోట్లతో చేపట్టిన రోడ్లు, డ్రెయినేజీ, గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణ పనులను ప్రారంభించారు. అకాల వర్షాలకు పంటలు, ఇళ్లు దెబ్బతిని నష్టపోయిన గోవిందరావుపేట మండలంలోని రైతులకు నిత్యావసరాలు, కుటుంబానికి రూ.2,500 చొప్పున సాయం అందజేశారు. తాడ్వాయి మండలంలోని మొండెలతోగు గొత్తికోయగూడెంలో ఆదివాసీలు, విద్యార్థులతో కలిసి సన్నబియ్యంతో భోజనం చేశారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామని ఆమె తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో తల్లీ కుమార్తె మృతి

» రక్తపుమడుగులో కుమార్తె.. ఉరి వేసుకున్న స్థితిలో తల్లి

» నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఘటన



రాజేశ్వరి, వేదసాయిశ్రీ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శనివారం తల్లి, కుమార్తె అనుమానాస్పద స్థితిలో మరణించారు. కుమార్తె గొంతుపై కత్తి గాయాలతో రక్తమడుగులో పడి ఉండగా, తల్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతున్న స్థితిలో గుర్తించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా మాచర్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన గుర్రం సీతారాంరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి మిర్యాలగూడలోని హౌసింగ్ బోర్డు కాలనీలో 15 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. ఆగ్రో కెమికల్స్ సంస్థలో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం విధుల్లో భాగంగా హైదరాబాద్‌కు వెళ్లాడు. శనివారం సాయంత్రం ఇంటికి చేరుకుని తలుపు తట్టాడు. ఇంట్లోని ఓ గదిలో అపస్మారక స్థితిలో ఉన్న తనపెద్ద కుమార్తె మధులత స్పృహలోకి వచ్చి తలుపు తెరచింది. మరో గదిలో తన భార్య రాజేశ్వరి (40) ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతుండగా, కుమార్తె వేదసాయిశ్రీ (12) గాయాలతో రక్తపుమడుగులో నిర్జీవంగా ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తల్లి, కూతురి మృతి పలు అనుమానాలకు తావిస్తోంది. రాజేశ్వరి తన చిన్నకూతుర్ని హత్య చేసి, తాను ఆత్మహత్యకు పాల్పడిందా? లేదా ఎవరైనా హత్య చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజేశ్వరి ఎడమచేతిపై కత్తి గాయాలు ఉన్నట్లు గుర్తించామని డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

విద్య, వైద్య రంగాలకు ఎక్కువ నిధులు కేటాయించాలి

» అప్పులను మూలధన వ్యయం కింద వినియోగించాలి

» 'తెలంగాణ ప్రగతి-బడ్జెట్25-26' సమావేశంలో వక్తలు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రాభివృద్ధి విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఒక కనీస ఉమ్మడి కార్యక్రమానికి (కామన్ మినిమమ్ ప్రోగ్రామ్) కట్టుబడి ఉండాలి. రాష్ట్ర బడ్జెట్‌లలో విద్య, వైద్య రంగాలకు అధిక నిధులు కేటాయించాలి. తెచ్చిన అప్పులను మూలధన వ్యయాల కింద మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలి' అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. 'తెలంగాణ ఆర్థిక ప్రగతి- బడ్జెట్ 2025-26' అనే అంశంపై శనివారం తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమితి కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ పదేళ్లకాలంలో రూ.3-4 లక్షల కోట్ల అప్పులు తెచ్చినా రూ.30 లక్షల కోట్ల ఆస్తులు సృష్టించిందని, ఈ అప్పులను మూలధన వ్యయం కింద ఖర్చు చేశామన్నారు. రాష్ట్ర వృద్ధి రేటులో స్తబ్ధత నెలకొందని, రియల్ ఎస్టేట్ రంగం పడిపోవడం, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ఆదాయంలో తగ్గుదల వంటివి ఇందుకు కారణాలన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ... రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ప్రాధమ్యాల ఆధారంగా ప్రభుత్వం నిధులు కేటాయించి, ఖర్చుచేస్తోందన్నారు. రాష్ట్రంలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.48 వేల కోట్లు రైతుల సంక్షేమం కోసం ఖర్చు చేశామని.. 58,868 పోస్టులను భర్తీ చేశామని, మరో 30 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేసినట్టు తెలిపారు. తమ ప్రభుత్వం ప్రతి బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యమిస్తోందన్నారు. సీపీఎం నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలకు ఎక్కువ నిధులు కేటాయించాలన్నారు. బడ్జెట్‌లో మూలధన వ్యయం 30-40 శాతం మేర ఉండాలని, కానీ 10-12శాతానికి మించడం లేదని బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేత దేవిప్రసాద్ మాట్లాడుతూ... 2024లో 9 వేల మంది ఉద్యోగులు రిటైర్ కాగా 2025లో మరో 9 వేల మంది రిటైర్ కాబోతున్నారని, వీరందరికీ రూ.20 వేల కోట్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగులకు ఐదు డీఏలు రావాల్సి ఉందని, దేశంలోని ఏ రాష్ట్రంలోనూ డీఏలు పెండింగ్‌లో లేవని చెప్పారు. రాజకీయ, సామాజిక విశ్లేషకులు డి.పాపారావు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి విషయంలో అన్ని రాజకీయ పార్టీలకు ఒక కనీస ఉమ్మడి కార్యక్రమం ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ సరిగా లేకుంటే పౌర సమాజం ప్రశ్నించాలని అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ సీతారామారావు అన్నారు. ప్రొఫెసర్ రమణమూర్తి మాట్లాడుతూ... 15వ ఆర్థిక సంఘం సిఫారసులతో దక్షిణాది రాష్ట్రాలకు పన్నుల వాటా తగ్గిందని చెప్పారు. ప్రొఫెసర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్రం నుంచి .25 వేల కోట్ల గ్రాంట్లు వస్తాయని బడ్జెట్‌లో చెబితే. 5 వేల కోట్లు కూడా రావడం లేదన్నారు.

రేపటి నుంచి భూ భారతి

(మొదటిపేజీ తరువాయి)



ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి

మండలాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. ఆ తర్వాత ఆరు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు. భూ సమస్యల పరిష్కారం, లావాదేవీల సమాచారం రైతులకు, ప్రజలకు సులభంగా, వేగంగా అందుబాటులో ఉండేలా భూ భారతి పోర్టల్ ఉంటుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. శనివారం భూభారతి చట్టం-2025తో పాటు మార్గదర్శకాలపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు పది రకాల లోగోలు ప్రదర్శించగా.. సీఎం సున్నితంగా తిరస్కరించారు. ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా లోగోకు శనివారం రాత్రికల్లా తుదిరూపు కల్పించి ఆదివారం తనకు అందజేయాలన్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. భూభారతిని ప్రారంభించడమే కాకుండా అర్నెల్లపాటు నిశితంగా గమనించాలని, రోజువారీ సమీక్ష చేసి, సంస్కరిస్తేనే భూభారతి ఫలాలు ప్రజలకు అందుతాయని అన్నారు. విజ్ఞప్తులను ఆన్‌లైన్‌లో కాకుండా నేరుగా మండల కార్యాలయాల్లో స్వీకరించడం, వాటిని ఏ విధంగా పరిష్కరించాలనే అంశాన్ని ప్రయోగాత్మకంగా మూడు మండలాల్లో అమలు చేయాలని నిర్దేశించారు.

భూభారతిపై ప్రజలకు అవగాహన కల్పించాలి..

భూభారతి చట్టంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్లను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతి మండలంలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా భూభారతి పోర్టల్ ఉండాలని అధికారులకు సూచించారు. పైలట్ ప్రాజెక్టులో ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలు స్వీకరించి పోర్టల్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రజలు, రైతులకు అర్థమయ్యేలా, సులభమైన భాషలో పోర్టల్ ఉండాలన్నారు. వెబ్‌సైట్‌తోపాటు యాప్‌ను పటిష్ఠంగా నిర్వహించాలని ఆదేశించారు. కాగా, రెండు గంటలకు పైగా జరిగిన సమీక్షలో భూభారతి కార్యాచరణ మార్గదర్శకాలపై ఏకాభిప్రాయం కుదిరింది. ఈ సమీక్షలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శులు వి.శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, సీఎం జాయింట్ సెక్రటరీ సంగీత సత్యనారాయణ, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రెవెన్యూ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, సీసీఎల్ఏ కార్యదర్శి మంద మకరంద్, భూ చట్టాల న్యాయనిపుణుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, భూభారతి చట్టాన్ని సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించేందుకు శిల్పకళా వేదికలో ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు కొత్త చట్టం అమల్లోకి రానుంది. భూభారతి -2025 చట్టం, పోర్టల్ ప్రారంభ ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారిని నియమించారు. ప్రముఖుల బందోబస్తు బాధ్యతలను సైబరాబాద్ కమిషనర్‌కు అప్పగించారు. ప్రొటోకాల్, ఇతర ఏర్పాట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు.

ఇందిరమ్మ ఇళ్లు అర్హులకే దక్కాలి: సీఎం

అత్యంత నిరుపేదలు, అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు దక్కాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గ్రామ స్థాయిలో లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీలు జాగ్రత్త వహించాలన్నారు. ఇందిరమ్మ కమిటీ తయారు చేసిన జాబితాను మండల అధికారులతో కూడిన (తహసీల్దార్, ఎంపీడీవో, ఇంజనీర్) బృందం క్షేత్ర స్థాయికి వెళ్లి తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎవరైనా అనర్హులకు ఇళ్లు దక్కితే తక్షణమే దానిని ఇందిరమ్మ కమిటీకి తెలిపి.. ఆ స్థానంలో మరో అర్హునికి ఇల్లు మంజూరు చేయాలన్నారు. శనివారం ముఖ్యమంత్రి తన నివాసంలో ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఎవరైనా దందాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అనర్హులు ఎవరైనా ఇల్లు దక్కించుకొని నిర్మించుకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు వారు పొందిన మొత్తాన్ని వసూలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుకు మంజూరైన ఇంటికి అతని సౌలభ్యం మేరకు అదనంగా 50 శాతం మేర నిర్మించుకునే అవకాశం కల్పించాలన్నారు. లబ్ధిదారుకు ఆర్థికపరమైన ఊరట కల్పించేందుకు సిమెంట్, స్టీల్ తక్కువ ధరలకు అందేలా చూడాలని సూచించారు.

ఆ భూములు హెచ్‌సీయూవి కావు

» కేంద్ర సాధికార కమిటీ చైర్మన్‌కు మల్లు రవి లేఖ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వానివని.. హెచ్‌సీయూవి కాదని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నిరాధారమైన, రాజకీయ ప్రేరేపిత ఆరోపణలు తెలంగాణ సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నంగా కనిపిస్తున్నాయన్నారు. ఆ భూములపై సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికార కమిటీ చైర్మన్ చంద్రప్రకాశ్ గోయల్‌ను శనివారం ఢిల్లీలో ఆయన కలిశారు. గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన ఐదు పేజీల లేఖను అందజేశారు. 'కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబర్ 25లో ఉన్న భూములు రెవెన్యూ రికార్డుల ప్రకారం పూర్తిగా ప్రభుత్వానివి. ఆ భూములు కంచ పోరంబోకుగా రికార్డుల్లో ఉన్నవి. ఈ భూమిని అటవీ భూమిగా ఎన్నడూ నోటిఫై చేయలేదు. 1975లో సర్వే నంబరు 25, ఇతర సర్వే నంబర్లలోని మొత్తం భూమిని హెచ్‌సీయూకు కేటాయించినా, యాజమాన్య హక్కులను రాష్ట్ర ప్రభుత్వం బదలాయించలేదు' అని లేఖలో వివరించారు. అలాగే అప్పట్నుంచి ఇప్పటివరకు ఆ భూములపై జరిగిన కోర్టు కేసులు, ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు అన్నింటిని లేఖలో ప్రస్తావించారు. ప్రజాప్రయోజనాలను పరిరక్షించడానికి, న్యాయాన్ని నిలబెట్టడానికి 400 ఎకరాల భూమి వాస్తవ స్థితిని సుప్రీంకోర్టు ముందుంచాలని కమిటీ చైర్మన్ చంద్రప్రకాశ్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే భూముల వ్యవహారంపై కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్, కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీకి లేఖలను సమర్పించారు.

కేటీఆర్ ఉల్లిగడ్డ బాంబూ వేయలేదు: చామల

» ఉద్యోగాలను అడ్డుకునేందుకు కేటీఆర్ కుట్ర: చనగాని

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): హైడ్రోజన్ బాంబు వేస్తామని చెప్పిన కేటీఆర్ కనీసం ఉల్లిగడ్డ బాంబు కూడా వేయలేదని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆయన కొండంత రాగం తీసి గోరంత పాట కూడా పాడలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం మీద బురద చల్లడమే కేటీఆర్ పనిగా పెట్టుకున్నారని, ఆయన మాటలకు అర్థం పర్థం లేదని కొట్టిపారేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా కేటీఆర్ కుట్ర చేస్తున్నాడని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. కంచ గచ్చిబౌలిలో ప్రభుత్వ భూమిని అటవీ భూమిగా చిత్రీకరించేందుకు బీఆర్ఎస్ భవన్‌లో నకిలీ ఫోటోలు, వీడియోలు సృష్టించారని మండిపడ్డారు.

బీఆర్ఎస్‌తో కలిసి పని చేసే ఆలోచనే లేదు: కూనంనేని

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌తో కలిసి పనిచేసే ఆలోచన సీపీఐకి లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని, బీఆర్ఎస్ తప్పుడు విధానాల వల్లే రాష్ట్రానికి ఈ గతి పట్టిందన్నారు. శనివారం మగ్దూంభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తో స్నేహబంధం కొనసాగిస్తూనే పోరాటం చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూములు అమ్మడం సరికాదని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరపడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. యూనివర్సిటీ భూముల విక్రయం వ్యవహారంలో బీజేపీ ఎంపీ ఎవరున్నారో కేటీఆర్ బయట పెట్టాలని డిమాండ్‌చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలనను గాలికి వదిలేసిందని, మత ప్రాతిపదికన విభజన రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సి వస్తే అన్ని రాష్ట్రాలకు సమన్యాయం చేయాల్సిందేనని, జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. ఎప్పటికి తామే అధికారంలో ఉండేలా కుట్రపన్నుతోందని ఆరోపించారు. కేంద్రం తక్షణం తెలంగాణ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని, 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కేంద్రమే కల్పించాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై కవిత బీజేపీతో యుద్ధం చేయాలని సూచించారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినా కేంద్రం సిద్ధంగా లేనట్లు వ్యవహరిస్తోందన్నారు.

అభివృద్ధిపై బీఆర్ఎస్ విషం కక్కుతోంది

సోషల్ మీడియాను వాడుకుని సర్కారుపై కుట్రలు.. రాజస్థాన్‌లో చనిపోయిన జింక పిల్ల ఫొటోతో దుష్ప్రచారం

» ఆ 400 ఎకరాల భూమి ప్రైవేటుపరం కాకుండా కాపాడాం

» 10 వేల కోట్ల కుంభకోణంపై కేటీఆర్ ఆధారాలు చూపాలి: శ్రీధర్‌బాబు



మీడియాతో మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ నేతలు విషం కక్కుతున్నారు. సోషల్ మీడియాను ఉపయోగించుకుని మా ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారు. ప్రైవేటుపరం కాబోతున్న 400 ఎకరాల భూమిని మా ప్రభుత్వం కాపాడింది. కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వానివేనని సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది'అని ఐటీ, పరిశ్రమల శాఖ శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం ఆయన గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్ల క్రితం రాజస్థాన్‌లో చనిపోయిన జింకపిల్ల హెచ్‌సీయూలో చనిపోయినట్లు, హెచ్‌సీయూ పరిసర ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్నట్లు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో చిత్రీకరించి, ప్రచారం చేశారని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. ఏఐతో సృష్టించిన కంటెంట్‌తో పాటు అసలు ఫొటోలను ఆయన మీడియాకు విడుదల చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దూరదృష్టితో 400 ఎకరాలను అభివృద్ధి చేస్తానంటే బీఆర్ఎస్ అడ్డుకుంటోందన్నారు. రూ.5,200 కోట్ల భూమిని రూ.30 వేల కోట్ల విలువైనది చూపించారని కేటీఆర్ అంటున్నారని, ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ద్వారా చేసిన సర్వే ప్రకారం కంచ గచ్చిబౌలి భూములకు రూ.23 వేల కోట్ల విలువ వచ్చిందని తెలిపారు. రూ.10వేల కోట్ల కుంభకోణం జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్న కేటీఆర్... దానికి ఆధారాలు ఎందుకు చూపడం లేదని శ్రీధర్ బాబు ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయంలో సర్కారు భూములను తమకు నచ్చిన వారికి అప్పనంగా కట్టబెట్టారన్నారు. గత సర్కారు ఎన్నో ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేసిందని, అప్పుడు పర్యావరణ పరిరక్షణ గుర్తు రాలేదా అని నిలదీశారు. కాళేశ్వరం కోసం 8 వేల ఎకరాల అడవులను తొలగించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. హైదరాబాద్ పరిధిలో జంట జలాశయాలకు నష్టం చేసేలా జీవో 111ను ఎత్తివేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. హరితహారం పేరిట రూ.10 వేల కోట్లు ఖర్చు పెట్టారని, మరి రాష్ట్రంలో పచ్చదనం ఎందుకు పెరగలేదన్నారు. 2016-19 మధ్య 12.12 లక్షల చెట్లను నిబంధనలకు విరుద్ధంగా తొలగించినట్లు కేంద్రమే లోక్‌సభలో వెల్లడించిన విషయం వాస్తవం కాదా అని మంత్రి ప్రశ్నించారు. కంచగచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టి సర్కారు అప్పు తీసుకుందన్న విపక్షాల ఆరోపణలను శ్రీధర్‌బాబు ఖండించారు. ఆ భూములపై ఐసీఐసీఐ బ్యాంకు రుణం ఇవ్వలేదని చెప్పారు. కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సచివాలయానికి వస్తే తప్పేంటని ప్రశ్నించారు. సెక్రటేరియట్‌లో ఆమె ఎలాంటి సమీక్షలు చేయలేదని స్పష్టం చేశారు.

మహిళా పారిశ్రామిక పార్కులు

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో మహిళల కోసం పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గ్రామీణ మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. శనివారం హైటెక్స్‌లో ప్రారంభమైన 'ఫుడ్ ఏ ఫెయిర్' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, హైటెక్స్ ఎగ్జిబిషన్స్, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆహార ఉత్పత్తిదారులు, ఆహార శుద్ధి, ప్యాకేజింగ్ రంగ నిపుణులు, చెఫ్స్ తదితరులు పాల్గొని వివిధ అంశాలపై చర్చిస్తారని చెప్పారు. ఐటీ, ఫార్మా మాదిరిగానే వ్యవసాయ, వ్యవసాయాధారిత పరిశ్రమల రంగంలోనూ తెలంగాణను దేశంలోనే మొదటి స్థానంలో నిలపడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఇప్పటికే రూ.16వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. రాబోయే రోజుల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

కేటీఆర్.. ఆ బ్రోకర్ ఎవరో చెప్పు

» హెచ్‌సీయూ భూముల విక్రయంలో.. రేవంత్‌తో ఉన్న బీజేపీ ఎంపీ ఎవరు?

» ప్రెస్‌మీట్లు తప్ప బీఆర్ఎస్ చేసిందేమిటి..?

» 6 గ్యారెంటీలపై కొట్లాడని అసమర్థ పార్టీ

» పేదలకు ఇచ్చేది బరాబర్ మోదీ బియ్యమే

» కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ గ్యారెంటీలపై అడుగడుగునా నిలదీస్తున్నది, హెచ్‌సీయూ భూములపై పోరాడుతున్నది తామేనని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. హెచ్‌సీయూ భూముల అమ్మకంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఒక బీజేపీ ఎంపీ సహకరిస్తున్నారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సంజయ్ మండిపడ్డారు. కేటీఆర్‌కు దమ్ముంటే, ఆయన వద్ద ఆధారాలుంటే.. ఆ బ్రోకర్ ఎవరో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. హనుమాన్ శోభా యాత్రను పురస్కరించుకుని సంజయ్ శనివారం సాయంత్రం గోషామహల్ నియోజకవర్గంలోని ఆకాశ్‌పురి హనుమాన్ ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన రాజాసింగ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఏనాడైనా ఆరు గ్యారెంటీలపై కొట్లాడిందా..? అని ప్రశ్నించారు. ప్రెస్‌మీట్లు పెట్టడం తప్ప బీఆర్ఎస్ చేసిన పోరాటాలు ఏంటని నిలదీశారు. కేటీఆర్‌ను ప్రజలు ఓడగొట్టినా అహంకారం తగ్గలేదని.. ఆయన అహంకారాన్ని దించుతామని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ అవినీతికి సంబంధించిన ఆధారాలను కేటీఆర్ ఎందుకు బయటపెట్టలేదని నిలదీశారు. ఎందుకంటే రేవంత్‌రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ ఒక్కటేనని అన్నారు. "బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్‌లారా.. మీరు మళ్లీ వచ్చేసారి కార్పొరేటర్లుగా గెలవాలనుకుంటున్నారు కదా..? మీకు ఓట్లేసి గెలిపించేది హిందువులే తప్ప అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం నేతలు, రేవంత్‌రెడ్డి, కేటీఆర్ కాదనే విషయాన్ని గుర్తుంచుకోండి. ఒక వేళ హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో మీరు ఎంఐఎం అభ్యర్థికి ఓటు వేస్తే.. హిందూ సమాజమంతా ఒక్కటై మిమ్మల్ని ఓడించడం తథ్యం" అని సంజయ్ హెచ్చరించారు. ఓటేసే ముందు కార్పొరేటర్లంతా తమ తమ డివిజన్ ప్రజలతోపాటు కుటుంబ సభ్యుల మనోభావాలను తెలుసుకుని ఓటేయాలని కోరారు. హిందూ సమాజ సంఘటిత శక్తిని ప్రదర్శించేలా రాజాసింగ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గొప్ప ర్యాలీ నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. సమాజ ధర్మం, బీజేపీ సిద్ధాంతాల కోసం పనిచేసే కట్టర్ కార్యకర్త రాజాసింగ్ అని.. ఆయనతో తమకు ఎలాంటి విబేధాలు లేవని అన్నారు.

రాహుల్ మెప్పు కోసం ఆరాటం

రాహుల్ గాంధీ మెప్పు పొందేందుకు సీఎం రేవంత్ రెడ్డి, మోదీపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని సంజయ్ అన్నారు. కేసీఆర్ కూడా గతంలో ఇలానే మోదీపై అడ్డగోలుగా మాట్లాడారని.. అప్పుడు బీఆర్ఎస్‌కు పట్టిన గతే ఇప్పుడు కాంగ్రెస్‌కూ పడుతుందన్నారు. రేషన్ ద్వారా అమ్మే బియ్యంలో కిలోకు రూ.37 ఇస్తోంది కేంద్రమేనని, అలాంటప్పుడు అవి కాంగ్రెస్ ఇస్తున్న బియ్యం ఎలా అవుతాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎన్ని చెప్పినా.. రేషన్ షాపులో ఇచ్చేది మోదీ బియ్యమేనని స్పష్టం చేశారు. రేషన్ బియ్యం కోసం కేంద్రం ఏటా రూ.వేల కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు.

రాజాసింగ్‌ను కలిసిన గౌతమ్ రావు

హనుమాన్ శోభా యాత్రలో రాజాసింగ్‌ను హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గౌతమ్ రావు కలిశారు. ఈ సందర్భంగా రాజాసింగ్.. గౌతం రావుకు శాలువా కప్పి అభినందించారు. రాజాసింగ్, గౌతమ్ రావుతో బండి సంజయ్ కాసేపు మాట్లాడారు.

కోటిన్నర ఇల్లు కట్నం ఇవ్వడం ఇష్టంలేకే..

» సవతి కూతురును తన ప్రియుడితో కలిసి చంపిన తల్లి

» వివాహేతర బంధం గుట్టు తెలిసిందనీ కక్ష

» ఆమె భర్తకు చెందిన రూ.5 కోట్ల ఆస్తిని కొట్టేయాలని ప్రణాళిక

హైదరాబాద్ సిటీ/పీర్జాదిగూడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆ తల్లికి ఆమె సవతి కూతురు! ఆమెకు మళ్లీ పెళ్లిచేసి.. రూ.కోటిన్నర విలువ చేసే ఇంటిని కట్నంగా ఇవ్వాలని తండ్రి ఆలోచన చేస్తుంటే.. ఆ తల్లి ఆలోచన వేరుగా ఉంది! అంత ఖరీదైన ఇంటిని సవతి కూతురుకు ఇవ్వడం ఆ తల్లికి ఏమాత్రం ఇష్టం లేదు. పైగా గుట్టుగా తన మేనబావతో సాగిస్తున్న వివాహేతర సంబంధం గురించీ ఆ సవతి కూతురికి తెలిసిపోయింది! ఆ బంధాన్ని ఇకముందూ కొనసాగించాలన్నా.. ఇంటిని కాపాడుకోవాలనుకున్నా.. మొత్తంగా భర్తకు ఉన్న రూ.5కోట్ల ఆస్తిని పూర్తిగా తనకే దక్కాలన్నా ఆమె బతికి ఉండకూడదు అని ఆ సవతి తల్లి భావించింది. ఆమె హత్యకు పథకం వేసింది. ఈ మేరకు మేడిపల్లి పరిధిలో వెలుగుచూసిన 26 ఏళ్ల యువతి హత్య కేసులో విస్తుబోయే నిజాలు వెలుగుచూశాయి. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని.. ఖరీదైన ఇంటినీ తీసుకెళుతోందని కక్షగట్టి తన భర్త పీనా నాయక్ మొదటి భార్య కుమార్తె మహేశ్వరిని లలిత హత్యచేసిందని పోలీసుల విచారణలో తేలింది. బోడుప్పల్‌లో నివాసముంటున్న జాటోత్ పీనానాయక్ ఓయూలో లైబ్రేరియన్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు మహేశ్వరి ఉన్నారు. భార్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమెకు విడాకులిచ్చాడు. ఇప్పటి నుంచి కుమారుడు తల్లి వద్దే ఉంటుంటే, కూతురు మహేశ్వరి తండ్రి వద్ద ఉంటోంది. కొన్నాళ్లకు పీనా నాయక్ తనకన్నా వయసులో చాలా చిన్నదైన లలిత అనే మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఓ కూతురు పుట్టింది. కాగా లలిత తన మేనబావ, సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి రవితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఇది మహేశ్వరి దృష్టికి రావడంతో అప్పటి నుంచి లలితతో ఆమె సరిగా ఉండటం లేదు. ఇక.. మహేశ్వరికి పెళ్లి చేయాలని నిర్ణయించిన పీనా నాయక్ ఓ సంబంధం కుదిర్చాడు. నిశ్చితార్థం కూడా జరిగింది. తనకున్న ఆస్తిలో తన బిడ్డ వాటా కింద కోటిన్నర విలువైన ఇంటిని కట్నంగా ఇవ్వడానికి పీనా నాయక్ సిద్ధపడ్డాడు.. అంత ఖరీదు చేసే ఇల్లును కట్నంగా తీసుకెళ్తున్న విషయం నచ్చని సవతి తల్లి లలిత భర్తతో పలుమార్లు గొడవ పెట్టుకుంది. ఎంతకీ భర్త తన నిర్ణయం మార్చుకోకపోవడంతో మహేశ్వరిపై కక్ష పెంచుకుంది. తన ప్రియుడు రవితో కలిసి మహేశ్వరి హత్యకు పథకం వేసింది. ఆ తర్వాత భర్త సంగతి చూద్దామని ప్లాన్ వేసింది.

పాలల్లో మత్తుమందు కలిపి, మెడకు ఉరిబిగించి..

తన పథకంలో భాగంగా ముందుగా మహేశ్వరికి కుదిరిన పెళ్లి సంబంధాన్ని లలిత, రవి చెడగొట్టారు. కొన్నాళ్లకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహేశ్వరి తాగే పాలలో మత్తు మందు కలిపారు. ఆ పాలు తాగి ఆమె మత్తులోకి జారుకోగానే ప్రియుడు రవి, అతడి బంధువు వీరన్న సాయంతో లలిత మహేశ్వరి మెడకు ఉరి బిగించి హత్య చేసింది. మృతదేహాన్ని ఒక గోనె సంచీలో వేసుకొని వీరన్న.. కారులో నల్లగొండ జిల్లా శాలిగౌరారం దగ్గరలోని మూసీ పరీవాహక ప్రాంతంలోకి తీసుకెళ్లి పాతిపెట్టారు. ప్లాన్ ప్రకారం మహేశ్వరి ఫోన్ నుంచి లలిత ఫోన్‌కు "నేను ప్రియుడితో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోతున్నాను. ఇక ఇంటికి తిరిగి రాను" అని మెసేజ్ పెట్టారు.. తర్వాత కూతురు ఇంట్లోంచి వెళ్లిపోయిందంటూ భర్త పీనా నాయక్‌కు లలిత ఆ మెసేజ్ చూపించింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరువు పోతుందని, ఆమె బతుకేదో ఆమెను బతుకనివ్వండంటూ పోలీసులకు ఫిర్యాదు చేయకుండా భర్తను అడ్డుకుంది. అయితే భార్యకు తెలియకుండా పీనానాయక్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి.. కూతురు గురించి చెప్పాడు. లలితపై అనుమానం రావడంతో ఆమెను గట్టిగా నిలదీసే సరికి అంతా చెప్పేసింది. లలిత, ఆమె ప్రియుడు రవి, వీరన్నలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కోమ్మా రెమ్మా కన్నీరు!

- గుండెపోటుతో వనజీవి రామయ్య కన్నుమూత
- కోటికిపైగా మొక్కలు నాటి వనజీవిగా ఖ్యాతి
- ప్రకృతి సేవకుడికి 2017లో పద్మశ్రీ పురస్కారం
- పాఠ్యాంశంగా పుస్తకాల్లో 'వనజీవి రామయ్య'




రామయ్యకు నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల.. నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా పద్మశ్రీ అందుకుంటున్న రామయ్య

ఖమ్మం, న్యూఢిల్లీ, అమరావతి, హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)/ఖమ్మం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అశోకుడు మొక్కలు నాటించాడనే సంగతి పుస్తకాలకే ఎందుకు పరిమితమవ్వాలి? ఆ చొరవను మనం ఆచరణలోనూ చూపలేమా? అనే గొప్ప సామాజిక స్పృహ ఆయనది! బొమ్మలతో ఆడుకునే ఐదేళ్ల ప్రాయంలో పచ్చదనం మీద ప్రేమతో మొక్కలు నాటారాయన! మొక్కలు నాటేందుకు ఖర్చుల కోసం కొంతభూమిని అమ్మేందుకూ వెనుకాడలేదాయన! పుటుక నీది.. చావు నీది బతుకంతా దేశానిది అని కాళోజీ అంటే.. బతుకంతా ప్రకృతి సేవలోనే గడిపి.. మొక్కలు నాటడాన్ని, వాటిని పరిరక్షించడాన్నే కర్తవ్యంగా భావించి.. ఏకంగా కోటికిపైగా మొక్కలు నాటి వనజీవిగా పేరొందిన దరిపల్లి రామయ్య (79) కన్నుమూశారు. శనివారం ఉదయం గుండెపోటుతో ఆయన నిద్రలోనే మృతిచెందారు. ఆయన స్వస్థలం ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి. దరిపల్లి లాలయ్య, పుల్లమ్మ దంపతులకు 1946 జూలై 1న రామయ్య జన్మించారు. ఐదేళ్ల వయసు నుంచే మొక్కలు నాటేవారు. ముత్తగూడెంలో ప్రాథమిక విద్య పూర్తిచేశారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో పశువుల కాపరిగా మారారు. 1967లో జానమ్మను పెళ్లి చేసుకున్నారు. రామయ్య దంపతులకు కుమారులు సైదులు, సత్యనారాయణ, కనకయ్య, కూతురు సైదమ్మ ఉన్నారు. సైదులు, సత్యనారాయణ అనారోగ్యంతో మృతిచెందారు. రామయ్య కుటుంబానికి గతంలో ఏడెకరాల భూమి ఉండేది. మొక్కలు నాటేందుకు ఖర్చులకోసం మూడెకరాలను రామయ్య అమ్మారు. రహదారుల వెంట మొక్కలు నాటుతూ, రోడ్ల వెంట ఉన్న చెట్ల వద్ద కాయలు ఏరి వాటి నుంచి వచ్చిన గింజలను ఖాళీస్థలాలు, కొండలపై జల్లుతూ ఉండేవారు. ఎవరైనా మొక్కలు కావాలని ఆయన దగ్గరకు వెళితే ఉచితంగానే గింజలు, మొక్కలను అందించేవారు. పచ్చదనంపై విస్తృత ప్రచారం చేయడమే కాకుండా ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ మొక్కలు నాటడం, 'వృక్షో రక్షతి రక్షితః' అంటూ నినాదాలు రాయడం చేసేవారు. ఇంట్లో గిన్నెలు, పాత్రలు, బీరువాలు, గోడలు ఎక్కడైనా ప్రకృతికి సంబంధించిన నినాదాలే రాసేవారు. తన కుమారుడు, కూతురు పెళ్లిళ్ల శుభలేఖపై కూడా మొక్కలు నాటాలని, వాటిని పరిరక్షించాలని నినాదాలను ముద్రించారు.

అద్భుతమైన శిల్పి కూడా

"వృక్షో రక్షతి రక్షితః" అనేది రామయ్య నమ్మిన నినాదం.. దాన్ని ఓ ఇనుప ప్లేటుపై రాసి మెడలో హారంగా వేసుకుని తిరిగేవారు. రామయ్య అద్భుతమైన శిల్పి కూడా. తన ఇంటి వద్ద గ్రానైట్ రాళ్లపై శిల్పాలను చెక్కేవారు. ఆ శిల్పాలపై కూడా వృక్షోరక్షతి రక్షితః అంటూ నినాదాలు చెక్కేవారు. 2000లో వనజీవి సేవలను గుర్తించిన నాటి సీఎం చంద్రబాబు, ఆనాటి ఆర్అండ్‌బీ మంత్రి తుమ్మల.. రామయ్యకు బైక్ బహూకరించి, దాని పెట్రోలు ఖర్చులకు నెలకు రూ.1500 మంజూరు చేశారు. నాటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన జన్మభూమి కార్యక్రమంలోనూ రామయ్య పాలుపంచుకున్నారు. కాగా, రామయ్య కృషిని గుర్తించిన మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థుల కోసం 9వ తరగతిలో రామయ్య జీవితాన్ని పాఠ్యాంశంగా బోధిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఆరో తరగతి సాంఘికశాస్త్రంలో వనజీవి గురించి పాఠ్యాంశం పొందుపరిచింది. రామయ్య మొక్కలపై ఉన్న ప్రేమతో తన నలుగురు మనవరాళ్లకు కబంద పుష్పం, చందన పుష్పం, వనశ్రీ, హరితారణ్య అనే పేర్లు పెట్టి మొక్కలపై తనకున్న ప్రేమను చాటారు. అయితే కరెన్సీ నోట్లపై మొక్కల ఫొటోలను ముద్రించాలని, గ్రీన్ కరెన్సీ రావాలని రామయ్య కోరుకునేవారు. ప్రభుత్వాల పెద్దలను కలిసినప్పుడు వారికి ఈ విషయాలనే చెప్పేవారు. కాగా, రామయ్య ప్రధానమంత్రులు, పలువురు ముఖ్యమంత్రుల నుంచి ప్రశంసలు పొందారు. నాటి చంద్రబాబు నాయుడుతో పాటు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సత్కారాలు పొందారు. 2013 ఏప్రిల్ 8న బెంగుళూరుకి చెందిన అకాడమీ ఆఫ్ యూనవర్సల్ గ్లోబల్ పీస్ అనే సంస్థ వారు వనజీవి రామయ్యకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. నాటి ప్రధాని పీవీ నరసింహారావు, ఉమ్మడి ఏపీలో సీఎంలు చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, నాటి గవర్నర్ సుశీల్‌కుమార్ షిండే చేతుల మీదుగా రామయ్య ప్రశంసలు, సన్మానాలు అందుకున్నారు. 2017లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా పద్మశ్రీ అందుకున్నారు. 2018లో మంత్రి తుమ్మల స్వయంగా రామయ్య ఇంటికి వెళ్లి డబుల్‌బెడ్రూం ఇల్లు కట్టించి ఇచ్చారు.

సుస్థిరత గళం వినిపించిన వ్యక్తి రామయ్య: మోదీ

లక్షల సంఖ్యలో చెట్లను నాటడానికి, వాటిని రక్షించడానికి దరిపల్లి రామయ్య తన జీవితాన్ని అంకితమిచ్చారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన అవిశ్రాంత కృషి.. ప్రకృతి పట్ల గాఢమైన ప్రేమనూ, భవిష్యత్తు తరాల పట్ల బాధ్యతను ప్రతిబింబిస్తాయన్నారు. సుస్థిరత కోసం గళం వినిపించిన వ్యక్తిగా రామయ్య గుర్తుండిపోతారని ఎక్స్ వేదికగా మోదీ పేర్కొన్నారు. రామయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రామయ్య మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు.

సమాజానికి తీరని లోటు: సీఎం రేవంత్

రామయ్య మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ప్రకృతి, పర్యావరణం లేనిదే మానవాళికి మనుగడ లేదనే సిద్ధాంతాన్ని బలంగా నమ్మిన వ్యక్తి దరిపల్లి రామయ్య అని, ఆయన మరణం సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. రామయ్య మృతి బాధాకరమని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ పేర్కొన్నారు. వనజీవి' రామయ్య కన్నుమూశారని తెలిసి చింతించానని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలిపారు.

ధరిత్రి ముద్దుబిడ్డ వనజీవి రామయ్య: తుమ్మల

పర్యావరణ ప్రేమికుడిగా మొక్కలే ప్రాణంగా జీవించిన మహోన్నత వ్యక్తి, ధరిత్రి ముద్దుబిడ్డ వనజీవి రామయ్య మృతి దేశానికి తీరనిలోటు అని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. తుమ్మల హైదరాబాద్ నుంచి ఖమ్మం వచ్చి రామయ్య మృతదేహంపై పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తంచేశారు. రామయ్య మరణం దేశానికి, రాష్ట్రానికి తీరనిలోటు అని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. రామయ్య అకాల మృతి ప్రకృతి ప్రేమికులకు తీరనిలోటు అని, ఆయన పర్యావరణ పరిరక్షణలో స్ఫూర్తి నింపిన మహనీయుడు అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రామయ్య మృతిపట్ల టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంతాపం తెలిపారు.

కారడవిలో కాలి నడక

- 2 కి.మీ దూరం కాలిబాటలో ప్రయాణం
- ఉపాధి కూలీల సమస్యలపై ఆరా
- పర్వతాపూర్, కాట్రియాలలో మెదక్ కలెక్టర్ పర్యటన



పర్వతాపూర్ అడవిలో వెళుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

రామాయంపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కారడవిలో రెండు కి.మీ దూరం నడిచి వెళ్లారు. ఉపాధి హామీ కూలీ పనుల కొలతలు తీశారు. స్వయంగా తానే టేపుతో కూలీల ట్రంచ్ పనుల లెక్కలు తేల్చారు. తదుపరి స్కూల్‌లో పిల్లలకు లెక్కలు చెప్పి మాస్టారి అవతారం ఎత్తారు. ఆయనెవరో కాదు.. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్. రామాయంపేట మండలం పర్వతాపూర్ అడవిలో కొనసాగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను శనివారం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. సుమారు 40 నిమిషాలు ఉపాధి హామీ కూలీలతో ముచ్చటించి.. నేరుగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొలతలు సరిగ్గా వేస్తున్నారా..? మీ పనివేళలు ఏమిటి..? అని అడుగుతూనే ఎండలో ఎక్కువసేపు పనిచేసి వడదెబ్బ బారిన పడొద్దంటూ కూలీలకు జాగ్రత్తలు చెప్పారు. కూలీల కుటుంబ వివరాలు, మౌలిక సదుపాయాలనూ తెలుసుకున్నారు. ఇది ఉపాధి పథకం ప్రారంభ సీజన్ కనుక అత్యధిక సంఖ్యలో కూలీలను పనుల్లో చేరేలా చూడాలని ఎంపీడీవో సాహలుద్దీన్‌ను ఆదేశించారు. అనంతరం కాట్రియాల గ్రామంలో మధ్యాహ్న భోజన వంటకాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అటుపై స్కూల్‌లో పిల్లలకు పాఠాలు చెప్పి మాస్టారుగా మారారు. అంగన్‌వాడీ కేంద్రంలో పాటలు, పద్యాల రూపంలో చిన్నారుల మేధస్సును పరీక్షించారు. వినూత్నంగా జిల్లా కలెక్టర్ పర్యటించడం ఇదే తొలిసారి కాదు. గత నెల 18న పొలం బాట పట్టిన కలెక్టర్ రాహుల్ రాజ్.. 23న సైకిల్‌పై 20 కి.మీ దూరం ప్రయాణించి రామాయంపేట బస్టాండ్‌ను తనిఖీ చేశారు.

ఏపీ ఇంటర్ ఫలితాల విడుదల

- ఇంటర్‌లో భారీగా పెరిగిన ఉత్తీర్ణత
- ద్వితీయ సంవత్సరంలో 83% మంది..
- ప్రథమ సంవత్సరంలో 70% పాస్

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది. రెండో సంవత్సరం 83శాతం, మొదటి సంవత్సరం 70శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలను మంత్రి లోకేశ్ శనివారం ఉదయం 11గంటలకు విడుదల చేశారు. గత పదేళ్లలో ఎప్పుడూ లేనివిధంగా అత్యధిక ఉత్తీర్ణత శాతం ఈ ఏడాదే నమోదైంది. ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు నమోదు చేశారు. రెండు సంవత్సరాల్లోనూ బాలుర కంటే బాలికలే అత్యధికంగా ఉత్తీర్ణత సాధించి సత్తా చాటుకున్నారు. ద్వితీయ సంవత్సరంలో 80శాతం మంది బాలురు, బాలికలు 84శాతం, ప్రథమ సంవత్సరంలో బాలురు 66శాతం, బాలికలు 75శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గ్రూపుల వారీగానూ ఈసారి ఉత్తమ ఫలితాలే వచ్చాయి. జిల్లాల వారీగా సెకండ్ ఇయర్ ఫలితాల్లో 93శాతం ఉత్తీర్ణతతో కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. గుంటూరు (91%), ఎన్టీఆర్ (89%) జిల్లాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక మొదటి సంవత్సరం ఫలితాల్లో కూడా తొలి మూడుస్థానాల్లో వరుసగా కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలే ఉండటం విశేషం. ఇక సెకండ్ ఇయర్‌లో 73శాతంతో అల్లూరి సీతారామరాజు జిల్లా, ఫస్ట్ ఇయర్‌లో 54 శాతంతో చిత్తూరు జిల్లా అట్టడుగు స్థానాల్లో నిలిచాయి. ఇంటర్ ఒకేషనల్ ఫస్ట్ ఇయర్‌లో 62శాతం, సెకండ్ ఇయర్‌లో అత్యధికంగా 77శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తంగా అన్ని యాజమాన్యాల కాలేజీల్లోనూ గతేడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం భారీగా పెరిగింది.

మే 12 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను మే 12 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు తెలిపింది. అలాగే అవే తేదీల్లో విద్యార్థులు ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలకు కూడా హాజరుకావచ్చని పేర్కొంది. ఈ నెల 15 నుంచి 22లోగా సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి గడువుగా పేర్కొంది. అలాగే ఈ నెల 13 నుంచి 22 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని వెల్లడించింది.

రాష్ట్రంలో మండుతున్న ఎండలు

- మంచిర్యాల జిల్లాలో 43.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- పలు ప్రాంతాలకు ఆరెంజ్ అలెర్ట్.. నేడు, రేపు వర్షసూచన

(ఆంధ్రజ్యోతి నెట్ వర్క్), ఏప్రిల్ 12: రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతుండటంతో ఎండ వేడికి తట్టుకోలేక జనం ఏసీలను, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. వాతావారణశాఖ పలు ప్రాంతాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. శనివారం మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కొండాపూర్‌లో అత్యధికంగా 43.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణశాఖ తెలిపింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలో 43 డిగ్రీలు, కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కొత్తపల్లిలో 42.3 డిగ్రీలు, జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో 42.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 41.4 డిగ్రీలు, జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్‌లో 40.3 డిగ్రీలు, పెద్దపల్లి జిల్లా రామగుండం, మహబూబ్‌నగర్ జిల్లాలో 40 డిగ్రీలు, వనపర్తి జిల్లా కొత్తకోటలో 39.2 డిగ్రీలు, నారాయణపేట, నాగర్‌కర్నూలు జిల్లాల్లో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ పేర్కొంది. కాగా.. ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురు గాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఆదివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి, నాగర్‌కర్నూలు, ములుగు, భూపాలపల్లి, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నెల 14 నుంచి ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.

ఇంటర్ ఫలితాల్లో నారాయణ రికార్డు

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో శనివారం విడుదలైన ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థలు రికార్డుల మోత మోగించాయని నారాయణ గ్రూప్ డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, అన్ని గ్రూపుల్లో స్టేట్ టాప్ మార్కులతో అదరగొట్టినట్టు పేర్కొన్నారు. జూనియర్ ఎంపీసీలో స్టేట్ ఫస్ట్ మార్కులు 468తో ఒకరు, 467 మార్కులు ఆపైన 8 మంది, 466 మారులు ఆపైన 55 మంది, 465 మార్కులు ఆపైన 293 మంది, 460 మార్కులు ఆపైన 2,761 మంది, జూనియర్ బైపీసీలో నలుగురు 436 మార్కులు, 27 మంది 435 మార్కులు, సీనియర్ ఇంటర్‌లో ముగ్గురు 992 మార్కులు, 39 మంది 990 మార్కులు, 93 మంది 989 మార్కులు, 181 మంది 988 మార్కులు, 278 మంది 987 మార్కులు సాధించినట్టు తెలిపారు. జేఈఈ మెయిన్/అడ్వాన్స్‌డ్, నీట్ పరీక్షల్లోనూ తమ విద్యార్థులు అత్యద్భుత ర్యాంకులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇంటర్‌లో శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్కులు

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో శనివారం విడుదలైన ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు స్టేట్ టాప్ మార్కులు సాధించారని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఎంపీసీలో బుక్కే యశ్వంత్ నాయక్, ముంద్రు వినూతన స్టేట్ టాప్ మార్కులు 467తోపాటు, 48 మంది 466 ఆపైన, 291 మంది 465 ఆపైన, 2,628 మంది 460 ఆపైన మార్కులు సాధించారని పేర్కొన్నారు. జూనియర్ బైపీసీలో చల్లా లేఖన స్టేట్ ఫస్ట్ మార్కులు 437తోపాటు 16 మంది 436 ఆపైన, 109 మంది 435 ఆపైన, 834 మంది 430 ఆపైన, సీనియర్ ఎంపీసీలో కాంచన మానస, గంగవరం లహరి, కూర్మదాసు శ్రీజ స్టేట్ ఫస్ట్ మార్కులు 992, సీనియర్ బైపీసీలో షేక్ అఫీఫా తబస్సుం స్టేట్ టాప్ మార్కులు 992 సాధించినట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 992 ఆపైన నలుగురు, 991 ఆపైన 17 మంది, 990 ఆపైన 45 మంది, 985 ఆపైన 625 మంది, 980 ఆపైన 1,800 మంది, 900 ఆపైన 24,331 మంది సాధించినట్టు పేర్కొన్నారు. విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.